ఆదివారం
20-10-2024

సంపుటి : 20
సంచిక : 26
పేజీలు : 12, వెల : 4 రూ.
thecrimenewsd@gmail.com

Crime News
ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
అనుభవజ్ఞులకు ప్రాధాన్యత ఇవ్వబడును
అనతికాలంలోనే విశేష ప్రజాదరణ పొందుతున్న ది క్రైమ్ న్యూస్ దిన పత్రికకు ఉమ్మడి జిల్లాలకు స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకర్గాల వారిగా ఆర్‌సీ ఇంచార్జిలు మండల రిపోర్టర్లు కావలెను.
వివరాలకు...
D. SAINATH REDDY...
6305584064

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

# ముగ్గరు యువకులకు శిరోముండనం


## యువకుడి ఆత్మహత్యా యత్నం - పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు




**నాగర్‌కర్నూల్:** జిల్లాలో అమానుషం చోటు చేసుకుంది. ఓ కేసు విషయంలో లింగాల పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ముగ్గురు యువకులతో ఓ ఎస్సై దురుసుగా ప్రవర్తించాడు. తన ముందే ఓ యువకుడు తల దువ్వుకున్నాడని కోపంతో ఊగిపోయిన ఎస్సై.. ముగ్గురు యువకులకు గుండు గీయించాడు. దీంతో మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్యకు యత్నించాడు. నాగర్‌కర్నూలు జిల్లా లింగాల వద్ద ఓ పెట్రోల్ బంక్ సిబ్బందితో ముగ్గురు యువకులకు ఇటీవల గొడవ జరిగింది. దీనిపై పెట్రోల్ బంక్ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముగ్గురు యువకులను మిగతా 2లో..

# నిజామాబాద్ జిల్లాలో దారుణం

## మహిళను ఆటోలో ఎక్కించుకుని అత్యాచారం




**నిజామాబాద్:** నిజామాబాద్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. ఓ మహిళపై నలుగురు దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆటోలో మహిళను ఎక్కించుకుని తీసుకెళ్లి వారు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు. శుక్రవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకోగా.. శనివారం ఉదయం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాత్రి ఒంటరిగా ఉన్న మహిళను పలువురు వ్యక్తులు ఆటోలో నిజామాబాద్ బస్టాండ్ వద్ద ఎక్కించుకున్నారు. అక్కడి నుంచి డిచ్‌పల్లి ప్రాంతానికి తీసుకువెళ్లి అఘాయి త్యానికి పాల్పడ్డారు. అనంతరం బాధితురాలు నగరానికి మిగతా 2లో..

## మరోమారు రోడ్డెక్కిన

# గ్రూప్-1 అభ్యర్థులు

- ఆందోళనకు బండి సంజయ్ తదితరుల మద్దతు
- చలో సెక్రేటరియట్‌ను అడ్డుకున్న పోలీసులు
- బండి సంజయ్ అరెస్ట్..బిజెపి అఫీస్‌కు తరలింపు




**హైదరాబాద్:** గ్రూప్ 1 అభ్యర్థుల ఆందోళనతో అశోక్‌నగర్‌లో ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. జీవో నెంబర్ 29ని రద్దు చేసి జీవో నెం 55ను అమలు చేయాలంటూ నిరు ద్యోగులు శనివారం ఆందోళనలకు పిలుపునిచ్చారు. వీరి నిరసనకు కేంద్రమంత్రి బండి సంజయ్ మద్దతు తెలిపారు. బండి సంజయ్‌తో పాటు బీజేపీ శ్రేణులు పెద్దఎత్తున అశోక్‌నగర్ చేరుకుని ఆందోళన చేస్తున్న అభ్యర్థులకు మద్దతు తెలుపుతూ నిరసనకు దిగారు. ఈ క్రమంలో ఛలో సెక్రటేరియట్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆందోళన కాస్త తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ఎట్టిపరిస్థితుల్లోనూ సెక్రటేరియట్‌కు వెళ్లి తీరతామని బండి సంజయ్ స్పష్టం చేశారు. దీంతో పెద్ద ఎత్తున పోలీసులు అక్కడకు చేరుకుని కేంద్రమంత్రిని మిగతా 2లో..

## గాంధీ కుటుంబాలది

# త్యాగాల చరిత్ర

- దోపిడీ చేసిన చరిత్ర కెసిఆర్ కుటుటంబానిది
- హైడ్రా ఆక్రమణదారుల్లో అంకుశంలా పనిచేస్తోంది
- రాజీవ్ సద్భావనా యాత్రలో సిఎం రేవంత్ నిప్పులు



**హైదరాబాద్:** తెలంగాణను దోపిడీ చేసిన చరిత్రి కేసీఆర్ కుటుంబానిది కాగా, దేశం కోసం తమ ప్రాణాలు సైతం అర్పించిన ఘనత గాంధీ కుటుంబానిదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. దేశం కోసం ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ తమ ప్రాణాలు సైతం అర్పించారని.. అదే విధంగా సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి పదవిని సైతం త్యాగం చేశారని రేవంత్ పేర్కొన్నారు. చార్మినార్ వద్ద ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ సద్భావనా యాత్ర స్మారక దినోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. మాజీ మంత్రి గీతారెడ్డికి రాజీవ్ గాంధీ సద్భావనా అవార్డును సీఎం రేవంత్ రెడ్డి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. దేశ సమగ్రత కోసం రాజీవ్ గాంధీ 34 ఏళ్ల క్రితం సద్భావన యాత్ర చేపట్టారు. ప్రతి ఏడాది అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ వస్తున్నాం. సుదీర్ఘ కాలం ప్రజలకు సేవలు అందించిన మాజీ మంత్రి గీతా రెడ్డిని సద్భావన అవార్డుకు ఎంపిక చేసినందుకు సంతోషంగా ఉంది. రాజకీయాల్లో ఉంటే పదవుల కోసం పాకులాడే వారిని చూశా కానీ గత ఎన్నికల్లో ఏమీ ఆశించకపోగా, పోటీ చేయని గొప్ప వ్యక్తి గీతారెడ్డి' అని పేర్కొన్నారు. గాంధీ కుటుంబం తీసుకున్న నిర్ణయాలతోనే దేశంలో పేదలకు మేలు జరిగింది. పేదలకు మేలు జరిగేది గాంధీకుటుంబంతో మాత్రమే. మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణాలు మిగతా 2లో..

## మూసీ పేరుతో ప్రజాధనాన్ని

# లూటీ చేసే యత్నం



- మురుగునీటి యంత్రాలను ఉపయోగించడం మేలు
- ఇప్పటికే ఏర్పాటుచేసిన వాటిని ఉపయోగించాలి
- నాగోలు శుద్ధి కేంద్రాన్ని సందర్శించిన కెటిఆర్

**హైదరాబాద్:** మూసీ పేరుతో ప్రజాధనాన్ని లూటీ చేసేందుకు రేవంత్ రెడ్డి ప్లాన్ వేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ( విమర్శించారు. రూ.26 వేల కోట్లతో మొత్తం మూసీ పునరుజ్జీవం అవుతుందని, కానీ రేవంత్ రెడ్డి మాత్రం లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తామని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలో కాంగ్రెస్‌కు మూటలు మోయడానికి రేవంత్ రెడ్డి దొరికాడని చెప్పారు. హైడ్రా పేరుతో బిల్డర్లను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. మూసీ బఫర్ జోన్‌లో ఉన్నవాళ్లను కబ్జాదారులని రేవంత్ ముద్ర వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నాగోల్‌లోని ఎస్టీపీని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి కేటీఆర్ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. నాగోల్‌లో దేశంలోనే అతిపెద్ద మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని నిర్మించామని చెప్పారు. ఇక్కడ శుద్ధి చేసిన నీళ్లు నల్లగొండ జిల్లాకు పోతాయన్నారు. రేవంత్ రెడ్డి కొత్తగా చేసేదేం లేదన్నారు. మిగతా 2లో..

## గ్రూప్-1 అభ్యర్థులను

# చర్చలకు పిలవరా?

- బండి సంజయ్‌కు గ్రూప్-1పరీక్షల గురించేం తెలుసు
- రేవంత్ రెడ్డి కావాలనే డ్రామాలు ఆడుతున్నారు
- రైతుభరోసా ఇవ్వనందుకు నేడు రాష్ట్రవ్యాప్త నిరసనలు
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ వెల్లడి

మిగతా 2లో..

## దేశ భవిష్యత్‌ను నిర్ణయించే మహా ఎన్నికలు

- దేశరాజకీయాలను ఈ ఫలితాలు మరుస్తాయన్న అఖిలేష్
- మహా వికాస్ అఘాడీ పొత్తులో ఎస్పీకి 12 సీట్లు




**ముంబయి:** మహారాష్ట్రలో నవంబర్ 20న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ప్రతిపక్ష 'మహా వికాస్ అఘాడీ' సీట్ల పంపకంలో భాగంగా సమాజ్‌వాదీ పార్టీకి 12 స్థానాలు ఇవ్వాలని కోరినట్లుగా సమాజ్ వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ పేర్కొన్నారు. తమ పార్టీకి బలమున్న కొన్ని స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించామని తెలిపారు. మహారాష్ట్రలోని ధూలే నియోజకవర్గం నుంచి పార్టీ అభ్యర్థిగా ఇర్షాద్ జహాగీర్దార్‌ను ప్రకటిస్తున్నట్లుగా ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర భవిష్యత్తును మాత్రమే మిగతా 2లో..

## కెటిఆర్..ఎక్కువగా

# అరవకు

- కాంగ్రెస్, మీరు ఇద్దరూ ఒక్కటే
- ఫోన్ ట్యాపింగ్‌లో మ్యా ఫిక్సింగా నిజామా కాదా?
- గట్టిగా హెచ్చరించిన బండి సంజయ్



హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్ట్రాం కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ ముఖ్యమంత్రి పదవి, సీఎం రేవంత్ రెడ్డిపై తాను చేసిన వ్యాఖ్యలకు కేటీఆర్ ట్వీట్ చేయడంపై బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కుర్చీని కాపాడేందుకు బండి సంజయ్ తాపత్రయ పడుతున్నారని, రాష్ట్రంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమా? లేక బీజేపీ అనుబంధ ప్రభుత్వమా? అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు. దీనికి కౌంటర్‌గా గత బీఆర్ఎస్ ప్రభుత్వం, కేటీఆర్‌పై కేంద్ర మంత్రి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. ' కేటీఆర్ అరవకు. ఫోన్ ట్యాపింగ్ కేసులో నువ్వు, మీ నాన్న కేసీఆర్ దోషులు. ఎందుకు మిమల్ని సీఎం రేవంత్ రెడ్డి అరెస్టు చేయడం లేదు. తండ్రికొడుకులు ఇద్దరూ ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ పెద్దల కాళ్లు పట్టుకుంది నిజం కాదా?. రేవంత్ రెడ్డి.. నీకు దమ్ముంటే ఫోన్ ట్యాపింగ్ కేసు సీబీఐకి అప్పగించాలి. మేము కూడా కేంద్రం తరుపున సీబీఐని రిక్వెస్ట్ చేస్తాం. అప్పుడు బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనని బయటపడుతుంది. హర్యానా, జమ్మూకశ్మీర్ ఎన్నికలకు కాంగ్రెస్ ఖర్చు చేసిన డబ్బు బీఆర్ఎస్ పార్టీ ఇచ్చినదే. కేటీఆర్ అహంకారమే ఆ పార్టీని ఈ దుస్థితికి తెచ్చింది. నీ అహంకారపూరిత మాటల వల్లే మీ పార్టీ గత ఎన్నికల్లో ఓడిపోయింది. ఇప్పుడు మళ్లీ అదే రకంగా మాట్లాడుతున్నావు. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటి కానే కాదు. మిగతా 2లో..

# మూసీ పేరుతో ప్రజాధనాన్ని లూటీ చేసే యత్నం

ఈ ఎస్టీపీలను సక్రమంగా నడుపుకుంటే చాలన్నారు. మూసీ నది హైదరాబాద్ ఒక వరమని, దానిని మురికి కూపంగా మార్చింది కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలేనని చెప్పారు. హైదరాబాద్‌లో రోజూ 20 కోట్ల లీటర్ల మురికినీరు ఉత్పత్తి అవుతున్నదని తెలిపారు. దక్షిణాసియాలోనే వంద శాతం మురుగు శుద్ధి చేసే నగరం లేదని వెల్లడించారు. మురుగునీటిని వంద శాతం శుద్ధి చేస్తున్నది ఒక్క హైదరాబాద్‌లోనేనని చెప్పారు. కేసీఆర్ హయాంలోనే ఈ ఘనతను సాధించామన్నారు. రూ.3,800 కోట్ల ఖర్చుతో ఎస్టీపీల నిర్మాణం ప్రారంభించామని తెలిపారు. నగరంలోని 54 నాలాల నుంచి మూసీలోకి మురికి నీరు వస్తుందని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన ఎస్టీపీలను రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో 57.7 కిలోమీటర్లు మూసీ ప్రవహిస్తుందన్నారు. మూసీపై 15 చోట్ల బ్రిడ్జిలను నిర్మించాలని ప్రణాళికలు రూపొందించామని వెల్లడించారు. చారిత్రక, వారసత్వ సంపదను కాపాడుతూ ఆధునికంగా నిర్మించాలని నిర్ణయించామన్నారు. బ్రిడ్జిల నిర్మాణానికి రూ.545 కోట్లు మంజూరు చేశామన్నారు. రోడ్ కం బ్రిడ్జ్ కం చెక్ డ్యాం నిర్మించాలనుకున్నామని చెప్పారు. మూసీపై రూ.10 వేల కోట్లతో భారీ స్కై ఓవర్ నిర్మించాలనుకున్నామని తెలిపారు.ఎంత శుద్ధి చేసినా మూసీ నీళ్లు తాగేవి కాదని చెప్పారు. అందువల్ల కొండపోచమ్మ సాగర్ నుంచి మూసీకి నీళ్లు తేవాలని నిర్ణయించామన్నారు. గోదావరి నుంచి నీళ్లు తెచ్చేందుకు రూ.1100 కోట్లతో ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ఆ ప్రాజెక్టుకు గతేడాది మే 18న శంకుస్థాపన చేశామని గుర్తుచేశారు. మూసీ పేరుతో ప్రజాధనాన్ని లూటీ చేసేందుకు రేవంత్ రెడ్డి ఎ÷-లాన్ వేశారని చెప్పారు. రూ.26 వేల కోట్లతో మొత్తం మూసీ పునరుజ్జీవం అవుతుందని, కానీ రేవంత్ రెడ్డి మాత్రం లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తామని చెబుతున్నారని విమర్శించారు. ఢిల్లీలో కాంగ్రెస్‌కు మూటలు మోయడానికి రేవంత్ రెడ్డి దొరికాడని చెప్పారు. హైడ్రా పేరుతో బిల్డర్లను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మూసీ బఫర్ జోన్‌లో ఉన్నవాళ్లను కబ్జాదారులని రేవంత్ ముద్ర వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి తనను మూసీ వద్ద 3 నెలలు ఉండాలని అంటున్నడు.. 60-70 ఏండ్ల నుంచి ప్రజలు ఇక్కడే ఉంటున్నారని తెలుసుకోవాలన్నారు. మూసీ పక్కన తాను మూడు నెలలు కాదు మూడేండ్లు ఉంటానని స్పష్టం చేశారు. మూసీ తనకు చిన్నప్పటి నుంచి తెలుసని, కొత్తగా రేవంత్ చెప్పాల్సింది లేదన్నారు. సోకుల కోసం పేదలను రోడ్డున పడేయొద్దని ముఖ్యమంత్రికి సూచించారు. రేవంత్ తన కుర్చీ కాపాడుకోవడానికి కావాలంటే చందాలిస్తామన్నారు. 2400 కిలోమీటర్ల పొడవైన నమామి గంగే ప్రాజెక్టు కోసం ప్రధాని మోదీ రూ.40 వేల కోట్లు ఖర్చు చేశారని, మూసీ కోసం రేవంత్ కిలోమీటర్‌కు రూ.2700 కోట్లు ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. మూసీకి రెండువైపుల రిటెయినింగ్ వాల్ కట్టాలని సూచించారు. మూసీ మీద ఎక్స్‌ప్రెస్ వే నిర్మించాలని చెప్పారు. అంతకంటే కొత్తగా రేవంత్ రెడ్డి చేయాల్సిందేమీ లేదన్నారు. మూసీ బాధితులకు తామంతా అండగా నిలబడతామని చెప్పారు. మూసీ ప్రాజెక్టుకు డీపీఆర్ లేకుండానే ఇం÷-లడెందుకు కూలగొడుతున్నారని ప్రశ్నించారు. ఇండ్లు ఖాళీ చేయాలని అధికారులు అడిగితే నిలదీయాలని ప్రజలకు సూచించారు. మూసీ పేరుతో జరుగుతున్న లూటీకి చరమగీతం పాడాలన్నారు. నాలా అభివృద్ధి పనుల వల్ల గతంలో మునిగిన కాలనీలు ఇప్పుడు సురక్షితంగా ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి గ్రాఫిక్స్ మాయాజాలానికి మోడిగా ఆగం కావొద్దన్నారు. మూసీలోని మురికి నీరు ఎస్టీపీలో ఎలా శుభ్రం అవుతుందో కేటీఆర్ చూపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీవరేజ్ ఎ÷-లాంట్ల ఏర్పాటును కేటీఆర్ చేపట్టారని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. రూ.3800 కోట్లతో 31 ఎస్టీపీల నిర్మాణాన్ని చేపట్టామని వెల్లడించారు. స్వచ్ఛమైన నీరు మూసీలోకి వదలాలని ఈ ఎస్టీపీలను నిర్మిస్తున్నామని తెలిపారు. మూసీపై 15 బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని భావించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మూసీ ప్రాజెక్టుపై డీపీఆర్ లేదని, ఎస్టిమేషన్ లేదని విమర్శించారు. ప్రజలకు ఇబ్బంది పెట్టే చర్యలకు పాల్పడితే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. మూసీ పరివాహక ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు.

గ్రూప్-1 అభ్యర్థులను చర్చలకు పిలవరా?

గ్రూప్ -1 అభ్యర్థులను రేవంత్ ప్రభుత్వం కనీసం చర్చలకు కూడా పిలవకపోవడం దుర్మార్గమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు విమర్శించారు. గ్రూప్-1 అభ్యర్థులను రేవంత్ ప్రభుత్వం హీనంగా చూస్తోందని అన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ....

గ్రూప్-1 అభ్యర్థులు ఈ రాష్ట్ర భవిష్యత్తు నిర్మాతలు అని చెప్పారు.కనీసం సుప్రీంకోర్టు ఏదో ఒక నిర్ణయం తీసుకునే వరకైనా ప్రభుత్వం వేచి చూడాలని అన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్, సీఎం రేవంత్ రెడ్డి కావాలనే డ్రామా ఆడుతున్నారని విమర్శించారు.. బండి సంజయ్‌ని పోలీస్ సెక్యూరిటీ ఇచ్చి మరి రేవంత్ ర్యాలీ చేయిస్తాడని అన్నారు. బీఆర్ఎస్ నాయకులను మాత్రమే రేవంత్ ప్రభుత్వం అరెస్ట్ చేస్తుందని మండిపడ్డారు. బండి సంజయ్‌ను చర్చలకు పిలిస్తే ఏం జరుగుతుందని కేటీఆర్ అడిగారు. బండి సంజయ్ ఏం చదువుకున్నాడు? ఆయనకు పరీక్షల గురించి ఏం తెలుస్తుందని ఎద్దేవా చేశారు. పరీక్ష పత్రాలు లీక్ చేయమంటే చేస్తాడు... అభ్యర్థుల తరఫున ఆయనేం చర్చిస్తారని నిలదీశారు. రెండు పంటలకు కాదు మూడు పంటలకు రైతు భరోసా ఇస్తానని రేవంత్ రెడ్డి అనలేదా అని ప్రశ్నించారు. ఇప్పుడు ఒక్క పంట కూడా రైతు భరోసా ఇవ్వకుండా చేతులె త్తేశారని ధ్వజమెత్తారు. మాజీ సీఎం కేసీఆర్ ఈ విషయం గురించి ముందే చెప్పారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నంతవరకే రైతు బంధు అని చెప్పారని అలాగే జరుగుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి రైతు భరోసా ఎందుకు వేయడం లేదని నిలదీశారు. ఆదివారం తెలంగాణ వ్యాప్తంగా రైతు భరోసా ఇవ్వనందుకు వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ప్రకటించారు. రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఈ ధర్నాలో పాల్గొనాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# ప్రజలు లేని చోట...

# పక్కా సడక్...

- స్వలాభం కోసమే ఇండ్లు లేని చోట సీసీ రోడ్డు నిర్మాణం
- కార్ల సర్వీస్ సెంటర్ కోసమే సీసీ రోడ్డు నిర్మాణం
- సీసీ రోడ్డుకు మూడు గేట్లు - రెండు గేట్లు హుందాయ్ సర్వీస్ సెంటర్ వి
- మరొకటి మేయర్ ఇంటి వెనుక గేట్
- బస్తి, కాలనీ, ప్రజల, మౌలిక సదుపాయాలకు కార్పొరేషన్‌లో డబ్బులు నిల్
- కొన్ని చోట్ల వెట్ మిక్స్ వేసి 3 నెలలు గడిచినా సీసీ వేయని అధికారులు
- అధికార పార్టీ వత్తిడితో కాదు ప్రజల అవసరాలు తీర్చడానికి పని చేయండి
- బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడవెల్లి రఘువర్ధన్ రెడ్డి డిమాండ్




**బోడుప్పల్ (ది క్రైమ్ న్యూస్):** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 20 డివిజన్ పరిధిలో వరంగల్ జాతీయ రహదారిని ఆనుకొని రామచందర్ సింగ్ కాలనీకి వెళ్ళడానికి రెండు రోడ్లు ఉన్నాయి. అందులో ఒక రోడ్డులో ఒక్క నివాసిత ఇల్లు లేదు. దాదాపు 500 మీటర్ల సీసీ రోడ్డు 5 మీటర్ల వెడల్పుతో వేయడానికి ఆగమేఘాల మీద వెట్ మిక్స్ వేసి సీసీ వేయడానికి రెడీ చేశారు.ఆ రోడ్డు వల్ల హుందాయ్ షో రూమ్ సర్వీస్ సెంటర్‌కి రెండు గేట్లు మరియు మేయర్ అమర్ సింగ్ ఇంటి వెనుకల ఒక గేట్ ఈ మూడింటికి తప్ప వేరే ఉపయోగం లేదు. ఇక రామచందర్ సింగ్ నగర్‌కి ఆ రోడ్ కనెక్ట్ అయినా ముందు సీసీ రోడ్డు అందుబాటులో ఉంది.అంటే ఆకొత్త సీసీ రోడ్డు వల్ల ఉపయోగం హుందాయ్ కారు షో రూమ్ సర్వీస్ సెంటర్ వారికే అటు తర్వాత మేయర్ ఇంటికే తప్ప ప్రస్తుతం వేరేవారికి పెద్దగా ఉపయోగం లేదనే చెప్పొచ్చు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో పలు కాలనీ లలో అనుసంధానం చేసే రోడ్లు గుంతలతో మట్టి రోడ్లు ఉన్నాయి,కొన్ని చోట్ల భూగర్భ డ్రైనేజి పైప్ లైన్లు వేయాల్సి ఉంది.కొన్ని చోట్ల టెండర్ అయి పనులకు నోచుకోలేదు... మరికొన్ని చోట్ల ప్రారంభించి సగం చేసి పెండింగ్‌లో ఉన్నాయి. ఇక ముంపు ప్రాంతాలలో వరద మురుగు నీరు పోవడానికి పైప్ లైన్లు వేయాల్సి ఉంది. వివిధ డివిజన్ల కాలనీ ప్రజలు పలు మార్లు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా,ప్రజా ప్రతినిధులు చెప్పినా నిధులు లేవని దాటేస్తున్నారు.మరి ఇప్పుడెలా ఇల్లు లేని దగ్గర దాదాపు అర కిలోమీటర్ సీసీ 15 ఫీట్ల వెడల్పుతో వేస్తున్నారు అని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ఇక నైనా వాణిజ్య సముదాయాలకు కాకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యత ఉన్న పనులపై దృష్టి పెట్టి అభివృద్ధి పనులు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. గత వారంలో జరిగిన మున్సి పల్ సాధారణ సర్వసభ్య సమావేశంలో మెజారిటి సభ్యులు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరడంతో అంతకుముందు కౌన్సిల్ ఆమోదించిన పనుల తీర్మానాలను పక్కనపెట్టి ప్రధాన్యత లేని పనులను సొంత ప్రయోజనాల కోసం చేపట్టడం ఎంత వరకు సబబు...గత తీర్మానాలతో అభివృద్ధి పనులు చేపడితే జరిగే నష్టమేమిటని ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ కమీషనర్ ఇకనైనా అధికార పార్టీకీ తొత్తుగా కాకుండా ప్రజల టాక్స్ డబ్బులతో జీతాలు తీసుకుంటున్న



మీరు ప్రజల కొరకు ప్రజా సమస్యలు తీర్చేవిధంగా పనులు చేయండని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘుపర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు.



## తీరు మార్చుకోని కెనడా ప్రభుత్వం : నిస్సిగ్గుగా దౌత్యవేత్తలపై నిఘా

**న్యూఢిల్లీ:** భారత్‌తో దౌత్యసంబంధాలు తీవ్రస్థాయిలో దెబ్బతింటున్నా కెనడా వైఖరిలో మాత్రం ఎలాంటి మార్పులేదు. ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో మాటల్నే విదేశాంగమంత్రి మెలానీ జోలీ వల్లెవేశారు. అక్కడున్న మిగిలిన దౌత్యవేత్తలపై నిఘా ఉంచామంటూ భారత్‌పై బురదజల్లే పక్రియను కొనసాగించారు. అంతటితో ఆగకుండా భారత్‌ను రష్యాతో పోలుస్తూ అక్కసు వెళ్లగక్కారు. వియన్నా కన్వెన్షన్ ఒప్పంద ఉల్లంఘనకు పాల్పడితే సహించేది లేదని మెలానీ వ్యాఖ్యలు చేశారు. సిక్కుల అతివాద నేత హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యకేసు అనుమానితుల జాబితాలో ఏకంగా భారత హైకమిషనర్ సంజయ్ కుమార్ వర్మను చేర్చింది. ఈ పరిణామం రెండు దేశాల మధ్య అగ్గిరాజేసింది. తాజా పరిణామాల నేపథ్యంలో ఆయన్ని, మరికొందరు అధికారుల్ని అక్కడి నుంచి వెనక్కి తెచ్చేయాలని కేంద్రం నిర్ణయించింది. దిల్లీలోని కెనడా తాత్కాలిక హైకమిషనర్ సహా ఆరుగురు దౌత్యవేత్తల్ని బహిష్కరించింది. ప్రతిగా కెనడా సైతం అదే తరహా నిర్ణయం తీసుకుంది. ఇలా ఉద్రిక్తతలు కొనసాగుతోన్న తరుణంలో మెలానీ మాట్లాడుతూ రష్యా, భారత్ మధ్య పోలిక తెచ్చారు. 'మా దేశ చరిత్రలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదు. అంతర్జాతీయ శక్తులు కెనడా గడ్డపై ఇలాంటి అణచివేతకు పాల్పడటాన్ని మేం జరగనివ్వబోం. ఐరోపాలో ఇలాంటివి మేం చూశాం. జర్మనీ, యూకేలో రష్యా ఆ పనిచేసింది. ఇలాంటివాటికి వ్యతిరేకంగా దృఢంగా నిలబడాల్సి ఉంది' అని జోలీ వెల్లడించారు. కెనడాలో మిగిలిన భారత దౌత్యవేత్తలను కూడా బహిష్కరిస్తారా ? అని అడగ్గా.. 'వారిపై నిఘా ఉంచాం.

## నిజామాబాద్ జిల్లాలో దారుణం

చేరుకుని శనివారం ఉదయం జిల్లా కేంద్రంలోని ఒకటో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ అఘాయిత్యానికి పాల్పడిన వారు డిచ్‌పల్లికి చెందిన వారిగా పోలీసులు అనుమానిస్తున్నారు. బాధిత మహిళను వెంటబెట్టుకుని ఘటనాస్థలికి తీసుకెళ్లి పోలీసులు పరిశీలించారు. బస్‌స్టాండ్ వద్ద ఆటోకు సంబంధించిన వీడియో ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

## ముగ్గురు యువకులకు శిరోముండనం

పోలీస్ స్టేషన్‌కు పిలిపించిన ఎస్సై జగన్మోహన్ రెడ్డి.. వారికి వార్నింగ్ ఇచ్చాడు. ఆ సమయంలో ఓ యువకుడు తల దువ్వుకోవడంతో ఎస్సై సీరియస్ అయ్యాడు. నా ముందే తలదువ్వకుంటావా అని వారిపై కోపంతో రెచ్చిపోయాడు. వెంటనే ముగ్గురు యువకులకు గుండు గీయించాడు. ఇలా అందరిముందు గుండు గీయించడంతో ముగ్గురు యువకులు మనోవేదనకు గురయ్యారు. వారిలో నితీశ్ అనే యువకుడు తీవ్ర మనస్తాపం చెందాడు. తన పరువు పోయిందని భావించి ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే అతడిని నాగర్‌కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం నితీశ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మిగతా ఇద్దరు యువకులను ఊరు విడిచి హైదరాబాద్ వెళ్లిపోవాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన ఇప్పుడు సంచలనంగా మారింది. అయితే ఇంత జరిగినప్పటికీ ఆ పోలీసులు మాత్రం తమ బుద్ధిని పోనిచ్చుకోలేదు. ఈ వివరాలు ఎక్కడా వెల్లడించవద్దంటూ హుకుం జారీ చేశారు.

## మరోమారు రోడ్డెక్కిన గ్రూప్-1 అభ్యర్థులు

అడ్డుకునేందుకు ప్రయత్నిం చారు. చివరకు బండి సంజయ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సమయంలో విద్యార్థులకు, పోలీసులకు మధ్య తీవ్ర తోపులాట చోటు చేసుకుంది. అశోక్‌నగర్ నుంచి ఛలో సెక్రటేరియట్‌కు బయలుదేరిన బండి సంజయ్‌ను తెలుగు తల్లి ఫ్లై ఓవర్ వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. అక్కడి నుంచి బీజేపీ కార్యాలయానికి తరలించారు. ఈ ఘటనపై బండి సంజయ్ మండిపడ్డారు. మరోవైపు ఆందోళన చేస్తున్న గ్రూప్ వన్ అభ్యర్థులను డీజీపీ జితేందర్ హెచ్చరించారు. గ్రూప్ 1 పరీక్షల కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్ల మీదికి వచ్చి సామాన్య ప్రజలను ఇబ్బంది పెడితే ఊరుకోమని స్పష్టం చేశారు. శాంతిభద్రతలను రక్షించాలనే శుక్రవారం ఆందోళనను అరికట్టామని అన్నారు. సమస్య పరిష్కారానికి సుప్రీం కోర్టు కు వెళ్ళాలి కానీ రోడ్ల మీద ఆందోళన చేస్తే ఊరుకోమంటూ డీజీపీ జితేందర్ వార్నింగ్ ఇచ్చారు. కాగా.. గ్రూప్ వన్ మెయిన్స్‌కు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈనెల 21 నుంచి 27 వరకు గ్రూప్ వన్ మెయిన్స్ పరీక్షలు జరుగనున్నాయి. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పరీక్షలు పకడ్బంధీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. మరోవైపు గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష తుది కీలో తప్పులు ఉన్నాయని, అందువల్ల ఆ పరీక్షను రద్దు చేసి మెయిన్స్ పరీక్ష నిర్వహించకుండా అడ్డుకోవాలని కోరుతూ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీలు దాఖలైన విషయం తెలిసిందే.్÷నైల్ కీలో తప్పులు ఉండటంతోపాటు వివిధ కారణాలతో ప్రాథమిక పరీక్షను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను సింగిల్ జడ్జి ధర్మాసనం కొట్టేసింది. ఈ తీర్పును సవాలు చేస్తూ దాఖలైన అప్పీల్ పిటిషన్లను హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టివేసింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును డివిజన్ బెంచ్ సమర్థించింది. చివరి నిమిషంలో పరీక్ష రద్దు సాధ్యం కాదని హైకోర్టు స్పష్టం చేసింది. పరీక్షలు వాయిదా వేయాలని ఆదేశాలు ఇవ్వలేమని హైకోర్టు ధర్మాసనం తేల్చిచెప్పింది. దీంతో గ్రూప్ 1 పరీక్షలకు అడ్డంకులు తొలిపోయినట్లైంది.

## గాంధీ కుటుంబాలది త్యాగాల చరిత్ర

అర్పించారని అందరికీ తెలుసు. సోనియా, రాహుల్ గాంధీ ప్రధాని పదవులను త్యాగం చేశారు. గాంధీ కుటుంబానికి, దోపిడీ చరిత్ర ఉన్న వారికి ఏమైనా పోలిక ఉందా? అని ప్రశ్నించారు. ఆక్రమణలకు పాల్పడ్డ బడా బాబుల పట్ల భూతం హైడ్రా అని రేవంత్ రెడ్డి అన్నారు. నాళాలు, చెరువులను, ప్రభుత్వ భూములను, ఆక్రమించుకుని పెద్ద పెద్ద బిల్డింగులు, ఫాం హౌస్‌లు కట్టిన వారిపై హైడ్రా ఉక్కుపాదం మోపుతోంది. అక్రమాలకు పాల్పడిన మదపుటేనుగులను అణచడానికి హైడ్రా అంకుశంలా పనిచేస్తుంద న్నారు. అయితే కొందరు ఉద్దేశపూర్వకంగా హైడ్రాను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ బిజినెస్ ను సైతం దెబ్బ తీయాలని కుట్ర జరుగుతోందన్నారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకుని హైడ్రా వారిపై చర్యలు తీసుకుంటుంటే బిల్లా రంగాలు వచ్చి బుల్డోజర్లకు అడ్డు పడతామంటున్నారు. మూసీ వద్దకు కాదు, జన్వాడ ఫామ్ హౌస్ కు పోదాం. గుల్ఫాపూర్ నాలాను ఆక్రమించుకుని కేటీఆర్ ఫామ్ హౌస్ కట్టలేదా? అని రేవంత్ ప్రశ్నించారు. ఫామ్ హౌస్ కు బుల్డోజర్ వస్తుందనే బీఆర్ఎస్ నేతలు డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. హరీశ్.. నీలాంటి వాళ్లు కాదు.. ఫామ్ హౌస్ లో పడుకున్న వాళ్లను రమ్మను, నేను కూడా వస్తా.. నీది ఒక స్థాయేనా అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. మూసీ పునరుజ్జీవనం వేరు, హైడ్రా వేరు. మూసీలో ఎలాంటి కూల్చివేతలు చేపట్టలేదు. ట్రాఫిక్ సమస్య, నాళాల పునరుద్ధరణకు అడ్డుకట్ట వేయడానికే హైడ్రా పనిచేస్తోంది. మీరు చెప్పినట్టు అక్కడికి ఇక్కడికి కాదు, ఫామ్ హౌస్ కు రమ్మని సవాల్ చేశారా? అని ప్రశ్నించారు. వాళ్ల ఫామ్ హౌస్ ల వద్దకు ఎప్పుడు రావాలో అది కూడా హరీష్ రావు చెప్పాలన్నారు. హరీశ్ రావు, కేటీఆర్ ఫామ్ హౌస్ లకు సంబంధించి అఖిలపక్షం పిలిచి, నిజ నిర్ధారణ కమిటీతో నిజాలు ఏంటో తేల్చేద్దామని పిలుపునిచ్చారు.

## కెటిఆర్..ఎక్కువగా అరవకు

దోస్తులమైతే ఫోన్లలో మాట్లాడుకుంటాం. మీడియాకు స్టేట్మెంట్లు ఇవ్వం. అసలు దోస్తానా కేసీఆర్, కాంగ్రెస్ కే ఉంది అంటూ వ్యాఖ్యానించారు. హర్యానా, జమ్మూకశ్మీర్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి డబ్బు సహాయం చేసింది కేసీఆరే. డబ్బు సంచులతో ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ పెద్దలకు ఇచ్చింది వాస్తవం కాదా?. మీ రెండు పార్టీల మధ్య స్నేహ సంబంధాలు లేకపోతే ఫోన్ ట్యాపింగ్ కేసు ఎందుకు ముందుకు సాగడం లేదు. ఈ కేసులో కేసీఆర్ ఆదేశాల మేరకే అధికారులు ట్యాపింగ్ చేసినట్లు క్లియర్‌గా రిపోర్టు ఉంది. ఈ రిపోర్టు ప్రకారం కనీసం ఆయనకు 41సీఆర్పీసీ నోటీసూ ఎందుకు ఇవ్వడం లేదు. దీన్ని బట్టి అర్థమవుతుంది బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనని. మీ మధ్యలో స్నేహం లేకపోతే కేసును సీబీఐకి అప్పగించండి. సీబీఐ ద్వారా విచారణ జరిపితే అన్ని విషయాలు బయటకు వస్తాయి' అన్నారు.

## దేశ భవిష్యత్‌ను నిర్ణయించే మహా ఎన్నికలు?

కాకుండా దేశ భవిష్యత్తును కూడా నిర్ణయిస్తాయని ఆయన అన్నారు. ధూలే నగరంలో ఏర్పాటు చేసిన ఎన్నికల ర్యాలీలో ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ భాజపాపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్రంలో పార్టీలను విభజించి.. అధికారాన్ని దొంగిలించిందని అఖిలేష్ దుయ్యబట్టారు. అసెంబ్లీకి విద్యావంతులైన ఎమ్మెల్యేలను పంపడం ప్రజల బాధ్యత అని పేర్కొన్నారు. 'మహారాష్ట్ర ఎన్నికలు దేశ రాజకీయాలను మార్చగలవు. ఇవి చారిత్రకమైనవి. ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్రంలో భాజపా ప్రభుత్వం ఉండదు. దీంతో దిల్లీలోని కేంద్ర ప్రభుత్వం కూడా కూలిపోతుంది. అన్ని విషయాలకు బుల్డోజర్‌లను పంపే ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మళ్లీ అధికారంలోకి వచ్చే అవకాశం లేదు' అని అఖిలేష్ జోస్యం చెప్పారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాను, దాని మిత్రపక్షాలను ఓడించి.. తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. రాష్ట్రంలోని మహాయుతి ప్రభుత్వం ఇక్కడి పరిశ్రమలను గుజరాత్‌కు తరలిస్తోందని ఆయన ఆరోపించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల ప్రకటించింది. రాష్ట్రంలో ఒకే దశలో నవంబర్ 20న పోలింగ్ జరగనుండగా నవంబర్ 23న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు కేంద్ర ఎన్నికల కమిషన్ వెల్లడించింది. అయితే శివసేన, ఎన్సీపీ చీలిక తర్వాత జరుగుతున్న తొలి అసెంబ్లీ ఎన్నికలు కావడంతో దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. అసలైన శివసేన, ఎన్సీపీ ఏవో ప్రజలు తేల్చనున్నారు.

# నైపుణ్య శిక్షణతో ఉపాధి గ్యారంటీ

- అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లలో మౌలిక వసతుల కల్పన
- ఐటిఐ భవనం రిన్నోవేషన్ పనులకు ప్రతిపాదనలు అందించాలి
- పెద్దపల్లి ఐటిఐ కేంద్రాన్ని టీ వర్క్స్ సీఈఓతో కలిసి పరిశీలించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష





**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లాలోని నిరుద్యోగ యువత యువకులకు నైపుణ్య శిక్షణతో గ్యారంటీ ఉపాధి అందించే దిశగా ప్రభుత్వం పటిష్ట కార్యాచరణ అమలు చేస్తుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష టీ వర్క్స్ సీఈఓ జోగేందర్ తో కలిసి పెద్దపల్లి ఐటిఐ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంతకు ముందు సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఏ.టి.సి కేంద్రాలకు టీ వర్క్స్ అందించే సహకారం, ఏ.టి.సి కోర్సుల ద్వారా మార్కెట్ లో యువతకు అందే ఉపాధి అవకాశాల వివరాలతో కూడిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ను టీ వర్క్స్ సీఈఓ జోగేందర్ అందించారు. పెద్దపల్లి ఐటిఐ పరిశీలనలో ఏ.టి.సి కేంద్రాలలో ఎన్ని సీట్లు ఇప్పటివరకు భర్తీ అయ్యాయో వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మన పెద్దపల్లి జిల్లాకు ప్రభుత్వం మొదటి దశలోనే 2 ఏ.టి.సి కేంద్రాలను మంజూరు చేసిందని, ఇందులో గల 6 కోర్సులకు పదవ తరగతి ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీ యువకులు అక్టోబర్ 30 లోబో అడ్మిషన్ కొరకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఏ.టి.సి కోర్సుల ద్వారా యువతకు అందే నైపుణ్యంతో మార్కెట్లో మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఏ.టి.సి కేంద్రాలలో వివిధ కోర్సులకు సంబంధించి వచ్చిన సామాగ్రిని కలెక్టర్ పరిశీలించారు. ఐటిఐ రెగ్యులర్ కోర్సుల విద్యార్థుల హాజరు వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. ఐటిఐ భవనం రిన్నోవేషన్ పనులకు ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. తరగతి గదులలో లీకేజీలు ఉంటే వెంటనే వాటి నివారణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో జిల్లా కలెక్టర్ వెంట ఐ.టి.ఐ. ప్రిన్సిపాల్ వెంకట్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల, నిరుద్యోగుల, పట్టభద్రులు మద్దతు సర్దార్ రవీందర్ సింగ్‌కే... శాతవాహన విద్యార్థి జేఏసి

**కరీంనగర్ టౌన్, అక్టోబర్19(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ వేంకటేశ్వర స్వామి ఆలయం నుండి కొండగట్టు అంజనేయ స్వామి వారి ఆలయం వరకు శాతవాహన స్టూడెంట్ జేఏసీ వ్యవస్థాపక చైర్మన్ చెన్నమల్ల చైతన్య ఆధ్వర్యంలో పాదయాత్ర చేయడం జరిగింది. ఈ పాదయాత్రను వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, తెలంగాణ ఉద్యమకారుడు కెమసారం తిరుపతి, సర్దార్ సోహన్ సింగ్‌లు వారికి పూలమాలలు వేసి ప్రారంబించారు. ఈ సందర్భంగా చెన్నమల్ల చైతన్య మాట్లాడుతూ సర్దార్ రవీందర్ సింగ్ గెలుపుకొసం కరీంనగర్ లోని వేంకటేశ్వర స్వామివారి ఆలయం నుండి కొండగట్టు అంజనేయ స్వామి ఆలయం వరకు తెలంగాణ లోని నాలుగు యూనివర్సిటీల విద్యార్థులు ఈ పాదయాత్ర చేపట్టినాము. సర్దార్ రవీందర్ సింగ్ గతంలో కరీంనగర్ మేయర్‌గా నగర అభివృద్ధి కోసం స్మార్ట్ సిటీ, ఒక్క రూపాయికే అంత్రక్రియలు, ఒక్క రూపాయికే ఇంటింటికి మంచినీళ్ళ నల్ల, రూపాయికే న్యాప్కిన్స్, పదవ తరగతి విద్యార్థులకు సరస్వతి ప్రసాదం, రూపాయితో వివిధ పథకాల సృష్టికర్తగా పేరు తెచ్చుకున్నారని వారిని మనం ఎమ్మెల్సీగా గెలిపించుకుంటే ఈ నియోజకవర్గం పరిధిలో ఉన్న పట్టభద్రులకు ఒకే ఒక్క రూపాయితో హెల్త్ ఇన్సూరెన్స్ అందిస్తారని వారు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ప్రజా వ్యతిరేక విధానలతో నిరుద్యోగులకు ఇచ్చిన హామీ ని నెరవేర్చడం లేదని అలంటి సమయంలో ఇప్పుడు ఈ పట్టభద్రులు నియోజకవర్గం నుండి ప్రశ్నించే గొంతుకగా సర్దార్ రవీందర్ సింగ్ గెలిపించుకుంటే ప్రతిపక్ష పార్టీ సభ్యుడిగా ప్రభుత్వంతో నిరుద్యోగుల, పట్టభద్రులు సమస్యల మీద పోరాటం చేస్తాడని అన్నారు. పట్టభద్రులందరూ మీ ఓట్లు నమోదు చేసుకుని సర్దార్ రవీందర్ సింగ్ కు మీ తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలి కోరుతూ మా పాదయాత్ర సాగుందని ఈ పాదయాత్రలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు తవుటు మురళి, గొట్టం మహేష్, పోన్నం అనీల్ గౌడ్ కొత్తకొండ శ్రావణ్, రాము, యూనివర్సిటీల జేఏసీ నాయకులు అరుణ్ కుమార్, సత్యనారాయణ, రాము యాదవ్, నైతే మహేష్, బండ అశోక్, భారతం అఖిల్, బోడ కుంటి రమేష్, గడ్డమీద రాజశేఖర్, సాయినాయక్, తాళ్ల రాకేష్, ములకల విజయ్, శివ పవన్, సుధీర్, వంశీ, అనిల్, శ్రీకర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.




# పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలను గుర్తిస్తుంది

## సెంట్రల్ టెలికాం బోర్డు మెంబర్ జిల్లా కార్యదర్శి కుమార్



**సంగారెడ్డి జిల్లా (ది క్రైమ్ న్యూస్):** భాజపా జిల్లా కార్యదర్శి బైండ్ల కుమారును కేంద్ర ప్రభుత్వం ఉమ్మడి మెదక్ జిల్లా టెలికం బోర్డు మెంబర్గా నియమించిన సందర్భంగా బిజెపి జిల్లా కార్యదర్శి టెలికాం బోర్డు మెంబర్ బైండ్ల కుమార్ మాట్లాడుతూ 1995 నుండి ఏబీవీపీ కళాశాల అధ్యక్షులు ఏబీవీపీ న్యూ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ అధ్యక్షులు ఖైరతాబాద్. ఏబీవీపీ పటాన్చెరువు డివిజన్ ప్రధాన కార్యదర్శి. ఏబీవీపీ పటాన్ చేరు పట్టణ అధ్యక్షుడిగా. ఏబీవీపీ పటాన్ చెరువు మండల కన్వీనర్. ఏబీవీపీ పటాన్ చెరువు బాగ్ ప్రముఖ్. 2002 బీజేవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శి బీజేవైఎం పట్టణ అధ్యక్షులుగా. బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా. బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులుగా. బీజేవైఎంలిరాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా. 2018 బిజెపి పట్టణ అధ్యక్షుడు. బిజెపి జిల్లా కార్యదర్శిగా. బాధ్యతలు నిర్వహించ పార్టీ ఇచ్చిన ప్రతి బాధ్యతను తూచా తప్పకుండా పదవికి వన్నె తెచ్చేలా పనిచేశా అదేవిధంగా హత్నూర మండల ఇన్చార్జిగా జిన్నారం మండల ఇన్చార్జిగా చేశా. పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి నాటినుండి నేటి వరకు నిరంతరం పార్టీ కోసం పనిచేయడం జరిగింది కావున పార్టీకి పనిచేసిన విధానాన్ని గుర్తించి కేంద్ర ప్రభుత్వం టెలికం బోర్డు మెంబర్ గా నియమించడం నాకు చాలా సంతోషాన్ని ఇచ్చింది పూర్తి సహాయ సహకారాలు అందించిన మెదక్ పార్లమెంట్ సభ్యులు భారతీయ జనతా పార్టీ పార్లమెంట్ బోర్డ్ కమిటీ మెంబర్ యం. నందన్ రావు కు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అలాగే నన్ను నమ్మి ఈ బాధితునిచ్చినందుకు పార్టీకి రుణపడి ఉంటాను అని తెలిపారు.

# సాఫ్ట్ బాల్ పోటీలలో పత్తిపాక విద్యార్థుల ప్రతిభ

- అభినందించిన ఉపాధ్యాయులు



**ధర్మారం, అక్టోబర్ 19 (ది క్రైమ్ న్యూస్):** రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో పత్తిపాక విద్యార్థుల ప్రతిభ కనబరిచారు విద్యార్థులను అభినందించిన ఉపాధ్యాయులు సిరిసిల్ల జిల్లాలలో సెప్టెంబర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో 9 వ తరగతి విద్యార్థులు కే రిషి, ఎం ఆర్యన్, ఇద్దరు ఆటలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా శనివారం రోజున జెడ్ పి హెచ్ ఎస్ పత్తిపాక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.పి నరేందర్‌రావు,ఫిజికల్‌డైరెక్టర్‌గౌతమ్‌పాఠశాలఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు



**సుల్తానాబాద్, అక్టోబర్ 19( ది క్రైమ్ న్యూస్ ):** పెద్దపెల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా నియమించినందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి చైర్మన్ అన్నయ్య గౌడ్ కృతజ్ఞతలు తెలియజేశారు. శనివారం ఎమ్మెల్యేలు విజయ రమణారావు, మక్కాన్సింగ్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లతో కలిసి వెళ్ళి సీఎంకు శాలువా కప్పి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రకాష్ రావు, ఊట్ల వరప్రసాద్, నగునూరి అశోక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు..

# క్రీడలు మానసిక ఉత్సాహాన్ని పెంపొందిస్తాయి

- సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** క్రీడలు మానసిక ఉత్సాహాన్ని పెంపొందిస్తాయని పెద్దపెల్లి సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు. శనివారం రోజున పెద్దపల్లి జిల్లా కేంద్రం లో నిర్వహిస్తున్న స్వర్గీయ కొంతం శ్రీనివాస్ రెడ్డి స్మారక క్రికెట్ టోర్నమెంట్కు ముఖ్య అతిధి గా హాజరై, అనంతరం క్రీడాకారుల పరిచయ అనంతరం ఇరు జట్ల మధ్య టాస్ వేసి ఆటను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణ ప్రజలకు నాలుగో వార్డ్ కౌన్సిలర్ గా సేవలు అందించిన స్వర్గీయ కొంత%శీ% శ్రీనివాస్ రెడ్డి సేవలు మరువలేనివని, ఆయన ఆశయ సాధనలో యువకులు ముందుండి ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ఆయన ఆత్మకు నిజమైన శాంతి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల సర్వే కట్టుదిట్టంగా నిర్వహించాలి

- పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి పటిష్ట చర్యలు
- ధర్మారం మండలంలోని ప్రభుత్వ భూముల సర్వేను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో చేపట్టిన ప్రభుత్వ భూముల సర్వే కట్టుదిట్టంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ ధర్మారం మండలంలో జరుగుతున్న ప్రభుత్వ భూముల సర్వే ప్రక్రియను, ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధర్మారం మండలం బొమ్మరెడ్డిపల్లి గ్రామంలో సర్వే నెంబర్ 375 లోని ప్రభుత్వ భూమి 23 ఎకరాల 8 గుంటల సర్వే పనులను అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఖిలా వనపర్తి గ్రామంలో ప్రభుత్వ భూముల సర్వే ప్రక్రియ పూర్తయిందని, బొమ్మ రెడ్డి పల్లి గ్రామంలో అదనపు బృందాలను ఏర్పాటు చేసి త్వరగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ సర్వే ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ కు సూచించారు. ఈ తనిఖీల్లో అదనపు కలెక్టర్ వెంట అసిస్టెంట్ డైరెక్టర్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, ధర్మారం తహసిల్దార్ ఆయూబిద్దున్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బంజారాహిల్స్‌లో పబ్‌పై టాస్క్‌ఫోర్స్ దాడులు

## 42 మంది మహిళలతో సహా 140 మంది అరెస్ట్

**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** బంజారాహిల్స్‌లో ఓ పబ్‌పై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులు నిర్వహించారు. టాస్ పబ్‌పై ఆకస్మిక దాడులు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా యువతులతో నిర్వాహకులు నృత్యాలు చేయిస్తున్నట్లు గుర్తించారు. టాస్ పబ్‌పై వెస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. 42 మంది మహిళలతో సహా 140 మందిని అరెస్ట్ చేశారు. అశ్లీల నృత్య ప్రదర్శనలతోపాటు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు సమాచారం అందడంతో ఈ దాడులు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. పబ్ నిర్వాహకులు, క్యాషియర్, డీజే ఆపరేటర్‌లను అదుపులోకి తీసుకున్న పోలీసులు తదుపరి విచారణ కోసం బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కుతరలించారు. మగ కస్టమర్లను ప్రలోభపెట్టి లాభాలు ఆర్జించేందుకు.. వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళలను పబ్ నిర్వాహకులు రప్పించినట్లు పోలీసులు తెలిపారు.

# మానవత్వాన్ని చాటుకున్న దంపతులు

## ఉన్నత చదువులకై 5వేల రూపాయల ఆర్థిక సహాయం



**సుల్తానాబాద్, అక్టోబర్ 19( ది క్రైమ్ న్యూస్ ):** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని పూసాల గ్రామానికి చెందిన చిన్నారి వెంగళ హర్షిత.. ఈ మధ్యకాలంలో తండ్రి అకాల మరణం చెందడంతో అంతకుముందు తల్లి మరణించడంతో అనాథగా మిగిలిన చిన్నారికి మిర్యాలగూడ జెఎన్టియుసిలో సివిల్ ఇంజనీర్ చదువుకునే అవకాశం రాగా ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఆర్థిక సహాయం కావాలని అడగక సుల్తానాబాద్ పట్టణానికి చెందిన. శ్రీనివాస్ బ్యాంగిల్స్ స్టోర్ వారు వాసాల శ్రీలత శ్రీనివాస్ కుటుంబ సభ్యులు పెద్ద మనసుతో చిన్నారి చదువు కోసం ఐదు వేల రూపాయలు నగదు అందించడం జరిగినది. ఈ సందర్భంగా యువ సంకల్ప ఫౌండేషన్ అధ్యక్షులు తుమ్మ రాజ్ కుమార్ అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో పొట్నాల రమేష్.. వెంగళ రమేష్ తదితరులు పాల్గొన్నారు..

# మార్కెట్ కమిటి చైర్ పర్సన్ వైస్ చైర్మన్‌లను సన్మానించిన గ్రామ పంచాయతీ కార్యదర్శులు.



**ధర్మపురి అక్టోబర్ 19, (ది క్రైమ్ న్యూస్):** నూతనంగా నియమితులైన వ్యవసాయ మార్కెట్ కమిటి ధర్మపురి చైర్ పర్సన్ చిలుముల లావణ్య లక్ష్మణ్ ని, వైస్ చైర్మన్ సంగ నర్సింహులు ని ధర్మపురి మండల గ్రామ పంచాయతీ కార్యదర్శులు శనివారం కార్యాలయానికి వచ్చి ఇరువుని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు , ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, పార్టీ సీనియర్ నాయకుడు జక్కు రవీందర్, మరియు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కక్షసాధింపు కేసులతో

# మసకబారుతున్న ప్రభ !

రాజకీయ అవినీతిపై మోడీ తన పదేళ్ల పాలనలో ఒక్క నేతపైనా కేసును రుజువు చేయిం చలేక పోయారు. కేవలం విచారణలు, జైళ్లు, బెయిళ్లు లాగా కథ నడుస్తోంది. మొన్నటికి మొన్న ఆప్ నేత సత్యేంద్ర జైన్ దాదాపు రెండేళ్ల తరవాత జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. అంతకుముందు సిసోడియా, కేజ్రీవాల్, కవిత, హేమంత్ సోరెన్ వంటి వారు కూడా బెయిల్‌పై వచ్చారు. ఈ అందరిలో ఒక్కరిపైనా కేసులు రుజువు కాలేదు. దీనినిబట్టి ఇడి, సిబిఐల సమర్థతపైనా అనుమానాలు వస్తున్నాయి. అంతేగాకుండా ఇవన్నీ కూడా కేవలం రాజకీయ కక్షసాధింపు కేసలుగానే ప్రజలు ఆలోచిస్తున్నారు. నిజానికి అవినీతి కేసుల్లో నిక్కచ్చిగా వ్యవహరించడడం లేదు. బెయిల్‌పై ఉన్న జగన్ ఎపిని అడ్డగోలుగా ఐదేళ్లు పాలించి, అక్రమాలకు పాల్పడ్డా కేసులు లేకుండా పోయాయి. కెసిఆర్ కుటుంబం అనేక అవినీతి అక్రమాలకు పాల్పడ్డా కనీసం ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. ఇలా నేతల అవినీతిపై ఆరోపణలు చేసింది సాక్షాత్తు ప్రధాని మోడీయే. అయినా అవి విచారణకు నోచుకోలేదు. ఒక్కరు కూడా శిక్షార్హులు కాలేదు. దీనికంతటికీ కేసుల్లో బలం లేకపోవడం లేదా చిత్తశుద్ధి లోపించడం వటంటి కారణాలు కావచ్చు. రాజకీయాల్లో నిజాయితీ ఉండాల్సిందే. అవినీతిని దునుమాడాల్సిందే. నీతిమాలిన పనులు చేయకుండా చూసుకోవాలి. అవినీతికి పాల్పడే నేతలను శిక్షించాల్సిందే. అందుకు ఎవరు కూడా మినహాయింపు కారాదు. కానీ జరుగుతున్న తంతు చూస్తుంటే.. అందుకు భిన్నంగా ఉంది. రామరాజ్యం పేరుతో..ప్రవచనాలు పలికిన ప్రధాని మోడీ తీసుకుంటున్న నిర్ణయాలు మాత్రం పూర్తి పక్షపాతంగా ఉంటున్నాయి. కేజ్రీవాల్, సిసిఓడియా, సత్యేంద్ర జైన్, జార్ఖండ్ సిఎం హేమంత్ సోరెన్ లాంటి వారిని వేటాడి వెంటాడి ఇడి వేధించిన తీరుతో ఒరిగిందేమీ లేదు. కేసుల్లో బలం లేకపోవడం, రుజవులు సంపాదించకపోవడం, కేవలం వేధింపు చర్యగానే చూడాలి. అలాగే తెలుగు రాష్ట్రాల్లో అవినీతి ముఖ్యమంత్రులుగా రాజ్యమేలిన కెసిఆర్, జగన్‌లను మాత్రం ఏమీ చేయలేకపోయారు. ఇక్కడ వీరిని ట్రంప్ కార్డుల్లా వాడుకున్నారు. రేపు ఏ అవసరం వస్తుందో అన్న భయంలో కాపాడుకుంటూ వచ్చారు. అయితే అవినీతి, అహంకారానికి పాల్పడిన కెసిఆర్ కుటుంబంపై రంకెలు వేసిన ప్రధాని మోడీ ఆయనపైనా, కూతురు కవితపైనా ఎలాంటి చర్యలకు ఉపక్రమించలేదు. కవితను అరెస్ట్ చేసి జైలులో పెట్టినా కేసు నిలబడలేదు. దీంతో ప్రజలే తీర్పును ఇచ్చారు. అందుకే ప్రజలు తీర్పు ఇచ్చి అవినీతికి పాల్పడ్డ కెసిఆర్, జగన్‌లను అధికారానికి దూరం చేశారు. ఐదేళ్లపాటు ఎపిలో జగన్ బెయిల్‌పై ఉన్నా మోడీ పట్టించుకోలేదు. కేసులు ఏవీ ఆయనను ఏమీ చేయలేదు. ఇదంతా మోడీ ప్రాపకం వల్లనే అని చెప్పాల్సిన అవసరం లేదు. కానీ జార్ఖండ్‌లో మాత్రం అలా జరగలేదు. మోడీ ప్రభుత్వం సాగిస్తున్న కుతంత్రాలకు జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్ ప్రభుత్వం బలైంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఇడి)ని ప్రయోగించి ఏకంగా ముఖ్యమంత్రినే అరెస్టు చేయించింది. ఢిల్లీ, జార్ఖండ్‌లలో సిఎంలను అరెస్ట్ చేయించి మోడీ చరిత్ర సృష్టించారు. ఈడీ చర్యల కారణంగా దానికి ఉన్న ప్రతిష్ట దిగజారింది. సిబిఐ ప్రతిష్టా దిగజారింది. ఈ రెండు సంస్థలు దర్యాప్తులో పెద్దగా పురోగతి సాధించలేక పోతున్నాయి. ఎపిలో వైఎస్ వివేకనందరెడ్డి హత్య కేసును ఛేదించలేక పోయారు. ఈడీ అధికారుల చర్యల కారణంగా తాము, తమ కుటుంబం బాధపడ్డామనీ, తీవ్రమైన మనో వేదనను ఎదుర్కొన్నామనీ కేసులు ఎదుర్కొన్న నేతలు వ్యాఖ్యానించారు. ఇకపోతే కెసిఆర్, జగన్‌లకు లేని వేధింపులు జార్ఖండ్‌లో సోరేన్‌కు మాత్రమతప్పలేదు. ప్రజలు ఇలాంటి దర్యాప్తులపై ఆలోచించాలి. గతంలో అసోం సిఎం హిమంత్ బిశ్వశర్మ కూడా ఇలాగే ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బిజెపిలో చేరాక అవినీతి కేసులు మాయమయ్యాయి. తాజాగా సిబిఐ, ఈడీ, బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకత వస్తోంది. . నిజానికి కుంభకోణాలకు, అవినీతికి పాల్పడ్డ వారు ఎంతటి వారైనా శిక్షకు గురి కావాల్సిందే. కానీ కొందరిని మాత్రమే టార్గెట్ కావడం...కేవలం ఎన్‌డిఎ గూటిలో లేని వారికే వేధింపులు రావడం గమనించవచ్చు. రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీల నేతలు చేస్తున్న అవినీతిపై చర్యలు తీసుకోవాల్సిందే. అప్పులకుప్పగా చేసి,దివాళా తీయించిన తెలంగాణ మాజీ సిఎం కెసిఆర్ విషయంలో మోడీ ప్రేమ చూపడం సరికాదు. ఢిల్లీ మద్యం స్కామ్‌లో ఉన్న వారినెవరినీ వదలబోమని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తెలంగాణలో జరిగిన ఎన్నికల సభల్లో ప్రకటించారు. లిక్కర్ స్కాంలో ఫోన్లు మార్చి డబ్బు తీసుకున్న బీఆర్ఎస్ నేతలు కూడా జైలుకు వెళ్లే సమయం తప్పకుండా వస్తుందని హెచ్చరించినా చర్యలు మాత్రం తీసుకోలేదు. ఎందుకంటే కవిత జైలుకు వెళ్లడం, బెయిల్‌పై రావడం తప్ప దర్యాప్తులో పురోగతి లేదు. ఈ దేశంలో ఎవరైనా నేరం చేస్తే శిక్ష పడేలా చేసే హక్కు న్యాయస్థానాలకే కాని ప్రభుత్వాలకు ఉండదు. ఢిల్లీ మద్యం స్కామ్ ఇప్పటికే సుప్రీంకోర్టు విచారణలో ఉన్నది. మనీలాండరింగ్ చట్టాన్ని నిర్విచక్షణగా అమలు చేయడం పట్ల సుప్రీంకోర్టు ఇప్పటికే అనేక అభ్యంతరాలను వ్యక్తం చేసింది. అయినప్పటికీ ప్రధానమంత్రి స్వయంగా తాను రాజకీయ ప్రత్యర్థులను శిక్షిస్తానని బహిరంగ సభల్లో ప్రకటించారు. అవినీతిపరులను జైలుకు పంపిస్తామని ప్రకటించిన మోదీ ప్రాజెక్టుల్లో అవినీతి, నిరుద్యోగం, ధరణి పేరిట అక్రమాలు, ఫామ్ హౌజ్‌లో విశ్రమించడం, మూఢ నమ్మకాలు వంటి అనేక అంశాలను తెలంగాణలో నాటి సిఎం కెసిఆర్ విషయంలో ప్రస్తావించారు. కానీ ఒక్కటంటే ఒక్క చర్య తీసుకోలేదు. బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒకటేనన్న ప్రచారం ఇప్పటికీ సాగుతోంది. ఇలా రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవస్థలను దుర్వినియోగం చేయడం సరికాదు. ఇప్పటికైనా సిబిఐ,ఇడిలను పటిష్టం చేయాలి. రాజకీయాలకు దూరంగా స్వతంత్రంగా అవి పనిచేసుకునేలా చేయాలి. అప్పుడే అవినీతి నేతలకు వణుకు పుడుతుంది.

# మోడీ విధానాలే కాంగ్రెస్‌కు రక్ష

## పార్లమెంట్ ఎన్నికల నుంచి గుణపాఠం నేర్వని బిజెపి - ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా ప్రాంతీయపార్టీలు

మోడీ తీసుకున్న కాంగ్రెస్ ముక్త భారత్ నినాదాం పేలవంగా మారింది. ప్రజలు మోడీ పిలుపునకు పెద్దగా స్పందించడం లేదు. అందుకే మొన్నటి పార్టమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించారు. కేవలం మోడీ హామీలు నినాదాలుగా మారుతున్నాయి. విధానాలు అటకెక్కుతున్నాయి. బిజెపి కన్నా కాంగ్రెస్ మేలన్న వాదన మెల్లగా బలోపేతం అవుతోంది. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో చావుతప్పి కన్నులొట్టబోయిన చందంగా బిజెపి గెలిచింది. దీంతో ఎన్‌డిఎ మిత్రపక్షాల అండతో మోడీ గద్దెనెక్కారు. ఇప్పటికీ మోడీ తన విధానాలు మార్చుకోవడం లేదు. ఈ క్రమంలో ప్రాంతీయ పార్టీలు తేడా వస్తే మోడీని గద్దె దింపడానికి వెనకాడరు. మరోవైపు ప్రాంతీయ పార్టీలకు దర్యాప్తు సంస్థల పనితీరు దేశంలో జీవన్మరణ సమస్యగా మారింది. వివిధ కేసులతో ఆయా పార్టీల నేతలను వేధిస్తున్న తీరు కారణంగా అవి ఉనికిని కోల్పోయే ప్రమాదంలో పడ్డాయి. జార్ఖండ్, ఢిల్లీ ముఖ్యమంత్రులకు ఇడి వేధింపులు ఇందుకు ఉదాహరణగా చూడాలి. ఈ రెండు రాష్ట్రాల్లో అధికారాన్ని చేజిక్కించుకోవడం కోసం ఆమ్ ఆద్మీ పార్టీని, ఆ పార్టీ అధినేత ముఖ్యమంత్రి కేజీవ్రాల్‌ను తుదముట్టించడం కోసం బీజేపీ చేయని ప్రయత్నమంటూ లేదు. నిజానికి అరవింద్ కేజీవ్రాల్ ఢిల్లీలో కాంగ్రెస్‌ను దెబ్బతీయడంలో బీజేపీకి సహాయపడ్డారు. పంజాబ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించగలిగారు. ఓ రకంగా కాంగ్రెస్ ముక్త నినాదానికి ప్రయత్నించారు. ఇలా రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు ఉనికిలేకుండా చేయగలిగారు.తన సంక్షేమ ఎజెండాయే దేశ వ్యాప్తంగా కాంగ్రెస్‌తో సహా ఇతర పార్టీలు అనుకరించేలా చేయగలిగారు. కాంగ్రెస్ బలహీనపడుతున్న కొద్దీ ఆప్ బలపడింది. అయినప్పటికీ మోదీ సకల ఆయుధాలు కేజ్రీ వాల్‌పై ప్రయోగించడంతో ఆయన తన రాజకీయ అస్తిత్వం కోసం పోరాడుతున్నారు. ఆప్ జీవన్మరణ సమస్యలో ఉంది. ప్రాంతీయ పార్టీలు బలహీనపడితే వాటి స్థానంలో బలపడేం దుకు కాంగ్రెస్‌కే ఎక్కువ ఆస్కారం ఉన్నది. ఎందుకంటే కాంగ్రెస్ ఓటు బ్యాంకునే ప్రాంతీయ పార్టీలు అధికంగా కొల్లగొ ట్టాయి. బీజేపీ క్రియాశీలకంగా మారడానికి ముందే ప్రజలు కాంగ్రెస్ పట్ల వ్యతిరేకతతో ప్రాంతీయ పార్టీలను ఆదరించారు. ఇవాళ దేశంలో ఉన్న అనేక ప్రాంతీయ పార్టీల పుట్టుకకు కాంగ్రెస్ అనుసరించిన విధానాలే కారణం. ఇప్పుడు మోదీ కూడా ప్రాంతీయ పార్టీలను బలహీనపరిస్తే చివరకు ప్రధాన పోటీ మళ్లీ బీజేపీ, కాంగ్రెస్‌లకే పరిమితం కావడం ఖాయం. లేదా ప్రాంతీయ పార్టీలె కాంగ్రెస్ గొడుగు కింద బలంగా మారుతాయి. కాంగ్రెస్ ముక్త భారత్ లక్ష్యం సాధించడం కష్టమని గ్రహించినందువల్లే మోదీ ప్రాంతీయ పార్టీలను లక్ష్యంగా పెట్టుకున్నారా? అన్న అనుమానాలకు ఆస్కారం లేకపోలేదు. ఏమైనా అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ మధ్య ప్రాంతీయ పార్టీలు నలిగిపోయే పరిస్థితి పలు రాష్ట్రాల్లో కనిపిస్తోంది. బిజెపి పనితీరు సక్రమంగా లేకపోవడం వల్లనే కర్నాటక, తెలంగాణలో ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారు. కర్నాకటలో బిజెపి కరప్షన్ కారణంగా ప్రజలను దూరం చేసుకుంది. తెలంగాణలో కెసిఆర్ అహంకారాన్ని అణచివేసేం దుకు ప్రజలు కాంగ్రెస్‌ను ఎంచుకున్నారు.



లోక్‌సభ ఎన్నికల కోసం మోదీ అవినీతి అంశాలన్ని ఒక ప్రయోగంగా ఉపయోగించుకుంటున్నారా అన్నది చర్చనీయాంశమవుతోంది. 2014లో లోక్‌సభ ఎన్నికల ప్రచారం తారస్థాయికి చేరుకున్న దశలో నరేంద్రమోదీ ఈ దేశాన్ని కాంగ్రెస్ నుంచి విముక్తం చేయాలని పిలుపు ఇచ్చారు. కాని 9 సంవత్సరాల పాలన తర్వాత కూడా ఆయన దేశాన్ని కాంగ్రెస్ నుంచి విముక్తం చేయలేకపోయారు. కర్ణాటకలో బీజేపీ ఘోరపరాజయం చెందిన తర్వాత దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీకి అవకాశం లేకుండా పోతున్నది. ఇదంతా స్వయంకృతమని తెలంగాణ నిరూపించింది. కర్ణాటకతో పాటు హిమాచల్‌లో కూడా కాంగ్రెస్ అధికారంలోకి రాగలిగింది. తరవాత తెలంగాణలోనూ కాంగ్రెస్ పాగా వేసింది. ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి, జనసేన కారణంగగా బిజెపి నిలదొక్కుకో గలిగింది. సొంతంగా ఇప్పుడు పోటీ చేసినా ఆ పార్టీకి ఒక్కసీటు కూడా రాదు. కర్ణాటకలో అంతరించిపోయే స్థితిలో జనతాదళ్ (ఎస్) బీజేపీతో చేతులు కలిపింది. నిజానికి కాంగ్రెస్ పార్టీ కంటే మోదీ ప్రాంతీయ పార్టీలను అణిచివేయడంపైనే అధికదృష్టి సారిస్తున్నారే మోనని ఒకరకంగా అనిపిస్తోంది. ఈడీ, సీబీఐలను ప్రయోగించి మహారాష్ట్రలో నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ, శివసేనలను బీజేపీ చీల్చగలిగింది. పంజాబ్‌లో అకాలీదళ్‌ను దెబ్బతీసింది. బిహార్‌లో లోక్ జనశక్తిని ముక్కలు చేసింది. నితీశ్ కుమార్‌కు పొమ్మనకుండా పొగపెట్టి పంపించింది. తరవాత మళ్లీ దారికి తెచ్చుకుంది. ఉత్తరప్రదేశ్‌లో మాయావతి నేతృత్వంలోని బీఎస్పీని బీజేపీ నిర్వీర్యం చేసింది. సమాజ్‌వాది పార్టీని అస్తిత్వం కోసం పోరాడే పరిస్థితిని కల్పించింది. ఒడిషాలో నవీన్ పట్నాయక్ తర్వాత బీజేడీ భవిష్యత్ ఏమిటన్నది ప్రశ్నార్థకమైంది. తాజాగా జార్ఖండ్‌లో కూడా హేమంత్ సోరెన్‌ను వెంటాడుతోంది. దేశంలో అనేక చిన్నా చితక, ఉప ప్రాంతీయ పార్టీలు మోదీ భయంతో బీజేపీతో చేతులు కలపక తప్పడం లేదు. అయితే ప్రజల ఆకాంక్షలకోసం ప్రాంతీయ పార్టీలు ఏర్పడ్డాయో అవి ఆ ఆకాంక్షలను విస్మరించి అధికారాన్ని కొద్ది మంది వ్యక్తుల చేతుల్లో కేంద్రీకృతం అయ్యేలా చూశాయి. అరాచక పాలనతో పాటు, విపరీత అవినీతికి పాల్పడ్డాయి. ఇవాళ ప్రజలు కాంగ్రెస్ వైపో, బీజేపీ వైపో మళ్లుతున్నారంటే అందుకు ప్రధాన కారణం ప్రాంతీయ పార్టీల నేతల స్వయం కృతాపరాధాలే అని చెప్పుకోవాల్సిందే. ఈ క్రమంలో బిజెపి తన విధానాలు మార్చుకుంటే తప్ప మరింతగా నిలబడలేదు. ప్రజల్లో ఆందరణ పొందలేదు.

# విద్యుత్ ఛార్జీల నియంత్రణ ఏదీ

## ట్రూ అప్ ఛార్జీలపై పొంతన లేని ప్రకటనలు

విద్యుత్ చార్జీలు నియంత్రిస్తాం, విద్యుత్ బిల్లుల భారం తగిస్తాం అని ఉమ్మడి మేనిఫెస్టో (ఆరవ పేజీలో) హామీనిచ్చి అధికారానికి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం తన మాట నిలబెట్టుకోవాలి. సర్దుబాటు చార్జీలు విద్యుత్ వాడకానికి సంబంధించినవే. అంతకన్నా ముఖ్యంగా రెండున్నరేళ్ల క్రితం వాడిన కరెంటుకు ఇప్పుడు చెల్లించాలనడం దారుణం. కూటమి సర్కారు చార్జీలను నియంత్రించడం కాదు సరికదా మరింత విశృంఖలం గావిస్తున్నది. బిల్లుల భారం తగ్గించడం గాక పెనుభారం మోపుతోంది. ఏలినవారు విజ్ఞతతో యోచించి ప్రతిపాదిత 'సర్దుపోటు'ను ఉపసంహరించడం అందరికీ శ్రేయస్కరం! సర్దుబాటు చార్జీల మూలంగా యూనిట్‌కు రూ.1.27 మాత్రమే భారం పడుతుందని డిస్కాముల వివరణ పత్రం పేర్కొన్నది. రాష్ట్ర వ్యాప్త విద్యుత్ వినియోగం, సర్దుబాటు చార్జీ సగటు లెక్కించి ఆ మొత్తం తేల్చేశారు. కానీ వాస్తవానికి సర్దుబాటు చార్జీలను ఆయా త్రైమాసికాలనుబట్టి, ఆయా డిస్కాములు ఎంత చొప్పున వసూలు చేయవచ్చునో ఇ.ఆర్.సి నిర్ణయిస్తుంది. ఆ ప్రకారం అది ఒక్కో డిస్కాముకు ఒక్కో త్రైమాసికానికి యూనిట్‌కు ఒక్కో విధంగా ఉంటుంది. ఈ మాత్రం లాజిక్ కూడా లేకుండా ప్రజలను మభ్యపుచ్చేందుకు ప్రభుత్వ రంగంలోని డిస్కాములు యత్నించడం దారుణం. అంతేగాక ఇది పేదలకు పెనుభారం. ప్రస్తుతం వున్న టారిఫ్ ప్రకారం రోజుకు ఒక్క యూనిట్ మించకుండా (నెలకు 30 యూనిట్లు) వాడే నిరుపేదలు ఒక్కో యూనిట్‌కు ఇంధన చార్జీగా రూ.1.90, అదే నెలకు 400 యూనిట్లకు పైబడి వాడే సంపన్నులు యూనిట్‌కు రూ. 9.75 చొప్పున చెల్లించాలి. డిస్కాముల వివరణలో పేర్కొన్న సర్దుబాటు రూ.1.27 మాత్రమే అనుకున్నా నిరుపేదల ఇంధన చార్జీకి అదనంగా 67 శాతం చెల్లించాలి. అదే సంపన్నులకు మాత్రం అది 13 శాతమే! మొత్తం విద్యుత్ సంస్కరణల మాటున జరిగేవి



ఇలాంటి మాయాజాలాలను ప్రజలు గుర్తించాలి. 11 వేల కోట్లకు పైగా సర్దుబాటు చార్జీ కూడా ఈ వరుసలోనే ఉందని వార్తలొచ్చాయి. అంటే మొత్తం దాదాపు 20 వేల కోట్ల రూపాయలు చెల్లించాలన్నమాట. ఇప్పటికే అధిక ధరలు, తరుగుతున్న ఆదాయాలతో సతమతమవుతున్న ప్రజానీకం పులి మీద పుట్రలా పడిన విద్యుత్ భారాన్ని ఎలా చెల్లించగలం అని ఆందోళన చెందుతున్నారు.

జనం గందరగోళ పడుతుండగా ఈ సర్దుబాటు చార్జీలకు ఇప్పటి ప్రభుత్వానికి సంబంధం లేదని డిస్కాములు అక్టోబర్ 1న సుదీర్ఘ వివరణ ఇచ్చాయి. ట్రూ అప్, ఎఫ్‌పిపిసిఎ వంటి పేరుతో ఎప్పుడో వాడుకున్న కరెంటుకు ఇప్పుడు చార్జీ వసూలు చేయడమేమిటి? వాటిని రద్దు చేయండి' అని ప్రజలు చాలా ఏళ్లుగా ఆందోళన చేస్తున్నా పాలకులు వెనక్కు తగ్గడంలేదు. రాష్ట్రంలో ఎవరు అధికారంలోవున్నా ఈ విషయంలో మాత్రం మార్పు లేదు. సర్దుబాటు చార్జీలను నిర్ణయించి, ఆ మొత్తాన్ని వినియోగదార్ల నుండి ఎప్పుడు ఎన్ని వాయిదాల్లో వసూలు చేయాలో ఇఆర్‌సి ఉత్తర్వులిస్తుంది. కాబట్టి ఈ మొత్తం పక్రియ ఒక త్రైమాసికం పూర్తయిన వెంటనే నిర్దిష్ట గడువులోగా పూర్తి కావాలి. అధికారం ఏ పార్టీ చేతిలోవున్నా విద్యుత్ భారాలు, ఆ విధానాలూ అలాగే కొనసాగుతున్నాయి! ఒప్పందాలు కుదుర్చుకున్న ప్లాంట్ల నుండి రాష్ట్రంలో డిమాండ్‌కు తగినంత విద్యుత్ సరఫరా కావడం లేదంటూ ఓపెన్ మార్కెట్‌లో అధిక ధరకు పవర్ ఎక్స్ఛేంజి నుండి డిస్కాములు భారీగా కొనుగోలు చేశాయి. ఇవన్నీ ఆనాటి ప్రభుత్వ పెద్దల ఆదేశానుసారమే జరిగాయన్న విషయం మరువరాదు.

# వచ్చే నెలలో అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు

## ఇప్పటి నుంచే ఏర్పాట్లపై టిటిడి దృష్టి

శ్రీవారి పట్టపురాణి శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు వేళయింది. ఏటా కార్తీక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతాయి. నవంబర్ 28 నుండి డిసెంబర్ 6 వరకు జరిగే శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలకు తిరుచానూరు ముస్తాబు అవుతోంది. అమ్మవారి బ్రహ్మోత్సవాలకు ముందస్తు ఏర్పాట్లు చేపట్టిన టిటిడి పనుల్లో నిమగ్నమైంది. ఈ మేరకు బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని విభాగాల అధికారులతో కలిసి ఏర్పాట్లను టిటిడి జెఈవో వీరబ్రహ్మం పరిశీలించారు. అమ్మవారి ఆలయం, పుష్కరిణి, మాడవీధులు, నవజీవన్ కంటి ఆసుపత్రి సమీపంలోని ఖాళీ స్థలం, ఘంటసాల సర్కిల్, హైస్కూల్ పరిసరాలు, పసుపు మండపం, పూడి రోడ్డు తదితర ప్రాంతాలను జేఈఓ వీరబ్రహ్మం పరిశీలించారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు అమ్మవారి మూలమూర్తి దర్శనంతో పాటు వాహన సేవలు వీక్షించేలా టిటిడి లోని అన్ని విభాగాలు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. బ్రహ్మోత్సవాలలో చివరి రోజైన పంచమి తీర్థం లో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్ కోసం పూడి రోడ్డు, రేణిగుంట, మార్కెట్ యార్డ్ ప్రాంతాల్లో స్థలాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా భక్తులు సేదతీరేందుకు నవజీవన్ కంటి ఆసుపత్రి, హైస్కూలు, పూడి రోడ్డులోని గోశాల వద్ద జర్మన్ షెడ్లు ఏర్పాటు చేయాలన్నారు. పుష్కరిణిలోకి వెళ్లేందుకు, తిరిగి వచ్చేందుకు తగిన విధంగా గేట్లు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. తమిళనాడు భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున భక్తులకు అర్థం అయ్యేలా తమిళ భాషలోనూ సైన్ బోర్డులు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు జేఈఓ వీరబ్రహ్మం. ఇక అమ్మవారి బ్రహ్మోత్సవాలలో భద్రతా పరంగా భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకొని పటిష్టమైన భద్రత ఏర్పాట్లు



చేయనున్నట్లు టిటిడి సివిఎస్వో శ్రీధర్ తెలిపారు.పంచమి తీర్థం రోజున భక్తులు సేద తీరేందుకు ఏర్పాటు చేసే షెడ్లలో, క్యూలైన్లు, పుష్కరిణి వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయను న్నట్లు చెప్పారు. అదేవిధంగా తిరుమల నుంచి పసుపు ఊరేగిం పు మార్గాలను ముందే పరిశీలించి ఆ మార్గంలో ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు తీసుకుం టామ న్నారు. అమ్మవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను టిటిడి సిఈ సత్య నారాయణ, ఎస్ఈ జగదీశ్వర్ రెడ్డి, ఎస్ఈ ఎలక్ట్రిక్రల్ వెంకటే శ్వర్లుతో పాటు పలువురు అధికారులు కూడా పర్యవేక్షించారు.

# మతంపేరుతో కాంగ్రెస్ రాజకీయాలు మానుకోవాలి

**- హిందూ ఆలయాలపై దాడులు జరిగితే స్పందించరా..?**

**- హిందువుల దేవాలయాల జోలికొస్తే ఉపేక్షించబోం**

**- కలెక్టరుకు మెమోరాండం అందజేసిన విశ్వహిందూ పరిషత్**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణా రాష్ట్రంలో హిందూ దేవాలయాలు, పండుగలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలం అయ్యిందని మతంపేరుతో రాజకీయాలు మానుకోవాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి నాగులమల్యాల సత్యం ఆరోపించారు. హిందూ ఆలయాలపై దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం జిల్లా కలెక్టరుకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇస్లామిక్ మతోన్మాద శక్తులు హిందూ దేవాలయాలపై వరుసగా దాడులు చేస్తూ ఆలయాలను, మూల విగ్రహాలను ధ్వంసం చేస్తున్నారని, హిందూ పండుగలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నారన్నారు. దేవాలయాలపై, హిందూ విశ్వాసాలపై జరుగుతున్న దాడులపై యావత్ హిందూ సమాజం ఆక్రోశిస్తోందన్నారు. ప్రణాళికా బద్ధంగా ఇస్లామిక్ మతోన్మాదులు దాడులు జరుపుతుంటే తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి కనీసం స్పందించకపోవడం గమనిస్తే హిందువుల విశ్వాసాలను గౌరవించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందో తెలుస్తుందని మండిపడ్డారు. దాడి జరిగిన ప్రతిసారి పిచ్చివాళ్ళు చేసిన చర్యగా పోలీసులు తప్పుడు కథలు చెప్పడం హేయమైనదిగా ప్రకటించారు. తీవ్రవాద చర్యలను పరోక్షంగా కప్పిపుచ్చుతూ వాళ్ళను మరిన్ని దాడులకు ప్రేరేపించేవిగా ఉనాయని సత్యం దుయ్యబట్టారు. దాడులపై ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసి విచారణ జరిపించాలని, దేవాలయాల వద్ద పోలీస్ పికెటింగులు ఏర్పాటు చేయాలని, కోచింగ్ సెంటర్లు, పర్సనాలిటీ డెవలపమెంట్ పేరుతో రాష్ట్రంలో నిషేదిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా నిర్వహిస్తున్న కార్యక్రమాలపై కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. మజీదులు, మదర్సాలలో అనుమానిత వ్యక్తులను అరెస్టు చేయాలని, అక్రమంగా చొరబడ్డ రొహంగియా, బంగ్లాదేశీ ముస్లింలను వెంటనే తిరిగి పంపించివేయాలని మెమోరాం డంలో కోరారు. ఈ కార్యక్రమంలో ప్రఖండ అధ్యక్షులు బత్తుల విజయ్ కుమార్, ఆసరి రమేష్ టాగూర్ తారా, బొమ్మకంటి రవి, సంగెం రాజేందర్, అంజి, జంగ మురళి మోహన్, తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకర్ల తీరుతో ఇబ్బందుల్లో విశ్వకర్మ లబ్దిదారులు

**- ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధాని ఫోటో పెట్టాలి**

**- బిజెపి నేత పల్లె సదానందం**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణా రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను సమకూరుస్తోందని అయినప్పటికీ ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటాన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పెట్టకపోవడం పట్ల భారతీయ జనతా పార్టీ దళిత మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సదానందం మాట్లాడుతూ, ప్రోటోకాల్ ప్రకారం ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు ప్రధాని ఫోటో ఉండాలని తెలిపారు. కానీ, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వెంటనే ప్రతీ కార్యాలయంలో ప్రధాని ఫోటో ఉండేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బ్యాంకర్ల తీరుతో ఇబ్బందుల్లో లబ్దిదారులు : విశ్వకర్మ యోజన పథకంలో భాగంగా కులవృత్తుల వారికి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తోందని, లబ్దిదారులుగా ఎంపికైన వారిని వివిధ రకాల కారణలు చెప్పి బ్యాంకుల చుట్టూ తిప్పించుకుంటానరని పల్లె సదానందం ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకర్లు తమతీరును మార్చుకొని లబ్దిదారులకు వెంటనే రుణాలు మజూరు చేయాలని లేనిపక్షంలొ తమ ఆగ్రహసనికి గురికావాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నాయకులు పర్శ సమ్మయ్య, బెజ్జంకి దిలీప్ కుమార్, శివంగారి సతీష్, రాజం కొమురయ్య, ములుగురి రాజవీరు, రాజకుమార్, వేల్పుల వెంకటేష్, శ్రీనివాస్ యాదవ్, మొండెద్దుల జగన్, బండ కరుణాకర్, అనిల్ కుమార్, రవి, తదితరులు పాల్గొన్నారు.

# రీజినల్ స్థాయి ఫుట్ బాల్ పోటీలను ప్రారంభించిన ఎ.పి.ఎ ఎస్వోటు జిఎం





**రామగిరి, (ది క్రైమ్ న్యూస్):** రామగుండం-త్రీ , అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలోని వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో ఆర్.జి-త్రీ , ఎ.పి.ఎ, భూపాలపల్లి ఏరియాల క్రీడాకారుల మధ్య రీజినల్ స్థాయి ఫుట్ బాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా ఎస్వోటు జిఎం బి. సత్య నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఉద్యోగుల కోసం నిర్వహిస్తున్నటువంటి సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా ప్రతి సంవత్సరం వివిధ క్రీడలలో పోటీలను నిర్వహిస్తుందన్నారు. కావున నిత్యం ఉద్యోగులు సాధన చేస్తూ, నైపుణ్యం సాధిస్తూ ముందుకెళ్లాలన్నారు. అంతేకాకుండా కంపెనీ స్థాయి,కోల్ ఇండియా స్థాయిలలో నిర్వహించు పోటీలలో నైపుణ్యాన్ని ప్రదర్శించి మన రీజియన్ పేరు నిలబెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు జూపాక రాంచందర్, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం ప్రతినిధి టి.నాగేశ్వర రావు,పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, గౌరవ కార్యదర్శి వి.సునీల్ ప్రసాద్,స్పోర్ట్స్ సూపర్వైజర్ పర్సా శ్రీనివాస్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కె.వి.నరసింహారెడ్డి, ఇతర నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# నాటిన ప్రతీ మొక్కకి పర్యవేక్షణ తప్పనిసరి

**- ముత్తారం ఎంపిడిఓ సురేష్**



**ముత్తారం.అక్టోబర్.19.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండలం మచ్చుపేట రోడ్డు మార్గంలో నాటిన మొక్కల సంరక్షణలో భాగంగా గ్రామ పంచాయతీ సిబ్బందిచే శనివారం ట్రీ గార్డులను ఏర్పాటు చేయగా వాటిని ముత్తారంఎంపీడీవోపరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు కార్యక్రమాల్లో భాగంగానాటినమొక్కల సంరక్షణకుఅన్నిరకాల జాగ్రత్తలు తీసుకుంటున్నామని, ఎప్పటికప్పుడు మొక్కలను పర్యవేక్షిస్తున్నామని, తద్వారా మండలంలో పచ్చదనాన్ని పెంచుతున్నామని అన్నారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

# మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే





**సుల్తానాబాద్, అక్టోబర్ 19( ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి నియోజక వర్గం ఎలిగేడు మండలం లాలపల్లి గ్రామానికి చెందిన టిఆర్ఎస్ నాయకులు, మల్లికార్జున స్వామి దేవస్థానం మాజీ అధ్యక్షులు గుర్రం మల్లారెడ్డి గత రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించారు. శనివారం ఈ విషయం తెలుసుకున్న పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి మల్లారెడ్డి చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ అంకితభావం గల కార్యకర్తలను కోల్పోయిందని అన్నారు.

# శభాష్ జమ్మికుంట పోలీస్...

**- అత్యవసర సమయంలో క్షణాల్లో స్పందించిన ఖాకీలు..**

**- యువకుడి ప్రాణాలు కాపాడి.. క్షేమంగా ఇంటికి చేరవేత**



**జమ్మికుంట అక్టోబర్ 19 (ది క్రైమ్ న్యూస్):** జమ్మికుంట పట్టణ పోలీసులు తమ విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించి ప్రజల చేత శభాష్ అనిపించుకుంటున్నారు. వివరాల్లోకెళితే.. శుక్రవారం అర్ధరాత్రి 11:30 గంటలకు డయల్ 100 నంబర్ కు వచ్చిన కాల్ కు.. వెంటనే స్పందించి ఉజ్వల భవిష్యత్తు ఉన్న యువకుడు ప్రాణాన్ని పోలీసులు కాపాడారు. హుజరాబాద్ మండల పరిధిలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన యువకుడు అంబాల రాహుల్ జీవితంపై విరక్తి చెంది రైల్వే ట్రాక్ పై ప్రాణాలు తీసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో అక్కడికి చేరుకోగా.. చూసిన స్థానిక ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. డ్యూటీ ఇంచార్జ్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, హోంగార్డు టి. ఆనంద్, మరో హోంగార్డ్ విజేందర్ రంగంలోకి దిగి యువకుడిని పట్టుకున్నారు. సదరు యువకుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి క్షేమంగా ఇంటికి పంపించారు. అత్యవసర సమయంలో స్పందించి తమ కుటుంబ సభ్యుడైన రాహుల్ ను కాపాడినందుకు జమ్మికుంట పట్టణ పోలీసులకు రాహుల్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ధరణి అప్లికేషన్లు పెండింగ్ ఉండకుండా చూడాలి

**- పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి పటిష్ట చర్యలు**

**- పాలకుర్తి తాసిల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ధరణి అప్లికేషన్ లు పెండింగ్ ఉండకుండా చూడాలని అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ పాలకుర్తి తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాలకుర్తి మండలం తహసిల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ తనిఖీ చేసి పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. పాలకుర్తి మండలం లో మీసేవ కేంద్రాల ద్వారా వివిధ సర్టిఫికెట్ల కోసం వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సకాలంలో వాటిని జారీ చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈతనిఖీల్లోతహసిల్దార్ జ్యోతి,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి స్టడీ కార్నర్ దోహదం

**- జిల్లా విద్యాధికారి మాధవి**





**రామగిరి, (ది క్రైమ్ న్యూస్):** ఒక విద్యార్థి అభివృద్ధికి స్టడీ కార్నర్ ఎంతగానో దోహదం చేస్తుందని జిల్లా విద్యాధికారి మాధవి అన్నారు. ఈమేరకు మండలంలోని బేగంపేట గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న మల్క రాంకిషన్ రావు తన మిత్రులు తులసీరావు, డా. రవితేజ, శ్యాంల సహకారంతో పదో తరగతిలోని 23 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2200 చొప్పున మొత్తం రూ.50,800 విలువ గల స్టడీ కార్నర్ కొనుగోలు చేసి శనివారం పాఠశాల ఆవరణలో డీఈవో చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పాఠశాల ఉపాధ్యాయుడు విద్యార్థులకు కేవలం పాఠాలు చెప్పడమే తన బాధ్యత అని గాకుండా వారి అభివృద్ధి కోసం ఇలాంటి సహకారం అందించడం పట్ల అభినందించారు. పదో తరగతి విద్యార్థులకు ఈ స్టడీ కార్నర్ ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. చదువులో రాణించేందుకు దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం లూర్దు మేరి, ఉపాధ్యాయులు రాంకిషన్ రావు, శ్రీనివాస్, సంపత్ కుమార్, గీతారాణి, మంగ, స్వరూపరాణి, శ్రీదేవి, శ్రీనివాస్ తోపాటు గ్రామస్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పిల్లలకు ఎలాంటి ఆపద ఉన్న 1098కు ఫోన్ చేయాలి

**- చైల్డ్ హెల్ప్ లైన్ 1098 పై అవగాహన సదస్సు**



**రామగిరి, (ది క్రైమ్ న్యూస్):** పిల్లలకు ఎలాంటి ఆపద ఉన్న 1098 కు ఫోన్ చేయాలని పెద్దపల్లి చైల్డ్ హెల్ప్ లైన్ కౌన్సిలర్ రేనుకుంట్ల సతీష్ అన్నారు. చైల్డ్ హెల్ప్ లైన్-1098 పై అవగాహన సదస్సు గురువారం రామగిరి మండలం సుందిళ్ల గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ ఎంపీపీఎస్ స్కూల్లో నిర్వహించారు. పిల్లలకు బాల్య వివాహాలు వ్యవస్థ రద్దు అయ్యిందని, అలా చేస్తే చట్టరీత్యా చర్యలు ఉంటయ్యాన్నారు. పిల్లలను పనిలో పెట్టుకొని పనులు చేయించితే బాల కార్మికుల చట్టం ప్రకారం శిక్ష పడుతుందని అన్నారు. బడి బయట పిల్లలు, తప్పిపోయిన పిల్లలు, పోక్స్ చట్టం, అనాథ పిల్లల గురించి అవగాహన కల్పించారు. పిల్లలకు ఎలాంటి ఆపద ఉన్న ఈ 1098కి ఫోన్ చేయాలనీ పిల్లలకు చెప్పడం జరిగింది. పిల్లలు మొబైల్ ఫోన్స్ కి దూరంగా ఉండాలని కోరారు. పిల్లలకు ఎలాంటి ఆపదఉన్న24గంటలుపనిచేయడం జరుగుతుందని, ఈ చైల్డ్ హెల్ప్ లైన్-1098 కి కాల్ చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమం లో స్కూల్ హెచ్ఎం వసుందర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మంచి అలవాట్లతో ఉన్నతస్థాయికి ఎదగాలి

## - జిల్లా అదనపు జడ్జీ శ్రీనివాసరావు





**యైటింక్లయిన్ కాలనీ. (క్రైమ్ న్యూస్):** మీ భవిత మీ చేతుల్లోనే ఉంది, మీరు ఏది అవ్వాలని ఆలోచిస్తే అది అవ్వచ్చునని జిల్లా అడిషనల్ సెషన్స్ జడ్జి టి.శ్రీనివాస రావు అన్నారు. శనివారం స్పందన పాఠశాల ఆద్వర్యంలో స్థానిక సింగరేణి సిఈఆర్ క్లబ్ లో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సు కు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థి దశ నుండే మంచి అలవాట్లను అలవర్చుకుని, సమాజంలో ఉన్నతస్థాయికి ఎదగాలని మీపై ఆశలు పెట్టుకున్న మీ తల్లిదండ్రులకు న్యాయం చేయాలన్నారు. ఉన్నత స్థాయికి ఎదగాలంటే డబ్బు, ధనము కాదు జ్ఞానం కావాలి, అందుకు చదువు కావాలన్నారు. చదువుకునే వయస్సులో చదువు కొవాలని, ఒక స్థాయికి ఎదిగాక, మిస్టరీ సృష్టించకుండా, హిస్టరీ (చరిత్ర) సృష్టించాలని, తద్వారా సమాజంలో ఒక గుర్తింపు, ప్రత్యేకత, దేశభక్తి రుజువు చేసుకోవాలని హితబోధ చేశారు. ఇక తాను కూడా ఒక నిరుపేద కుటుంబం నుండి వచ్చానని, తన తండ్రి రిక్షా తొక్కేవాడని, తానుకూడా చదువుకుంటూనే షాపులో పని చేశానని, అయినప్పటికీ చదువు వదలలేదని, ఆంధ్రా యూనివర్సిటీలో గోల్డ్ మెడల్ సాధించానన్నారు. ఎదికానీ ఆలోచనా, పట్టుదలతో ఒకసారి ఫెయిల్ అయినప్పటికి చదివి, మరోమారు పరీక్షలు రాయాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ.. ఒక లక్ష్యంతో, ఆలోచనతో చదువు కోవాలన్నారు. అనంతరం ఆయన పలుపోటీల్లో ప్రతిభను కనబర్చిన చిన్నారులకు బహుమతులు అందజేసి అభినందించారు. ఇంకా ఈ సదస్సుకు స్పందన పాఠశాల కరస్పాండెంట్ పాశం ఓదెలు యాదవ్, సీనియర్ అడ్వకేట్ లు జీవన్ గ్లోరీ, కె. సదన్ కూమార్, జి. భూమయ్య, ట్రస్మా నాయకులు ఏ. కేశవరెడ్డి, గోదావరిఖని రెండవ పట్టణ ఎస్.ఐ ఎండి. హైమదుల్లా, సోషల్ వర్కర్ ఎం. శంకర్, పాఠశాల ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# టిపిటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఓటర్ అవగాహన సదస్సు

## - ముఖ్యఅతిథిగా ఆవుల రాజేష్ యాదవ్ జిల్లా అధ్యక్షులు



**గోదావరిఖని (ది క్రైమ్ న్యూస్):** స్థానిక శారదానగర్‌లోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం పెద్దపల్లి జిల్లా ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ నమోదు అవగాహన కార్యక్రమానికి పెద్దపల్లి జిల్లా టిపిటిఎఫ్ అధ్యక్షులు ఆవుల రాజేష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయుని ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ నిరుద్యోగ యువతీ యువకులు వివిధ రంగాల్లో పనిచేసేటువంటి పట్టభద్రులు, అందరూ కూడా ఓటు హక్కును వినియోగించుకోవాలని తప్పనిసరిగా ఓటు హక్కును ఆన్లైన్ లో కానీ ఆఫ్లైన్లో గాని నమోదు చేసుకోవాలని,ఇది ప్రత్యేకమైనటువంటి ఎలక్షన్ చదువుకున్న వారు మాత్రమే వేయగలిగే ఓటు అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రాడ్యుయేట్స్ టీచర్స్ ఎమ్మెల్సీ ఓటర్ నమోదు అవగాహన సదస్సులు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు . ఈ కార్యక్రమంలో టి పి టి ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ మూర్తి, పత్తి రాజి రెడ్డి ,పాఠశాల కార్యదర్శి దుర్గా ప్రసాద్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కలిసికట్టుగా రాణిస్తేనే విజయం సాధ్యం

## - అట్టహాసంగా ఎస్ జి ఎఫ్ ఉమ్మడి జిల్లా వాలీబాల్ క్రీడా పోటీలు





**సుల్తానాబాద్,అక్టోబర్ 19 (ది క్రైమ్ న్యూస్) :** కలిసికట్టుగా రాణిస్తేనే విజయం సాధ్యం అవుతుందని పెద్దపల్లి డివైఎస్ఓ సురేష్, మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు,ఎస్సై శ్రవణ్ కుమార్ అన్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఎస్ జి ఎఫ్ వాలీబాల్ క్రీడా పోటీలు శనివారం సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఉత్సాహంగా జరిగాయి. అండర్ 17 బాల బాలికల వాలీబాల్ పోటీలో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులను జిల్లా డివైఎస్ఓ సురేష్, సుల్తానాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు, ఎస్సై శ్రావణ్ కుమార్ క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడలను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్కరు ఆడడం వలన విజయం సాధ్యం కాదని జట్టు మొత్తం కలిసికట్టుగా రాణిస్తేనే విజయం సాధ్యమవుతుందని, క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటాలని,గెలుపోటములు సమానంగా తీసుకోవాలని, సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు, వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ పట్టణం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ క్రీడా పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందని, క్రీడలు ఆడడం వలన ఏకాగ్రత పెరుగుతుందని, క్రీడాకారులు రాణించి జాతీయస్థాయిలో ఆడాలని అన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు ప్రముఖులు బహుమతులు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రామచంద్రారెడ్డి, పెద్దపల్లి ఎస్ జి ఎఫ్ కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్, కరీంనగర్ వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి గిన్నె లక్ష్మణ్, జగిత్యాల వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణారెడ్డి,ద కరీంనగర్ పేట కార్యదర్శి యూనిస్ పాషా, పెద్దపల్లి పేట కార్యదర్శి దాసరి రమేష్, అధ్యక్షుడు సురేందర్, ఫిజికల్ డైరెక్టర్స్ ప్రభాకర్, సతీష్, ప్రసాద్, కుమార్, ప్రణయ్, రూప, ఖాజాబీ, సత్యం, సతీష్, సోమశేఖర్, ప్రవీణ్, కాంగ్రెస్ నాయకులు అబ్బయ్య గౌడ్, సాహిరి మహేందర్, కుమార్ కిషోర్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్కూల్ బ్యాగులు నోటుబుక్కులు పంపిణీ




**రామగిరి(ది క్రైమ్ న్యూస్):** విద్యార్థులకు చేయూతనిచ్చేదు పదంతో యూత్ ఫర్ సేవా ఆర్గనైజేషన్ వారు పలు పాఠశాలల్లో నోటుబుక్కులు స్కూల్ వేగంగా చేశారు. కమాన్ పూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల తో పాటు జూలపల్లి రొంపికుంట పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు స్కూల్ బ్యాగులు డిక్షనరీలు నోటుబుక్కులు కంపాక్స్ బాక్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు గుల్లం రజిత మహేష్ శరత్ శ్రీకాంత్ అరుణ్ తేజ పాల్గొన్నారు అలాగే ఉపాధ్యాయులు ఇన్చార్జి ప్రధానో పాధ్యాయురాలు సరళ మరియు సుజాత నిర్మల జ్యోతి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్వామి వారిని దర్శించుకున్న కమీషనర్ రామక్రిష్ణారావు



**ధర్మపురి అక్టోబర్ 19, ( ది క్రైమ్ న్యూస్):** ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానమునకు దేవాదాయ ధర్మాదాయ శాఖ రీజినల్ జాయింట్ కమీషనర్ ఏం. రామక్రిష్ణారావు శనివారం కుటుంబ సమేతంగా వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం సాంప్రదాయ ప్రకారం మేళతాళాలతో స్వాగతం పలికిన పిదప వేదపండితులు అర్చకులు స్వామి వారి ఆశీర్వచనం ఇచ్చిన తదుపరి దేవస్థానం కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ శేష వస్త్రం చిత్రపటం ఇచ్చి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమములో దేవస్థానం కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ తో పాటు వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, సూపరింటెండెంట్ కిరణ్ సీనియర్, అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు నేరెళ్ల విజయ్, సముద్రాల వంశి, మరియు అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీస్ అధికారుల కుటుంబాలకు భద్రత చెక్కులు అందజేత...



**కరీంనగర్ టౌన్, అక్టోబర్19, (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ నందు విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణంగా మరణించిన పోలీస్ అధికారుల కుటుంబాలకు భద్రత చెక్కులను శనివారంనాడు అడిషనల్ డీసీపీ ఎ లక్ష్మినారాయణ అందజేసారు.సీసీఆర్బి నందు విధులు నిర్వహిస్తున్న కె.లింగారెడ్డి గుండెపోటుతో మరణించగా, భద్రత విభాగం నుండి మంజూరైనా, 16 లక్షల రూపాయల చెక్కును వారి భార్య కు, ఏ.ఆర్. విభాగంనందు విధులు నిర్వహిస్తు అనారోగ్య కారణంగా మృతిచెందిన హెడ్ కాన్స్టేబుల్ ఎం.శ్రీనివాస్ కి భద్రత విభాగం నుండి మంజూరైన 8 లక్షల రూపాయల చెక్కును వారి భార్యకు, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నందు విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మృతిచెందిన కానిస్టేబుల్ టి.కుమారస్వామి ఎక్స్గ్రేషియా భద్రత చెక్కు 8 లక్షల రూపాయలను వారి భార్యకు అందజేశారు. ఈ చెక్కులు అందజేసిన కార్యక్రమంలో అడిషనల్ డీసీపీతో పాటు సీపీవో జూనియర్ అసిస్టెంట్ కళ్యాణి ఉన్నారు.

# కరెంట్ షాక్‌తో రైతుకు గాయాలు



**ముత్తారం.అక్టోబర్.19.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన కుక్కల సాగర్ అనే రైతు శనివారం కరెంట్ షాక్ కు గురై గాయాలు అయ్యాయి.రైతు తన వ్యవసాయ పొలానికి సంబంధించిన విద్యుత్ మోటార్ నడవకపోవడంతో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ వద్దకు వెళ్లి చూడగా అక్కడ ఫ్యూజ్ కు సంబంధించిన వైరు చెడిపోవడంతో దాన్ని సరిచేసే క్రమంలో విద్యుత్ షాక్ కు గురయ్యాడు. రైతు చేతికి షాక్ తగలడంతో గాయాలు అయ్యాయి.దీన్ని గమనించిన రైతులు వెంటనే అతనిని ఆసుపత్రికి తరలించారు.

# దళిత ప్రొఫెసర్‌కు వైస్ చాన్సలర్‌గా అవకాశం

## ఫలించిన దళితుల సుదీర్ఘ నిరీక్షణ

## మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ



**కరీంనగర్ టౌన్, అక్టోబర్19(ది క్రైమ్ న్యూస్):** ఎట్టకేలకు ఎస్సీ సామాజికవర్గానికి చెందిన ప్రొఫెసర్ ఎం కుమార్ వైస్ ఛాన్సలర్ నియామకం కావడం సంతోషకర పరిణామమని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. హైదరాబాద్ లోని సీఎల్పీ సమావేశ మందిరంలో ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ 107 సంవత్సరాల చరిత్రలో దళితులు నోచుకోలేని వీసీ పదవి ఇప్పుడు దక్కిందని,దీంతో దళితుల సుదీర్ఘ నిరీక్షణ ఫలించిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో తొమ్మిది విశ్వవిద్యాలయాలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదంతో ప్రభుత్వం వైస్ చాన్సలర్లను నియమించిందని, అందులో ఓయూ ఇంజినీరింగ్ కాలేజీలో సివిల్ ఇంజినీరింగ్‌లో సీనియర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఎం.కుమార్ వీసీగా నియామకం కావడం హర్షనీయమని, ఇది దళిత జాతికి దక్కిన గౌరవంగా ఆయన అభివర్ణించారు. కుమార్ నియామకంతో మాదిగ లకు ఇచ్చిన మాట ను సీఎం రేవంత్ రెడ్డి నిలబెట్టుకున్నారని ఆయన తెలిపారు. వర్గీకరణకు అనుగుణంగానే వీసీగా కుమార్ నియాకమం జరిగినట్టుగా భావిస్తున్నామని డాక్టర్ కవ్వంపల్లి పేర్కొన్నారు. వీసీ ల నియామకం లో ప్రాధాన్యత ఇచ్చి దళితులపైన అభిమానాన్ని,చిత్తశుద్ధిని సీఎం రేవంత్ రెడ్డి చాటుకున్నారని ఆయన పేర్కొన్నారు. అలాగే వీసీలుగా నియామకమైన వారు సైతం అపార అనుభవం ఉన్నవారేనన్నారు.వీసీల నియామకానికి ఆమోదం తెలిపిన రాష్ట్ర గవర్నర్ కు, నియమించిన రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# ఆంధ్రాలో మానకొండూర్ వాసికి ఘన సన్మానం

## అభినందించిన మాజీ ఎమ్మెల్యే రసమయి



**మానకొండూర్(ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల కేంద్రానికి చెందిన జూలపల్లి రాజు(51) గత 38 సంవత్సరాలుగా చిత్రకళాకారుడిగా పనిచేస్తూ అప్పుడప్పుడు వివిధ నాటక ప్రదర్శనలో సాయిబాబా వేషధారణలో గుర్తింపును సాదించి సాయిచిత్ర రాజుగా అందరికి సుపరిచితుడయ్యాడు. ఇటీవల సాయిబాబా 189వ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లా చిలకలూరిపేటకు చెందిన శ్రీ జయ జయ సాయి ట్రస్ట్ వారు ఆంధ్ర, తెలంగాణ కళాకారులచే కళాప్రదర్శనలు నిర్వహించగా సుబ్బయ్యతోట గ్రామంలో సాయి వేషధారణలో అచ్చం సాయి మాదిరిగానే రాజు కనబరిచిన అద్భుతమైన నటనకు గాను ట్రస్ట్ అద్యక్షుడు పూసపాటి బాలాజీ నటనా విభాగంలో రాజును ఎంపిక చేసి చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు చేతుల మీదుగా జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు. జ్ఞాపికతో మానకొండూర్ కు వచ్చిన సాయిచిత్ర రాజును మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జివి రామకృష్ణారావు సన్మానించి అభినందించారు.

# అవగాహన లేని మాటలు పుట్టమధుకే సాధ్యం

**- నిన్న సింగరేణి కంపెనీ మీద శ్రీధర్ బాబు మీద చేసినటువంటి ఆరోపణలు అవాస్తవం**

**- ఒక ప్రజా ప్రతినిధునిగా మాజీ ఎమ్మెల్యేగా, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ గా ఉండి మాట్లాడే ముందు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి - పద్ధతి మార్చుకోవాలని హితవు పలికిన ఐఎన్టియూసి ఆర్ జి త్రీ ఏరియా ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి**



**రామగిరి(ది క్రైమ్ న్యూస్):** ఒక ప్రజా ప్రతినిధునిగా మాజీ ఎమ్మెల్యేగా, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ గా ఉండి మాట్లాడే ముందు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని పద్ధతి మార్చుకోవాలని ఐఎన్టియుసి ఆర్.జి-త్రీ ఏరియా ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి హితవు పలికారు. రామగిరి మండలం సెంటనరి కాలనీలోని ఐఎన్టియూసి (శ్రీపాద భవన్)లో ఐఎన్టియుసి ఆర్.జి-త్రీ ఏరియా ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి మాట్లాడుతూ నిన్న సుశి కంపెనీకి సంబంధించిన బోనస్ ఇవ్వకుండా వెళ్లిపోయిందని అది శ్రీధర్ బాబు వలనే అని చెప్పడం సిగ్గుచేటు, సంవత్సరానికి ఒక నెల చొప్పున సుశీ కంపెనీ ఆ కంపెనీలో పని చేసినటువంటి కార్మికులకు బోనస్ చెల్లించిన తర్వాతనే, సుశి కంపెనీకి రావాల్సినటువంటి లావాదేవీలు సింగరేణి కంపెనీ క్లియర్ చేసి పంపించింది, అసలు మీ ప్రభుత్వ ఉండగా ముఖ్యమంత్రిగా ఉన్నటువంటి చంద్రశేఖర రావు కాంట్రాక్టు కార్మికుల అందరిని కూడా పర్మనెంట్ చేస్తానని మాట్లాడి అసెంబ్లీ సాక్షిగా కాంట్రాక్టు కార్మికు లేదు లేరని అబద్ధాలు ఆడినటువంటి మీ ప్రభుత్వం ఇవ్వాళ కాంగ్రెస్ పార్టీ తీసుకున్నటువంటి నిర్ణయానికి కాంట్రాక్ట్ కార్మికులకు భువనస్తోపాటు మెరుగైనటువంటి జీతాలు ఇవ్వాలని ఆలోచన జీర్ణించుకోలేక మీరు తప్పుడు వాక్యాలు చేస్తూ సమయాన్ని వృధా చేస్తున్నారు. ఇక కాంగ్రెస్ గవర్నమెంట్ సింగరేణి కంపెనీతో మాట్లాడి కాంట్రాక్ట్ కార్మికులకు 5000 రూపాయలు బోనస్ చెల్లించాలని నిర్ణయించినటువంటి విషయాన్ని జీర్ణించుకోలేక పుట్ట మధు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నాడు సుశి కంపెనీ వెళ్లిపోయి చాలా రోజులు అవుతున్న సందర్భంలో ఆసమయంలో అక్కడ పని చేసినటువంటి కార్మికులకు 5000 రూపాయలు భువన చెల్లించే విషయంలో అక్కడున్నటువంటి యజమాన్యానికి క్లారిఫికేషన్ లేక అవి బ్లాక్ లో పెట్టినారు అక్కడ చేసినటువంటి కార్మికుల కు ఏ విధంగా పేమెంట్ చేయాలని ఆలోచనలు కంపెనీ ఉంది వాళ్ళకి ఇవ్వవలసిన అమౌంట్ కూడా అర్జీ టు మేనేజ్మెంట్ దగ్గర ఆపడం జరిగింది ఇది తెలుసుకోకుండా తెలిసి తెలియని నాలెడ్జితోని పుట్ట మధుకర్ మాట్లాడాలని మేము ఐఎన్టిసి పక్షాన ఖండిస్తున్నాం ఇక ముందు మాట్లాడే ముందు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికుల సంఘం పెద్దపల్లి జిల్లా జనరల్ సెక్రెటరీ కిరణ్ రెడ్డి, ఐ ఎన్ టి యు సి నాయకులు కిలి శెట్టి సాయి కృష్ణ, బత్తుల రమేష్, రామిళ్ళ మనోహర్, మడ్డి రాజకుమార్, శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మయ్య, ఉడత శంకర్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేదల పెన్నిధి వెలిచాల జగపతిరావు

**- కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు**



**కరీంనగర్ ప్రతినిధి అక్టోబర్ 19(క్రైమ్ న్యూస్):** పేదల పెన్నిధిగా సీనియర్ కాంగ్రెస్ నేత దివంగత వెలిచాల జగపతిరావు చిరస్థాయిలో నిలిచిపోయారని కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, వెలిచాల రాజేందర్ రావు యువసేన ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రముఖ తెలంగాణ ఉద్యమ కారులు, కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే దివంగత వెలిచాల జగపతిరావు రెండో వర్ధంతిని శనివారం కరీంనగర్ లోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు యువసేన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కాంగ్రెస్ కార్పొరేటర్లు, రాజేందర్ రావు యువసేన ప్రతినిధులు జగపతిరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నేతలు, కాంగ్రెస్ కార్పొరేటర్లు మాట్లాడుతూ జగపతిరావు ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, మార్క్ ఫెడ్ చైర్మన్ గా అత్యుత్తమ సేవలందించి మంచి పేరు సంపాదించారని పేర్కొన్నారు. నిరంతరం పేదల కోసం పరితపించిన మహా నేత జగపతిరావు అని, ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని తెలిపారు. రాష్ట్రంలోనే కరీంనగర్ నియోజకవర్గాన్ని అత్యుత్తమంగా అభివృద్ధిలో తీర్చిదిద్దారని చెప్పారు. ఉమ్మడి జిల్లాలో కరెంటు వెలుగుల కోసం పరితపించిన మహనీయులు జగపతిరావు అని కొనియాడారు. పట్టుదలతో అప్పటి ప్రభుత్వాన్ని ఒప్పించి కరీంనగర్ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయించిన ఘనత ఆయనకే దక్కుతుందని పేర్కొన్నారు. యువత ఆశాజ్యోతి గా నిలిచి అనేకమందికి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించారని, వారి కుటుంబాలు ఎల్లవేళలా జగపతిరావును గుర్తుంచు కుంటారని పేర్కొన్నారు. వెలిచాల జగపతిరావు అంటేనే టైగర్ గా పేరు గడించారని, ఉదార స్వభావంతో అందరి మదిలో చిరస్మరణీయులుగా జగపతిరావు నిలిచారని వారు గుర్తు చేశారు. ఉమ్మడి జిల్లాల్లో ఎంతోమందిని రాజకీయాలకు పరిచయం చేసి ఉన్నత స్థానాలు అధిరోహించేలా కృషిచేసిన మహానేత జగపతిరావు అని వారు పేర్కొన్నారు. పేదల పెన్నిధిగా తుది శ్వాస విడిచే వరకు నిరంతరం వారి సంక్షేమ లక్ష్యంగా పనిచేశారని చెప్పారు. జగపతిరావు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేస్తూ, ఆయన అడుగుజాడల్లో ముందుకు నడవాలని సూచించారు. జిల్లా అభివృద్ధికి జగపతిరావు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కోడూరి సత్యనారాయణ గౌడ్, ఆరెపల్లి మోహన్, కాంగ్రెస్ నాయకులు ఆకారపు భాస్కర్ రెడ్డి, వహజుద్దీన్, తిరుపతి గౌడ్, పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, కార్పొరేటర్లు సరిళ్ల ప్రసాద్, కాశెట్టి లావణ్య శ్రీనివాస్, గంట కళ్యాణి శ్రీనివాస్, ఆకుల పద్మ ప్రకాష్, ఆకుల నర్మదా నర్సయ్య, చాడగొండ బుచ్చిరెడ్డి, పిట్టల వినోద శ్రీనివాస్, నేతికుంట యాదయ్య, మెండి శ్రీలత చంద్రశేఖర్, కోటగిరి భూమా గౌడ్, హర్ష కిరన్మాయి మల్లేశం, కాంగ్రెస్ నాయకులు నడిపెల్లి అశోక్ రావు, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, రోళ్ల సతీష్, వెలిచాల రాజేందర్ రావు యువ సేన ప్రతినిధులు గుర్రాల రాజేశ్వర్ రెడ్డి, కొండ పరశురామ్ గౌడ్, గుమ్మడి రమేష్, తడకపల్లి రవీందర్, గొట్టిముక్కల బ్రహ్మాచారి, సంకినేని రానప్రతాప్, కందుల సాగర్, తదితరులు ఉన్నారు.

## హెచ్ ఆర్ సి ఐ జిల్లా అధ్యక్షునిగా కొండల రాజేందర్ కుమార్ నియామకం



**రామగిరి, (ది క్రైమ్ న్యూస్):** హ్యూమన్ రైట్స్ కౌన్సిలింగ్ ఫర్ ఇండియా హెచ్ ఆర్ సి ఐ పెద్దపెల్లి జిల్లా అధ్యక్షునిగా కొండల రాజేందర్ కుమార్ ని నియమించడం జరిగిందని హెచ్ ఆర్ సి ఐ నేషనల్ చెర్మన్ చెన్నూపాటి శ్రీకాంత్, నేషనల్ జనరల్ సెక్రటరీ నందం నర్సిములు, అడిషనల్ జనరల్ సెక్రటరీ మాదాసు చారేంద్ర ఉత్తర్వులు జరిచేయడం జరిగింది. ఈ సందర్భంగా కొండల రాజేందర్ కుమార్ మాట్లాడుతూ సమస్య మీది పరిష్కారం మాది అంటూ దళిత, పిడిత, పేద బలహీన ప్రజల అణగారిన కులాల వారికీ అగ్రవర్ణ కులాలలో ఉండబడే పేద ప్రజలకు విక్రమార్కుడిలా పనిచేస్తానన్నారు. మానవహక్కుల ఉల్లంఘణ లేని సమాజం కోసం అహర్నిశలు కష్టపడతానన్నారు. ఏంతటివారైనా వారు ఏ హొదాలో వున్నా కూడా అన్యాయం జరిగితే సహించేదిలేదన్నారు. మానవహక్కుల ఉల్లంఘణ జరిగితే న్యాయపోరాటం చేస్తానని హామీయిచ్చారు. అవినీతి లేని సమాజన్ని చూడాలనీ ఆశిస్తున్నాను అన్నారు. అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యం చేయడం కోసం అహర్నిశలు కష్టపడతానని, ప్రజా సమస్యల పట్ల బాధ్యతతో పనిచేస్తానని, నా నియామకానికి సహకరించిన జాతీయస్థాయి నాయకులకు స్టేట్, డిస్టిక్ నాయకులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు.

# ఆర్థిక సహాయం

**కమలాపూర్ (ది క్రైమ్ న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని ఉప్పల్ గ్రామంలో మరణించిన బైతి ఐలయ్య వారి కుటుంబానికి అండగా నిలుస్తూ పుల్లా అద్భుతరావు బిజెపి సీనియర్ నాయకులు 50కిలో రైస్ బాగ్స్ ఇవ్వడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో పులుగం రాజు నదునూరి ప్రసాద్ ర్యాకం సుధాకర్ అట్ల నాగరాజు రాణా ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు



## ఇల్లందులో జర్నలిస్టు సుదర్శన్ పై జరిగిన దాడిని ఖండిస్తున్నాం

**- దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి..**

**- డిజెఎఫ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ దేవి రాజలింగు..**




**ఎండపల్లి, అక్టోబర్19(ది క్రైమ్ న్యూస్ ):** ఇల్లందులో ఆదాబ్ హైదరాబాద్ జర్నలిస్టు సుదర్శన్ పై జరిగిన దాడి హేయమైన చర్యలని డిజెఎఫ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ దేవి రాజలింగు అన్నారు. డిజెఎఫ్ ( డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ) జాతీయ అధ్యక్షులు మానసాని కృష్ణారెడ్డి, డిజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మోటపలుకుల వెంకట్ ఆదేశాల మేరకు ఇల్లందు జర్నలిస్ట్ నిట్టు సుదర్శన్ పై జరిగిన దాడికి నిరసనగా జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కేంద్రంలో పాత్రికేయులతో కలిసి దేవి రాజలింగు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రజలకు, ప్రభుత్వానికి మద్య వారధిగా ఉంటూ నిస్వార్థంగా ప్రజలకు నిజాలను నిర్భయంగా చూపిస్తు సేవ చేస్తున్న జర్నలిస్టులపై దాడులు, హత్యాహత్నాలు, అక్రమ కేసులు పెట్టడం లాంటి చర్యలను అరికట్టాలని, జర్నలిస్టుల భద్రతకై జీవో తేవాలని, ఘటనపై పటిష్ఠ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై జరిగే దాడుల వంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి దాడికి యత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిజేఎఫ్ మండల అధ్యక్షులు గౌరి ప్రభాకర్, గౌరవ అధ్యక్షులు ఎలుక భగవాన్, ప్రధాన కార్యదర్శి బండి శ్రీధర్, జగిత్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తుమ్మ శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి మనోజ్, కార్యవర్గ సభ్యులు వైద్య సతీష్, ఎండి రియాజ్, సాగర్, కాల్వ రమేష్, బచ్చలి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## గౌడ్స్, పద్మశాలి ఫ్లాట్స్‌లలో అక్రమ నిర్మాణాలపై భూకబ్జాదారులపై చర్య తీసుకోవాలి

**- సూరయ్యపల్లి గ్రామ మాజీ వార్డ్ మెంబర్ అరల్లి కిరణ్ గౌడ్**



**రామగిరి(ది క్రైమ్ న్యూస్):** మంథని గౌడ్స్, పద్మశాలి ఫ్లాట్స్ లలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ కి సూరయ్యపల్లి గ్రామ మాజీ వార్డ్ మెంబర్ అరల్లి కిరణ్ గౌడ్, విద్యార్థి జేఏసీ నాయకులు బెజ్జంకి డిగంబర్, నాయకులు బూడిద తిరుపతి లు వినతి పత్రాలు సమర్పించారు. మంథని పట్టణం శివారు లోని గౌడ్స్, పద్మశాలి ఫ్లాట్స్ లలో అక్రమ నిర్మాణాలపై భూకబ్జాదారులపై చర్య తీసుకోవాలని కోరుతూ స్థానిక పెద్దపల్లి జిల్లా స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, మంథని తాసిల్దార్, మంథని మున్సిపల్ కమిషనర్ లకు మెమోరాండం ఇవ్వడం జరిగింది. అంతేకాకుండా ఈ యొక్క ఫ్లాట్స్ లలో అక్రమ మార్గంలో ఫ్లాట్లు పొందిన వారిని వెంటనే గుర్తించి వాటిని రద్దు చేసి అర్హులైన నిజమైన నిరు పేదలకు కేటాయించాలని అధికారులను కోరడం జరిగింది. దీనిపై అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ స్పందిస్తూ త్వరలోనే సమగ్ర విచారణ చేపట్టి అక్రమ మార్గంలో ఫ్లాట్లు పొందిన వ్యక్తులను గుర్తించి చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సూరయ్యపల్లి గ్రామ మాజీ వార్డ్ మెంబర్ అరల్లి కిరణ్ గౌడ్, విద్యార్థి జేఏసీ నాయకులు బెజ్జంకి డిగంబర్, నాయకులు బూడిద తిరుపతి పాల్గొన్నారు.

## ట్రాన్స్ జెండర్లకు స్వయం ఉపాధి, రక్షణ పై అవగాహన



**రామగిరి(ది క్రైమ్ న్యూస్):** ట్రాన్స్ జెండర్లకు స్వయం ఉపాధి, విద్య, ఆరోగ్య, గృహ సంబంధిత అంశాలపై పెద్దపల్లి జిల్లా కలెక్టర్ . కోయ శ్రీహర్ష, అదనపు జిల్లా కలెక్టర్ (స్థానిక సంస్థల) జె. అరుణశ్రీ ఆదేశాల మేరకు జిల్లా సంక్షేమ అధికారి ఎన్. వేణుగోపాల్ జిల్లా పర్యవేక్షకులు కె. రాజయ్య జిల్లా సంక్షేమ కార్యాలయం నందు అవగాహన కల్పిస్తూ జిల్లాలో ట్రాన్స్ జెండర్లకు రక్షణ సౌకర్యాలు కల్పిస్తామని సూచించారు. అదేవిధంగా జిల్లా మహిళ సాధికారత కేంద్ర బృందం సమాజంలో ట్రాన్స్ జెండర్లు ఎదుర్కుంటున్నటువంటి లింగ వివక్షత పట్ల ఎదుర్కుంటున్న సమస్యలపై, సామాజిక భద్రత, ఆర్థిక నిర్మూలన, స్వచ్ఛత, పరిసరాల పరిశుభ్రత, బ్యాంక్ రుణాలు, జీవిత భీమలు, ఆధార్ కార్డు యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రామగుండం సీడీపీవో - ఆర్. అలేఖ్య గారు, పోషన్ అభియాన్ కోఆర్డినేటర్ కె. అనిల్ కుమార్, చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూట్ కౌన్సిలర్ సి. హెచ్. సమత, ట్రాన్స్ జెండర్స్ జిల్లా అధ్యక్షురాలు - కామేశ్వరి, కావ్య, సాలోని, లాస్య, అలకనంద, ధరణి దుర్గా తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామి గ్రామ సభలు..!

**- ఉపాధిహామి పథకంలో చేపట్టే పనుల గుర్తింపుపై చర్చ**



**రామగిరి(ది క్రైమ్ న్యూస్):** కమాన్ పూర్ మండలంలోని జూలపల్లి, గుండారం గ్రామాల్లో 2025-28 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామి గ్రామ సభలు ఆయా గ్రామ పంచాయతి కార్యాలయాల ఆవరణలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఉపాధిహామి పథకంలో చేపట్టే పనుల గుర్తింపుపై చర్చించారు. ఇందులో ప్రధానంగా వ్యవసాయాధారిత పనులను గుర్తించారు. ఇప్పటి వరకు మండలంలోని గొల్లపల్లి, పేరపల్లి, రొంపికుంట, నాగారం, సిద్దిపల్లె, పెంచికల్పేట, గుండారం. జూలపల్లి గ్రామాల్లో ఉపాధిహామి గ్రామ సభలు నిర్వమించడం జరిగింది. ఇక కమాన్ పూర్ మండల కేంద్రంలో మాత్రమే ఉపాధిహామి పనుల గుర్తింపు గ్రామ సభ నిర్వహించాల్సి ఉంది. సోమవారం కమాన్పూర్ గ్రామ పంచాయతి కార్యాలయం ఆవరణలో ఉపాధిహామి గ్రామ సభ నిర్వాహణతో మండలంలో ఉపాధిహమి గ్రామ సభల్లో పనుల గుర్తింపు ప్రక్రియ ముగియనుంది. ఈ ఉపాధిహమి గ్రామ సభల్లో ఎంపీడీవో లలిత, ఏపీవో లావణ్య, పంచాయతి కార్యదర్శులు అంబటి శంకర్, బచ్చల ప్రసాద్, టీఏ ఎం. అఖిలతో పాటు రైతులు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్-1 నిర్వహించలేని అసమర్థులు

**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** గత పదేళ్లుగా నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం గ్రూప్ -1 పరీక్ష నిర్వహించ లేదని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం నియమాకాలను భర్తీ చేస్తుందని వివరించారు. డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలు లభించాయన్నారు. జీవో 29పై అనవసర అపోహలు సృష్టిస్తున్నారని చెప్పారు. శనివారం గాంధీభవన్‌లో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ....బీఆర్ఎస్ నేతలు రెచ్చగొట్టి వివాదాలు సృష్టిస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవో29 వల్ల 3,800 మందికి ఎక్కువగా మెయిన్స్ రాసే అవకాశం దక్కిందని చెప్పారు. రిజర్వేషన్లలో అన్యాయం ఉంటే కోర్టులు ఊరుకుంటాయా? సింగల్ బెంచ్, డివిజన్ బెంచ్ ఓకే చేశాయి కదా అని తెలిపారు. కొంతమంది రాజకీయ నేతలు 33,383 మంది అభ్యర్థుల జీవితాలతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం చేస్తున్న పనిని అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. కోర్టు దిక్కరణకు పాల్పడుతున్నారని అన్నారు. గ్రూప్ -1 అభ్యర్థుల జీవితాలతో ఆడుకోవాలని చూస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కలిసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్రలు చేస్తున్నారన్ని ÷ర్ అయ్యారు. గ్రూప్ -1 మెయిన్స్ కు 1:100 కావాలని అడుగుతున్న వారే ఈ రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. డీఎస్సీ పరీక్షను కూడా ఇలాగే అడ్డుకోవాలని చూశారని..11 వేల ఉద్యోగాలు ఇచ్చామని గుర్తుచేశారు. గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షలు యధావిధిగా జరుగుతాయని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే కగార్ దాడులు

**- బూటకపు ప్రచారాలను ఖండించండి -సామూహిక హత్యలకు వ్యతిరేకంగా పోరాడండి -దక్షిణ సబ్ జోనల్ బ్యూరో సమత పేరిట లేఖ**

**చర్ల,(ది క్రైమ్ న్యూస్):** మావోయిస్టు మహిళ అగ్రనేత సుజాతను అదుపులోకి తీసుకున్నామంటూ పాలకవర్గాలు చేస్తున్న బూటకపు ప్రచారాలను ఖండించాలంటూ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) దక్షిణ సబ్ జోనల్ బ్యూరో సమత పేరిట శనివారం ఒక లేఖ విడుదల చేశారు. సామ్రాజ్య వాదుల దళారి నిరంకుశ బూర్జువా వర్గాల దోపిడీ ప్రయోజనాలకు అడ్డంకిగా మారిన భారత కమ్యూనిస్టు (మావోయిస్టు) పార్టీని నిర్మూలించడానికి కేంద్రం, ఛత్తీస్ ఘడ్ లోని బిజెపి ప్రభుత్వం, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కటై ఆపరేషన్ కగార్ ను కేంద్ర హోం మంత్రి అమీషా నాయకత్వంలో 11 రాష్ట్రాల ముఖ్యమంత్రులు పోలీస్ ఉన్నతాధికారులు ప్రత్యేక సమావేశం జరిపి 2026 కల్లా మావోయిస్టులను నిర్మూలిస్తామని ప్రకటించినట్లు తెలిపారు. దీనిలో భాగంగానే ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొంటున్న వారిపై సామ దాన దండోపాయాలు అమలు చేస్తున్నారని అన్నారు. అందులో భాగంగానే ప్రజలలో మానసిక దాడులు భయాందోళనలు సృష్టించడానికి కా, సుజాత అరెస్టు అయినట్లు బూటకపు ప్రచారం చేస్తున్నారన్నారు.కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసమే తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఛత్తీస్ ఘడ్ లోని బిజెపి ప్రభుత్వం కలిసి పార్టీని నిర్మూలించాలని క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కార్పొరేట్ల ప్రయోజనాలు కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ రాష్ట్ర అనుమతులతో దామగుండంలో విఎల్ఎఫ్ రాడార్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారని దీని ఫలితంగా అడవులు జంతువులు జీవ వైవిద్యం విధ్వంసం అవడంతో పాటు 20 గ్రామాల ప్రజలు నిర్వాసితులు అవుతున్నట్లు పేర్కొన్నారు. బస్తర్‌లో ప్రాకృతిక వనరులను కొల్లగొట్టడానికి క్యాంపులు పెట్టి ఆదివాసి ప్రజలపై దాడులకు పాల్పడుతూ వారిని అడవుల నుండి తరిమి వేయాలను కుంటున్నారని అన్నారు. తరతరాలుగా జీవిస్తున్న దాదాపు 78 గ్రామాల ప్రజలను టైగర్ జోన్ నిర్మాణం పేరుతో ఇళ్లను ఖాళీ చేస్తున్నారని అన్నారు. బస్తర్‌లో జల్ జంగిల్ జమీన్ ఆత్మగౌరవం కోసం మా ఊళ్లో మా రాజ్యం అంటూ అధికారం కోసం పోరాడుతున్న ప్రజలపై ప్రాకృతిక వనరులను కాపాడుకోవడానికి కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలపై వారికి అండగా నిలిచిన పార్టీని,పి ఎల్ జి ఏ ను ఇప్పటివరకు ఆపరేషన్ కగారు పేరుతో జరిపిన నరహంతక దాడుల్లో దాదాపు 200 మంది మరణించారని తెలిపారు. జనవరి 1న ఛత్తీస్ ఘడ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ముందువెండిలో ఆరు మాసాల చిన్నారి హత్యతో మొదలై నేటికీ వరుస ఘటనలతో వారం పది రోజులకు ఒక ఊచకోతను సృష్టిస్తున్నారని,హ్రా,రఘునాథపాలెం,తులి తులి, పాములూరు, కరున్ ఘడ్, ఘటనలతో ఆదివాసి యువతను రైతులను విప్లవకారులను స్త్రీ పురుష భేదం లేకుండా సామూహిక హత్యకు పాల్పడుతున్నారు అన్నారు.అనేక ఘటనలో యువతను కాల్చి చంపి ఎదురు కాల్పుల్లో మావోయిస్టులు మరణించారని పోలీసులు కల్పిత కథలు చెబుతున్నారని అన్నారు. ఆపరేషన్ కగార్ ప్రారంభమైన దగ్గర నుండి ఆదివాసి ప్రజలను హత్య చేసి కనీసం మృతుల పేర్లయినా ప్రకటించకుండా శవాల ముఖాలు కనబడకుండా కప్పేస్తూ గుర్తుతెలియని మావోయిస్టుల మరణాలు


భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
దక్షిణ సబ్ జోనల్ బ్యూరో
పత్రికా ప్రకటన
తేది: 19- అక్టోబర్ 2024

అంటున్నారని అన్నారు.ప్రజాహిత ప్రగతిశీల ప్రజాస్వామ్య విప్లవ సంస్థలు ఐక్యమై గత పది నెలలుగా దండకారణ్య ఆదివాసి పీడిత ప్రజలపై కొనసాగుతున్న పాశవిక కగార్ దాడులను ఊచకోతలను ఖండించాలని మావోయిస్టు పార్టీ విడుదల చేసిన లేఖలో పేర్కొన్నారు.

# వైరా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు..

## - నిరుపేద మహిళలకు కుట్టు మిషన్ వితరణ..

ఖమ్మం ఉమ్మడి జిల్లా, ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్): వైరా మండల ఆర్య వైశ్య మహాసభ ఆధ్వర్యంలో కొణతాలపల్లి సుబ్బారావు, కోటేశ్వరి ల మనవరాలు హరిణి పుట్టినరోజు సందర్భంగా ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన నిరుపేద మహిళలకు శనివారం కుట్టు మిషన్ ను వితరణగా అందించారు వైరా వాసవి కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపం లో వైరా ఆర్యవైశ్య మండల మహాసభ అధ్యక్షులు మిట్టపల్లి కిరణ్ కుమార్ అధ్యక్షతన ఖమ్మం జిల్లా ఆర్య వైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి వనమా విశ్వేశ్వరరావు స్వహస్తాలతో వైరా కి చెందిన నిరుపేద ఆర్య వైశ్యులు మిట్టపల్లి లక్ష్మి కి కుట్టు మిషన్ వితరణ గా అందించారు. అదే విధంగా కిడ్నీ ఆపరేషన్ చేపించిన వ్యక్తి కి కొత్తూరు రమణ 25 కేజీల బియ్యం వితరణ గా అందించారు.. ఈ కార్యక్రమంలో డాక్టర్ .పెరుమాళ్ళ కృష్ణమూర్తి మాట్లాడుతూ ఇలాంటి మంచి కార్యక్రమాలు సంఘం తరపున నిర్వహించటం ఎంతో గర్వకారణమని, ఇంకా ఇలాంటి నిరుపేద కుటుంబాలకు సంఘం అండగా నిలిచి ఎన్నో మంచి సామాజిక సేవ కార్యక్రమాలు చేయాలని ఆయన సూచించారు. ఆర్యవైశ్య పెద్దలందరూ ఇటువంటి మంచి కార్యక్రమాలకు ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తామని ఆయన పేర్కొన్నారు..ఈ కార్యక్రమంలో కొణతాలపల్లి సుబ్బారావు , శ్రీ కోదండ దేవాలయం మాజీ చైర్మన్ మిట్టపల్లి సత్యం బాబు, మిట్టపల్లి నాగి, దొడ్డా సుధాకర్, నూకల ప్రసాద్, నూకల వాసు ,గజ్జల కృష్ణమూర్తి మిట్టపల్లి వినోద్ కుమార్ , కొదుమూరు రవి ,వజినేపల్లి చక్రధర్, రాయపుడి వెంకటేష్, కొల్లా



రాంబాబు, కొణతం రాజారావు, మొరిశెట్టి జనార్ధన్, యంద్రపుడి శివ శంకర్ , దారా కృష్ణ వజినేపల్లి రవి , కొణతాలపల్లి నగేష్ , గజ్జల భాస్కర్ , నంబూరి ప్రసాద్ , జెల్లా అవినాష్, పెనుగొండ రామారావు, సముద్రాల మురళీకృష్ణ వేముల కిషోర్ పాల్గొన్నారు..

# జనరల్ మజ్దూర్లుగా రెగ్యూలరైజ్ చేయాలి

## - సింగరేణికి సీఐటీయూ డిమాండ్

**యైటింక్లయిన్ కాలనీ. (క్రైమ్ న్యూస్):** బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్ గా రెగ్యూలరైజ్ చేస్తామని ఇచ్చిన మాటను సింగరేణి యాజమాన్యం మరిచిందని, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నరసింహారావు అన్నారు. శనివారం స్థానిక యూనియన్ కార్యాలయంలో జరిగిన యూనియన్ ముఖ్య కార్యకర్తలు సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. 190/ 240 మస్టర్లు నిండిన అండర్ గ్రౌండ్ / సర్ఫేలో పనిచేస్తున్న బదిలీ వర్కర్లను, జనరల్ మజ్దూర్లు గా రెగ్యూలరైజ్ చేస్తామని సింగరేణి యాజమాన్యం ప్రకటించిన ప్రకటన ఇప్పటివరకు ఆచరణకు నోచుకోలేదని ఆరోపించారు. ఇక యాజమాన్యం ప్రకటించినప్పుడు ఆనందపడిన బదిలీ వర్కర్లు నేడు మనోవేదనకు గురవుతున్నారన్నారు. అలాగే యాక్టింగ్ పై ఇచ్చే ప్రమోషన్లను కూడా ఇవ్వకుండా, రాజకీయ ప్రాబల్యంతో గత కొద్ది సంవత్సరాలుగా, యాక్టింగ్ చేస్తున్న కార్మికులకు ప్రమోషన్ ఇవ్వకుండా, రాజకీయ పలుకుబడి ఉన్నవారికి ఇస్తూ, యాక్టింగ్ చేస్తున్న కార్మికులను ఆర్థిక, మానసికంగా నష్టం చేస్తుందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ఈ విషయంలో సింగరేణి యాజమాన్యం వెంటనే సానుకూలంగా స్పందించి, కార్మికులకు రావాల్సిన పదోన్నతులు న్యాయబద్ధంగా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇక మరోవైపు సర్కులర్లు చేత పట్టుకుని వేదికలపై ఫోటోలకు పోజులిస్తున్న గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. యాజమాన్యం ఎవరైనా



రాజకీయ నాయకులు చెబితేనే ఆర్డర్లు ఇస్తారా అన్న అనుమానం కార్మికుల్లో కలుగుతుందని, కార్మికుల్లో నమ్మకం పోగొట్టు కోకుండా, భవిష్యత్తులో సైతం కొత్తగా విధుల్లో చేరుతున్న బదిలీ వర్కర్ కార్మికులందరికీ, మస్టర్లు నిండిన వెంటనే ప్రతి సంవత్సరం జనవరిలో రెగ్యులర్ చేసేలా చర్యలు తీసుకోవాలని, అలాగే యాక్టింగ్ పై పనులు చేస్తున్న కార్మికులకు పదోన్నతులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనట్లయితే ఆందోళన, పోరాట కార్యక్రమాలకు పిలుపు నిస్తామని మందా నరసింహారావు హెచ్చరించారు. ఇంకా ఈ సమావేశంలో సీఐటీయు జిల్లా కార్యదర్శి ముత్యంరావు, నాయకులు వినయ్, ప్రవీణ్, ఉల్లి మొగిలి, వెంకన్న, సంతోష్, రామ్ సాగర్, రాంప్రసాద్, సంపత్, నరసింహా, నరహరి, వకిల్ పల్లి పిట్ కమిటీ సభ్యులు, ఓసిపి.త్రీ ఫిట కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అందరికీ అందాలి

**ఉమ్మడి ఖమ్మం జిల్లా. బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** దారిద్ర రేఖకు దిగువన ఉన్న ప్రతి పేద కుటుంబాలకు ఆదివాసి గిరిజన గ్రామాలలోని గిరిజన కుటుంబాలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న సంక్షేమ పథకాలు చేరే విధంగా సంబంధిత శాఖల అధికారులు బాధ్యతగా పనిచేసే అమలయ్యే విధంగా చూడాలని ఖమ్మం ఎంపీ రామసాయం రఘురాంరెడ్డి మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐ డి ఓ సి కార్యాలయంలో శనివారం ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రాం సహాయం రఘురాం రెడ్డి, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ అధ్యక్షతన దిశ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు జనవరి మాసంలో జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ దిశా సమీక్ష సమావేశంలో శాసనసభ్యులు నియోజక వర్గాల వారీగా గ్రామాలలోని వివిధ సమస్యలను మహబూబాబాద్ ఖమ్మం ఎంపీల సమక్షంలో పరిష్కరించిన అంశాలను క్లుప్తంగా తెలియజేశారు. ఈ సందర్భంగా ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ్ సహాయం రఘురామిరెడ్డి, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజల సంక్షేమమే కాకుండా గిరిజన సంక్షేమంపై కూడా ప్రత్యేక దృష్టి సారించామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఏడాది కొత్త కొత్త పథకాలను ప్రవేశపెట్టడంతో పాటు బడ్జెట్ లో ఎక్కువ మొత్తం నిధులు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వాలు ఎంత కష్టపడి పని చేసిన నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంటుందని అన్నారు. పేదరిక నిర్మూలన నిరక్షరాస్యత బాల్య వివాహాలు బాలల హక్కులు బాల కార్మిక వ్యవస్థలపై మరింత కట్టుదిట్టమైన పర్యవేక్షణ అవసరం ఉన్నదని పేర్కొన్నారు. ముఖ్యంగా నియోజకవర్గాలలోని మారుమూల ప్రాంతాలలో కరెంటు సమస్య మంచినీటి సమస్య రోడ్ల సమస్య లేకుండా చూడాలని, అలాగే జిల్లా పరిషత్ పాఠశాలలు, గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలు, అంగన్వాడి సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మాతా శిశు కేంద్రాలలో అన్ని రకాల వసతి సౌకర్యాలు తప్పనిసరిగా ఉండాలని, జిల్లా కలెక్టర్ తో పాటు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి తప్పనిసరిగా వారి పరిధిలోని అన్ని సెంటర్లను తనిఖీ చేస్తూ ఉండాలని ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకొని రావాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి విడుదలయ్యే నిధులు నియోజకవర్గాల వారీగా సక్రమంగా వినియోగించడానికి జిల్లా కలెక్టర్ ఐటీడీఏ పీవో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని శాసనసభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి నియోజకవర్గాలలో నెలకొన్న వివిధ సమస్యలను గుర్తించి నిధులు కేటాయించి వెంటనే పనులు ప్రారంభించాలని అన్నారు. ముఖ్యంగా విద్య వైద్యం విద్యుత్ పబ్లిక్ హెల్త్ నేషనల్ హైవే రోడ్స్ కు సంబంధించిన శాఖలు ప్రత్యేక శ్రద్ధ చూపించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులు ప్రారంభించి సమస్యలు పరిష్కరించాలని అన్నారు. వచ్చే సమావేశానికి గౌరవ శాసనసభ్యులు నియోజకవర్గం వారిగా లేవనెత్తిన వివిధ అంశాల యొక్క సమస్యలను సంబంధిత అధికారులు సమస్యలు పరిష్కరించి పూర్తిస్థాయి అందజేయాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఐటిడిఏ పిఓ రాహుల్ అదనపు కలెక్టర్ వేణుగోపాల్,ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు,పాయం వెంకటేశ్వర్లు, మాలోతి రామదాస్, జారే ఆదినారాయణ,దిశ కమిటీ సభ్యులు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# జిల్లా పరిషత్ పాఠశాలలో మాక్ పోలింగ్



**జమ్మికుంట అక్టోబర్ 19 (ది క్రైమ్ న్యూస్):** జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మాక్ పోలింగ్ నిర్వహించారు. ప్రజాస్వామ్యము- ఎన్నికలు- అవగాహన నిమిత్తము విద్యార్థులకు మాదిరి ఎన్నికలు నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా ఎన్నికల నిర్వహణ -విద్యార్థుల భాగస్వామ్యం విలువలు, నైతికత, నవ సమాజ నిర్మాణంలో ఓటరు బాధ్యత ప్రత్యక్ష అనుభూతి చెందిన ఎన్నికల సిబ్బందిగా వ్యవహరించిన విద్యార్థులు అనుభూతి పొందినారు. వాస్తవంగా ప్రజలచే ఎన్నుకోబడే నాయకుడు ఎన్నికల్లో ఎన్నో అనుచిత ప్రవర్తనలు ,(డబ్బు మద్యం వస్తువులు) పంపిణీ జరుగుతుంది. దానికి భిన్నంగా పాఠశాలలో పాల్గొన్న ఓటర్లు- జాతి, కుల, మత, లింగ, వివక్ష లేకుండా తనకు నచ్చిన నాయకుని ఎంపిక విషయంలో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు వేశారు. కాళోజి చెప్పినట్లు ఏ పార్టీ వాడొ కాదు ఏ పాటి వాడో చూసి నాయకున్ని ఎన్నుకోమన్నట్లు చాలా చక్కగా పాల్గొన్నారు. ఇలాంటి మాక్ ఎలక్షన్స్ నిర్వహణ ద్వారా విద్యార్థులకు చిన్నతనంలోనే ఎన్నిక విధానము- నాయకత్వ లక్షణాలు నిస్వార్థ సేవ అందించాలనే భావన నెలకొంటుందని దీనిని నిర్వహించిన పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పుల్లూరి చంద్రశేఖర్, వెంకటరెడ్డి ని ప్రధానోపాధ్యాయులు ఆకుల సదానందం అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సదానందము, సంతోష్, రవీందర్ రెడ్డి, స్రవంతి, యేసుమని, శ్రీనివాస్, స్వామి, లక్ష్మి, వనజ, సమ్మయ్య, సంపత్, జ్యోతి, శైలజ, పద్మ, ప్రభాకర్, ప్రేమలత, శ్రీనివాసరావు, త్రివేణి, వరదరాజులు, తిరుమల, మీనాక్షి ఎల్లయ్య , శైలజ, స్వరూప మొదలగువారు పాల్గొన్నారు.

# యూనియన్ నాయకుల సమక్షంలో డెత్ రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ




**రామగిరి, (ది క్రైమ్ న్యూస్):** సింగరేణి కార్మికుల నుండి వసూలు చేసిన సింగరేణి కాంట్రిబ్యూషన్ఏమోంట్ ఇటీవల చనిపోయిన కార్మిక కుటుంబాలకు యూనియన్ నాయకుల సమక్షంలో డెత్ రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ మనిషికి లక్షరూపాయలు చొప్పున మూడు కుటుంబాలకు అందజేయడం జరిగింది. అందులో అప్పాల సదానందం డ్రిల్ ఆపరేటర్, పెరుమాండ్ల కార్తీక్ జనరల్ మజ్దూర్, సిహెచ్ రవీందర్ రెడ్డి క్లర్క్ ల కుటుంబాలకు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ ఫిట్ సెక్రెటరీ రామిండ్ల మనోహర్, ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ, వెంకటస్వామి, అసిస్టెంట్ మేనేజర్, సంపత్ కుమార్, డివై జీఎం కోల శ్రీనివాస్, సేఫ్టీ ఆఫీసర్, ఆసిఫ్, వెల్ఫేర్ ఆఫీసర్, మురళి, సీనియర్ అసిస్టెంట్ షరీఫ్,రాజేంద్ర ఠాగూర్, బాధిత కుటుంబాలు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్‌గా గెలిపిస్తే 5 సంవత్సరాలు ఇంటి పన్ను, నల్ల పన్ను ఫ్రీ

**- అయిదు సంవత్సరాలు - ఐదు హామీలు**

**- పేరిట మేనిఫెస్టో విడుదల చేసిన సర్పంచ్ అభ్యర్థి**



**కమలాపూర్ (ది క్రైమ్ న్యూస్):** గ్రామస్థాయిలో మేనిఫెస్టో తో సర్పంచ్ గా పోటీ ప్రజలకు అయిదు సంవత్సరాలు - ఐదు హామీలు అంటూ .... గెలిచిన తర్వాత తప్పకుండా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తీరుస్తానని ఒక సర్పంచ్ అభ్యర్థి వినూత్న ప్రచారానికి తెరలేపారు. వివరాల్లోకి వెళ్తే కమలాపూర్ మండలం ఉప్పల్పల్లి గ్రామానికి చెందిన ర్యాకం శ్రీనివాస్ రాబోయే సర్పంచ్ ఎలక్షన్లలో పోటీ చేస్తానని, ఐదు సంవత్సరాలలో ఐదు గ్యారెంటీలు పేరుతో మేనిఫెస్టో విడుదల చేయడం చర్చనీయాంశమైంది. మేనిఫెస్టోలో ఉప్పల్ పల్లి గ్రామస్తులకు ఐదు సంవత్సరాలు ఇంటి పన్ను నల్ల పన్ను ఫ్రీ గా ఇస్తానని, గ్రామంలో ఆడబిడ్డ పుడితే 5116/- డిపాజిట్ కానుక, మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు, గ్రామంలో మూతపడ్డ బడిని తెరిపించటం,నెలకు ఒక సారి హెల్త్ క్యాంప్లు ఫ్రీగా వైద్యం, అర్హులైన లబ్దిదారులకు ప్రభుత్వం నుండి వచ్చే పెన్షన్లు, పక్కా ఇల్లు, లోన్లు మరియు ఇతరత్రా పథకాలు రాజకీయాలకు అతీతంగా ఎలాంటి పక్షపాతం లేకుండా అందిస్తానని పేర్కొన్నారు. ఇంకా సర్పంచ్ ఎలక్షన్ల మీద స్పష్టత రాకముందే, రిజర్వేషన్లు ఖరారు కాకముందే గ్రామాల్లో ఎలక్షన్లలో పోటీ పెరుగుతుంది. సర్పంచ్ పోటీకి మేనిఫెస్టో విడుదల చేయడం చాల విడ్డూరంగా ఉందని గ్రామస్తులు చర్చించు కుంటున్నారు. గ్రామ సమస్యలను తీరుస్తానని మేనిఫెస్టో విడుదల చేయడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రజలను నమ్మించి మోసం చేసిన సిఎం రేవంత్ రెడ్డి

## - ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఉన్న నీటిని గోదారిలోకి విడుదల చెయ్యాలి

## - మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, రామగుండం మాజీ శాసనసభ్యులు పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్







**గోదావరిఖని (ది క్రైమ్ న్యూస్):** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామిలు అమలు చేయకుండా ప్రజలను, రైతులను సిఎం రేవంత్ రెడ్డి మ్మెసం చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మోసం చేసారని, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, రామగుండం మాజీ శాసనసభ్యులు పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ విమర్శించారు. జనగామ గ్రామంలో రైతుల సమస్యలు పరిష్కారం కోసం జనగామ గ్రామ శివారులోని గోదావరి నది ఇసుకలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలసి వారు వంట వార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులతో మాట్లాడి వారితో భోజనం చేసారు. అనంతరం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, రామగుండం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ లు మాట్లాడుతూ అబద్దపు హామీలను ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను, ప్రజలను, అన్ని వర్గాల వారిని ఇబ్బందులకు గురి చేస్తుందని అన్నారు. ఇటీవలి కాలంలో గోదావరి నది పూర్తి స్థాయిలో ఎడారిగా మారడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని తెలిపారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఉన్న నీటిని విడుదల చేయకపోవడంతో గోదావరి నదిలోకి నీరు రావడం లేదని వెంటనే ఎల్లంపల్లి నుండి నీటిని విడుదల చేయ?లన్నారు. గతంలో గోదావరిలో నీరు ఉన్న సమయంలో రైతులు మోటార్ల ద్వారా నీటిని తీసుకునే వారని స్పష్టం చేసారు. పొలాలు కోతకు వచ్చిన సమయంలో గోదావరిలో చుక్క నీరు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ ప్రభుత్వం ప్రాజెక్టుల రిపేరు పేరుతో నీటిని వదలకుండా బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పైనా తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో గోదావరి నది నిండు కుండల ఉన్నాయని, కానీ ప్రస్తుత ప్రభుత్వంలో గోదావరి నదిలు ఎడారిగా మారుతున్నాయని విమర్శించారు. ఇప్పటికే హైడ్రా పేరుతో ఎంతో మంది పేద ప్రజలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోడ్డున పడేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి వైఖరి వాళ్ళ అన్ని వర్గాల ప్రజలు గోస పడుతున్నారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఎవరు అడగని పనులను చేస్తూ దుర్మార్గమైన పాలనా సాగిస్తున్నారని విమర్శించారు. ఎంత సేపు కేసీఆర్ ను బదనాం చేసే విధంగా మాట్లాడటం తప్ప ప్రజా సమస్యలపై మాట్లాడటం లేదాని తెలిపారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు కార్పోరేటర్లు జనగామ కవిత సరోజిని శ్రీనివాస్ కల్వచర్ల కృష్ణ వేణీ భూమయ్య నాయకులు గోపు అయులయ్య యాదవ్ అచ్చే వేణు తోకల రమేష్ నూతి తిరుపతి బొడ్డు రవీందర్ తోట వేణు ఆడప శ్రీనివాస్ పిల్లి రమేష్ సదానందం సట్టు శ్రీనివాస్ పొలాడి శ్రీనివాస్ రావు యాసర్ల తిమ్మెతి వెంకన్న కొడి రామకృష్ణ అల్లం అయులయ్య తదితరులు పాల్గొన్నారు.

# రెచ్చగొట్టే వారి ఉచ్చులో పడకండి

- నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్న విపక్షాలు
- వారి హయాంలో ఉద్యోగాలు ఇవ్వలేదు
- ఇప్పుడేమో ఆందోళనతో అడ్డం పడుతున్నారు
- గ్రూప్-1 పరీక్షలు యధాతథంగా సాగతాయి
- మీకు ఉద్యోగాలు కల్పించాలన్నదే మా లక్ష్యం
- సిఎం రేవంత్ రెడ్డి మరోమారు స్పష్టీకరణ



**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** బీఆర్ఎస్ అధికారంలో ఉన్న 10 ఏళ్లపాటు ఉద్యోగాలు భర్తీ చేయకుండా కాలయాపన చేసిందని సీఎం రేవంత్ మండిపడ్డారు. ఇప్పుడేమో పోటీ పరీక్షలను వాయిదా వేయాలని అంటోందని అన్నారు. పోలీసు డ్యూటీ మీట్ ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ఈ నెల 21 నుంచి యథాతథంగా జరుగుతాయని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'పరీక్షలకు సిద్ధం కండి. 95శాతం మంది అభ్యర్థులు హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకున్నారు. మరో 5శాతం మంది డౌన్లోడ్ చేసుకోండి. ప్రతిపక్షాల మాయమాటలను నమ్మకండి. వారు చేయరు..ఇప్పుడున్న ప్రభుత్వం చేయకుండా చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టలేదు. మేం వచ్చాకే వేల ఉద్యోగాలు కల్పిస్తున్నాం' రేవంత్ పేర్కొన్నారు. 'తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేశాం. పదేళ్లుగా వాయిదాలు పడుతున్న అన్ని ఉద్యోగాలను భర్తీ చేశాం. 15 వేల మంది పోలీస్ సిబ్బందిని కొత్తగా నియమించాం.1,637 ఇంజినీరింగ్ పోస్టులు, 65 రోజుల్లోనే 11,067 ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేశాం. నిరుద్యోగుల భావోద్వేగాలను రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందాలని కొందరు చూస్తున్నారని, వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. 564 గ్రూప్ వన్ పోస్టుల నియామకాల కోసం మెయిన్స్ పరీక్షను సోమవారం నిర్వహించబోతున్నం. ప్రతిపక్షాల ఉద్యోగాలు పోయాయి. వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చాయి. గతంలో ఉన్న జీఓ 55 రద్దుచేసి గ్రూప్ వన్ నోటిఫికేషన్ ఇచ్చాం. అదే సమయంలోనే జీఓ 29 తెచ్చాం. ఈ జీవో ద్వారా రిజర్వేషన్లు ఖాళీల భర్తీ విషయంలో ఒక పోస్టు ఖాళీగా ఉన్న 1:50 పిలవాలని నిర్ణయించాం. 31 వేల మందికి పైగా మెయిన్స్‌కు అర్హత సాధించారు. ఇప్పుడు 1:100 లెక్కన పిలవాలి అని ఆందోళన చేస్తున్నారు. నోటిఫికేషన్‌లో ఇచ్చిన నిబంధనలను మధ్యలో మారిస్తే కోర్టులు ఊరుకుంటాయా అని ప్రశ్నించారు. నోటిఫికేషన్ ఇచ్చే సమయంలోనే 1:100 కోరుకుని ఉంటే మీ ఆలోచనకు తగ్గట్టే ఇచ్చేవాళ్లం అన్నారు. నోటిఫికేషన్లు రద్దయి, యువత రోడ్డుమీద పడితే ఆలోచించే వారిని దూరం పెట్టాలని అన్నారు. రిజర్వేషన్ ప్రకారమే సెలెక్ట్ చేస్తే వేలమంది ఎస్సీ, ఎస్టీలకు అవకాశం వచ్చింది. రిజర్వేషన్లు పకడ్బందీగా అమలు చేస్తుంటే కొంతమంది గందరగోళం సృష్టిస్తూ ఉన్నారు. 10 ఏళ్లు అధికారంలో ఉన్నప్పుడు కనీసం మీకు అపాయింట్మెంట్ అయినా ఇచ్చారా..? ప్రజా యుద్ధనౌక గద్దర్ సమస్యలు చెప్పుకోవడానికి వెళ్తే నాలుగు గంటలపాటు ఎండలో నిల్చోబెట్టిన నీచమైన చరిత్ర వాళ్లది. గ్రూప్ 1 హాల్ టికెట్లు 95 శాతం మంది తీసుకున్నారు.. ఇంకా తీసుకొని వారు హాల్ టికెట్లు తీసుకొని పరీక్షకు సన్నద్ధంకండని సిఎం సూచించారు. న్యాయస్థానాలు కూడా ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షల విధానాన్ని సమర్థించాయి. మీ భావోద్వేగాలతో బీఆర్ఎస్ ఆడుకుంటోంది. వారి ఉచ్చులో పడకండి. ప్రభుత్వం మీ సమస్యలను పరిష్కరించడానికి సిద్ధంగా ఉంది. అన్నగా నేను పరీక్షలు నిర్వహిస్తుంటే, వద్దు అని ఆందోళన చేస్తున్నారు ఆలోచించండి. మీకు అవకాశాలు ఇవ్వడం కోసమే పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఆందోళనలను విరమించి అపోహలకు దూరం కండి. నిరుద్యోగులు ఆందోళన చేస్తున్నప్పుడు ఉదారంగా వ్యవహరించండి. నిరుద్యోగులపై కేసులు పెట్టాల్సిన అవసరం లేదు.. పొరపాటున కేసులు పెడితే ఉద్యోగాలు సాధించడంలో ప్రతిబంధకంగా మారుతాయి. నిరుద్యోగులు ఆందోళన చేస్తున్న క్రమంలో కేసులు పెట్టవద్దని పోలీసులను ఆదేశిస్తున్నానని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

# నగరం దక్షిణాన గోల్ఫ్ సిటీ ఏర్పాటు

## - పది వేల మందికి ఉపాధి

## - ఐటి మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు



**రామగిరి(ది క్రైమ్ న్యూస్):** ప్రొఫెషనల్ గోల్ఫర్స్ అసోసియేషన్ ఆఫ్ అమెరికా(పిజిఏ), స్థానిక భాగస్వామి స్టోన్ క్రాఫ్ట్ తో కలిసి సిటీ దక్షిణాన విస్తారమైన గోల్ఫ్ సిటీని నిర్మించేందుకు ముందుకు వచ్చిందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. అమెరికా టెక్సస్ రాష్ట్రంలోని ఫ్రిస్కో ప్రధాన కేంద్రంగా ఉన్న పిజిఏ ప్రతినిధి బృందం శనివారం నాడు ఆయనతో సెక్రటేరియట్ లో బేటీ అయింది. తెలంగాణా ప్రభుత్వం తమకు సహకరిస్తే గోల్ఫ్ కోర్టులు, నివాస సముదాయాలు, హొటళ్లు, వినోద పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి పిజిఏ, స్టోన్ క్రాఫ్ట్ సంస్థలు సంసిద్ధత వ్యక్తం చేశాయని శ్రీధర్ బాబు వెల్లడించారు. పిజిఏ ప్రస్తుతం ముంబయిలో షాపూర్జీ పల్లోంజి సంస్థతో కలిసి గోల్ఫ్ సిటీ నిర్మాణం చేపడుతోందని ఆయన తెలిపారు. ఇక్కడ స్టోన్ క్రాఫ్ట్ భాగస్వామ్యంతో భారీ పెట్టుబడులు పెట్టడానికి అంగీకరించిందని వివరించారు. గోల్ఫ్ సిటీ నిర్మాణం పూర్తయితే వచ్చే పదేళ్లలో పదివేల మందికి ఉపాధి దొరుకుతుందని శ్రీధర్ బాబు తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి మానస పుత్రిక ఫోర్త్ సిటీలో ఎటువంటి కాలుష్యం వెలువడని నెట్-జీరో సిటీని నిర్మిస్తుందని పేర్కొన్నారు. నిర్మాణాలకు మూడింతలు ప్రకృతి వనాలను పెంచడం ద్వారా ఆహ్లాదకర నివాస ప్రదేశాన్ని ఏర్పాటు చేస్తామని ఈ సంస్థలు తమ ప్రెజెంటేషన్ లో వెల్లడించినట్టు శ్రీధర్ బాబు చెప్పారు. పిజిఏ కన్సార్టియం దాదాపు 200 ఎకరాల్లో '18 హెూల్' ప్రామాణిక గోల్ఫ్ కోర్సును ఏర్పాటు చేస్తుంది. ఇది వినియోగంలోకి వస్తే దక్షిణ భారత దేశంలోనే మొట్ట మొదటిది అవుతుందని శ్రీధర్ బాబు వెల్లడించారు. మియావాకి పద్ధతిలో అడవిని పెంచడం ద్వారా సహజ సిద్ధమైన డెక్కన్ శిలలకు, స్థానిక నీటి వనరులకు ఒక అలంకార ప్రాయమవుతుందని వివరించారు. పిజిఏ ప్రపంచంలోని అతిపెద్ద క్రీడా సంస్థలలో ఒకటి. 30,000 మందికి పైగా గోల్ఫ్ నిపుణులతో కూడిన ఈ సంస్థ గోల్ఫ్ అభివృద్ధికి వందేళ్లుగా కృషి చేస్తోంది. పిజిఏ పలు చాంపియన్‌షిప్‌లు, రైడర్ కప్ వంటి టోర్నీలను నిర్వహిస్తోంది. భేటీలో స్టోన్ క్రాఫ్ట్ సిఇఓ కీర్తి చిలుకూరి, అలోక్ తివారి, పిజిఏ ప్రతినిధులు టిమ్ లాబ్, అలెక్స్ హే, డేవిడ్ బ్లమ్, కెన్ సాగర్, రాధా కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణపై ఉపసంఘం చర్చ

## వాటర్ బాటిళ్లు, నోట్‌బుక్స్‌పై జిఎస్టీ తగ్గింపునకు సుముఖం

## సీనియర్ సిటీజన్ల బీమా పాలసీలపై జిఎస్టీ మినహాయింపుపై చర్చ

**న్యూఢిల్లీ,అక్టోబర్ 19(ది క్రైమ్ న్యూస్):** జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణపై ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం కొన్ని వస్తువులపై జీఎస్టీ తగ్గించాలని నిర్ణయించింది. 20 లీటర్ల ప్యాకేజ్డ్ వాటర్ బాటిల్, సైకిళ్లు, ఎక్సర్‌సైజ్ నోట్‌బుక్స్ వంటి వస్తువులు ఈ జాబితాలో ఉన్నాయి. అదే సమయంలో ఖరీదైన షూస్, చేతి వాచీలపై పన్ను పెంచాలని ప్రతిపాదించనుంది. బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి నేతృత్వంలో జరిగిన మంత్రివర్గ ఉప సంఘం భేటీలో దీనిపై చర్చ జరిగింది. దీనివల్ల రూ.22వేల కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూరనుంది. ప్రస్తుతం 20 లీటర్ల ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ బాటిల్‌పై 18 శాతం జీఎస్టీని వసూలు చేస్తున్నారు. దీన్ని 5 శాతానికి తగ్గించాలని మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయించింది. అలాగే రూ.10 వేల్లోపు ధర కలిగిన సైకిళ్లపై 12 శాతం 5 శాతానికి తగ్గించేందుకు ఈ సమావేశంలో నిర్ణయించారు. నోట్ బుక్స్‌పైనా జీఎస్టీని 12 నుంచి ఐదు శాతానికి తగ్గించాలని మంత్రివర్గ ఉప సంఘం ప్రతిపాదించింది. ఈ నిర్ణయాలను జీఎస్టీ కౌన్సిల్ ఆమోదిస్తే ఆ మేర ఊరట కలగనుంది.అలాగే, రూ.15 వేలు కంటే అధిక విలువ కలిగిన షూస్, రూ.25వేల కంటే ఎక్కువ ధర ఉన్న చేతి వాచ్‌లపై జీఎస్టీని 18 నుంచి 28 శాతానికి పెంచాలని ఉప సంఘం ప్రతిపాదించింది. మొత్తం ఈ భేటీలో 100 వస్తువులకు సంబంధించి జీఎస్టీ రేట్లను చర్చించారు. 12 శాతం పన్ను పరిధిలో ఉన్న చాలా వస్తువులపై జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని ప్రతిపాదించారు. దీంతో పాటు 18 శాతం శ్లాబులో ఉన్న హెయిర్ డ్రైయర్లు, హెయిర్ కర్లర్లు, బ్యూటీ, మేకప్ సామగ్రిపై ఉన్న జీఎస్టీని మళ్లీ 28 శాతం శ్లాబులోకి చేర్చాలని మంత్రివర్గ ఉప సంఘం ప్రతిపాదించింది. ప్రస్తుతం జీఎస్టీలో 5, 12, 18, 28 శాతం చొప్పున నాలుగు పన్ను శ్లాబులు ఉన్నాయి. అవసరమైన వస్తువులను తక్కువ శ్లాబులో, లగ్జరీ వస్తువులను ఎక్కువ శ్లాబులో ఉన్నాయి. కొన్ని వస్తువులకు 28 శాతం జీఎస్టీతో పాటు అదనంగా సెస్సు కూడా విధిస్తున్నారు. వివిధ రకాల వస్తువులపై విధిస్తున్న సగటు జీఎస్టీ రేటు 15.3 శాతం దిగువకు చేరిన వేళ.. జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరించాలని నిర్ణయించారు. ఇదిలావుంటే పూర్తి స్థాయిలో బీమా కవరేజీ అందించే టర్మ్ పాలసీలతో పాటు, సీనియర్ సిటిజన్ల కోసం తీసుకునే ఆరోగ్య బీమా పాలసీలకు వస్తు, సేవల పన్ను నుంచి ఊరట లభించే అవకాశం ఉంది. సాధారణ పౌరులకు నిర్దేశిత పరిమితి వరకు మినహాయింపు ఇచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఆరోగ్య, సాధారణ బీమా ప్రీమియంలపై జీఎస్టీ విధించే అంశంపై మంత్రివర్గ ఉపసంఘం శనివారం భేటీ అయ్యింది. ఈ సందర్భంగా టర్మ్, ఆరోగ్య బీమా పాలసీలను మినహాయించాలన్న చర్చ జరిగింది. దీనిపై జీఎస్టీ కౌన్సిల్ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. టర్మ్ ఇన్సూరెన్స్‌తో పాటు రూ.5 లక్షల వరకు తీసుకునే ఆరోగ్య బీమాపై జీఎస్టీ నుంచి మినహాయించాలని సమావేశంలో నిర్ణయించారు. రూ.5 లక్షల కవరేజీ దాటితే 18 శాతం జీఎస్టీ విధించనున్నారు. సీనియర్ సిటిజన్లకు మాత్రం కవరేజీతో సంబంధం లేకుండా.. జీఎస్టీ నుంచి మినహాయించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ విషయంలో మంత్రివర్గ సహచరుల నుంచి ఏకాభిప్రాయం వ్యక్తమైందని బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరి తెలిపారు. బీమా ప్రీమియంలపై జీఎస్టీ తొలగించాలన్న డిమాండ్ల వేళ గత నెల జీఎస్టీ కౌన్సిల్ సమావేశమైంది. ఈ అంశంపై మరింత లోతుగా చర్చించేందుకు 13 మంది సభ్యులతో మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేశారు. సామ్రాట్ చౌదరిని కన్వీనర్‌గా నియమించారు. ఇందులో ఏపీ, తెలంగాణతో పాటు ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, కేరళ, గుజరాత్ తదితర రాష్ట్రాల మంత్రులు సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ ఈ నెలాఖరుకు కౌన్సిల్‌కు నివేదిక సమర్పించాల్సి ఉంటుంది.

# దోమ పిల్లలు లాంటి చేప పిల్లలు పంపిణీ

## - చేప పిల్లల వ్యాన్‌ను వాపస్ పంపిన మత్స్యకారులు - కాంట్రాక్టు వ్యవస్థ రద్దు చేయాలి - మంథని ఇలాఖాలో మత్స్యకారులకు అన్యాయం జరిగితే సహించబోనని మంత్రి శ్రీధర్ బాబు హెచ్చరించినప్పటికీ గుత్తేదారు నిర్లక్ష్యం - మంథని మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు పోతరవేని క్రాంతి కుమార్





**రామగిరి(ది క్రైమ్ న్యూస్):** ఉచిత చేప పిల్లలు పంపిణీ చేయడానికి వచ్చిన డిసిఎం వ్యాన్ ను మత్స్యకారులంతా కలిసి చేప పిల్లల సైజు చూసి చిన్న పిల్లలు ఉండటంతో వాపస్ పంపించారు. ఈ సందర్భంగా మంథని మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు పోతరవేని క్రాంతి కుమార్ మాట్లాడుతూ అసలు కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలని జూన్ జూలైలో రావలసిన చేప పిల్లలు అక్టోబర్ నెల అందించడం చాలా సిగ్గుచేటు అన్నారు దీనికి తోడుగా కాంట్రాక్టర్లు అలుసుగా తీసుకొని చిన్న పిల్లలు తీసుకువచ్చి మత్స్యకారులకు జీవనోపాధిని కోల్పోయేలా చేస్తున్నారని అన్నారు. ఉచిత చేపలని చెప్పి దోమ లాంటి చేప పిల్లల్ని తీసుకువచ్చి మత్స్యకారులకు పెద్ద ఎత్తున కాంట్రాక్టర్లు మోసం చేస్తూ మత్స్యకారులకు జీవనోపాధిని కోల్పోయేలా చేస్తున్నారని, ప్రభుత్వ నిర్ణయించిన పిల్లల సైజు 35-40 ఎం ఎం పొడవు ఉండాల్సిన పిల్లలు 20 ఎం ఎం కూడా ఉండట్లేదని అలాగే సైజులో మోసం కొలతలలో మోసం చేస్తూ కాంట్రాక్టర్లు మత్స్యకారులను పెద్ద ఎత్తున మోసం చేస్తున్నారని అన్నారు.గత కొన్ని రోజుల క్రితం మంథని నియోజకవర్గంలో తమ్మచెరువు దగ్గర చేపల పంపిణీ జరిగిన కార్యక్రమంలో మత్స్యశాఖకు సంబంధించిన పలువురు హాజరై కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగించాలని అభ్యర్థించి గుత్తేదారుకు, రాష్ట్ర చైర్మన్ కు పెద్దపల్లి జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో పలు రకాల సూచనలు ఇవ్వడం జరిగింది.. ఈవిషయం రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి కూడా తీసుకువెళ్లగా వారు సానుకూలంగా స్పందించి ఎట్టి పరిస్థితుల్లో మత్స్యకారులకు ఎటువంటి అన్యాయం జరగకుండా చూస్తానని హామీ ఇవ్వడం కూడా జరిగింది.అయినప్పటికీ ఈరోజు గుత్తేదారు ఏవైతే చేప పిల్లల పంపిణీ చేయదలచి పంపించిన చేప పిల్లల సైజులో గాని క్వాలిటీలో కానీ వచ్చిన వైఫల్యాలను ఎండగడుతూ మత్స్యకారులు ప్రశ్నించగా ఈ విషయం పైన అధికారులు సదరు గుత్తేదారు ద్వారా వచ్చి సమాధానం చెప్పాలని ప్రశ్నించినప్పటికి వారిలో ఎలాంటి చలనం లేనందున ఇటువంటి నాసిరకం చేప పిల్లలను సీడ్ గా ఇవ్వడం ద్వారా మత్స్యకారులకు జరిగే అన్యాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని రాష్ట్ర పారిశ్రామిక, ఐటి, శాసనసభ వ్యవహారాల మంత్రి వర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఎటువంటి భయం లేకుండా నిర్లజ్జగా నిర్లక్ష్యంగా ఇటువంటి చాప పిల్లలను తీసుకొని వచ్చిన చేప పిల్లల వ్యాన్ ను వెనక్కి పంపడం జరిగింది.సదరు గుత్తేదారుపై త్వరలో మత్స్య శాఖ ఆధ్వర్యంలో మంత్రివర్యులు శ్రీధర్ బాబు ని కలిసి ఫిర్యాదు చేస్తూ మాకు న్యాయం జరిగే రకంగా పోరాడుతామని పెద్దపల్లి జిల్లా డైరెక్టర్ మత్స్యపారిశ్రామిక సహకార సంఘం,మంథని మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు పోతరవేని క్రాంతి కుమార్ తెలియజేశారు.

# థైరాయిడ్ సమస్యలతో బాధపడుతున్నారా.. ? రోజు ఇలాంటివి తీసుకుంటే మేలు జరుగుతుంది..!

ఈ రోజుల్లో, థైరాయిడ్ సమస్యలు మహిళల్లో చాలా సాధారణం అవుతున్నాయి. ఇది తీవ్రమైన జీవనశైలి వ్యాధి, ఇది చాలా కాలంగా సరైన ఆహారం మరియు నిశ్చల జీవనశైలిని అనుసరించడం వల్ల మహిళల్లో కనిపిస్తుంది. నిజానికి, థైరాయిడ్ అనేది మన మెడపై ఉన్న ఒక చిన్న గ్రంథి, దీని ఆకారం సీతాకోకచిలుకలా ఉంటుంది. కొన్ని ముఖ్యమైన హార్మోన్ల ఉత్పత్తిలో ఈ గ్రంథి చాలా కీలక పాత్ర పోషిస్తుంది. థైరాయిడ్ గ్రంథి సరిగ్గా పని చేయనప్పుడు, అది తగినంత హార్మోన్లను విడుదల చేయదు. దీని వలన జీవక్రియ మందగిస్తుంది. లేదా వేగవంతం అవుతుంది. శరీరంలోని ఇతర హార్మోన్ల ఉత్పత్తిలో జీవక్రియ చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. థైరాయిడ్ పనితీరు సరిగా లేకపోవడం వల్ల శరీరంలో హార్మోన్ల సమతుల్యత దెబ్బతింటుంది. దీని కారణంగా మహిళలు క్రమం తప్పకుండా పీరియడ్స్, తీవ్రమైన నొప్పి, తిమ్మిరి, వంధ్యత్వం, అనేక ఇతర తీవ్రమైన సమస్యలను ఎదుర్కోవలసి ఉంటుంది. అయితే, ఒక మంచి విషయం ఏమిటంటే ఆహారం, ఆరోగ్యకరమైన జీవనశైలిలో కొన్ని ముఖ్యమైన మార్పులతో మీరు థైరాయిడ్ పనితీరును మెరుగుపరచవచ్చు. థైరాయిడ్‌తో బాధపడే స్త్రీలు వాటిని ఆహారంలో భాగంగా చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.



థైరాయిడ్ గ్రంధి పనితీరును మెరుగుపరచడంలో సహాయపడే కొన్ని ఆహారాలను ఇక్కడ తెలుసుకుందాం.. మజ్జిగ తాగితే మంచిది.. మాంసకృత్తులు, కాల్షియం, విటమిన్ బి, అనేక ముఖ్యమైన పోషకాలతో సమృద్ధిగా ఉన్న మజ్జిగ ప్రేగులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది శక్తివంతమైన ప్రోబయోటిక్. ఇది ప్రేగులలో మంచి బ్యాక్టీరియాను పెంచడంలో సహాయపడుతుంది. దీన్ని తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. థైరాయిడ్ పనితీరు మెరుగుపడుతుంది. అనేక సమస్యలను దూరం చేస్తుంది. బీట్‌రూట్, క్యారెట్ జ్యూస్ తాగండి.. ఈ జ్యూస్‌లో విటమిన్ ఎ, బి, సి, ఐరన్, ఫోలిక్ యాసిడ్‌తో పాటు లైకోపీన్, ఫైటోన్యూట్రియెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటాయి. ఈ జ్యూస్ తాగడం వల్ల థైరాయిడ్ గ్రంధికి అవసరమైన పోషణ అందుతుంది. దాని పనితీరు మెరుగుపడుతుంది. ఆకుపచ్చ కూరగాయల జ్యూస్.. ఆకుకూరల రసంలో పోషకాలు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. వాటిలో చాలా ముఖ్యమైన విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. ఈ జ్యూస్ తాగడం వల్ల శరీరంలోని రక్తహీనత తొలగిపోయి రక్త ప్రసరణ కూడా మెరుగుపడుతుంది. అదనంగా, అవి థైరాయిడ్ పనితీరును మెరుగుపరచడంలో, లక్షణాలను మెరుగుపరచడంలో సహాయపడతాయి. మూలికల టీ.. మిల్క్ టీకి బదులుగా, చమోమిలే టీ, గ్రీన్ టీ, అల్లం టీ, ఫెన్నెల్, జీలకర్ర, ఆకుకూరల వంటి కొన్ని హెర్బల్ టీలు తాగడం థైరాయిడ్ మహిళలకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇవి శరీరంలో హార్మోన్ల సమతుల్యతను మెరుగుపరచడంలో సహాయపడతాయి. అంతేకాకుండా, ఇది ఆరోగ్యానికి అద్భుతమైన ప్రయోజనాలను కూడా అందిస్తుంది. పసుపు పాలు.. ఇది ఆరోగ్యానికి ఆరోగ్యకరమైన, చాలా ప్రయోజనకరమైన పానీయం. ఇది ప్రతిరోజూ పసుపు తాగాలని నిపుణులు చెబుతున్నారు. యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉన్న ఈ పానీయం థైరాయిడ్ గ్రంథి వాపును తగ్గిస్తుంది. దీన్ని తీసుకోవడం వల్ల శరీరంలో హార్మోన్ల సమతుల్యత మెరుగుపడుతుంది.

## గుట్టగా మారిన పొట్టకు ఛూమంత్రం.. సరిగ్గా ఆ సమయంలో తాగారంటే వెన్నలా కరగాల్సిందే..



యాపిల్ సైడర్ వెనిగర్‌లో అనేక ఔషధ గుణాలు ఉన్నాయి. ఇది ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. మీరు దీన్ని నీటిలో కలిపి ప్రతిరోజూ తాగితే, బరువు తగ్గడంతోపాటు అనేక తీవ్రమైన వ్యాధులను నివారించడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా.. ఆరోగ్యానికి కూడా చాలా మేలు చేస్తుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. కొంచెం గోరు వెచ్చని నీటిలో ఆపిల్ సైడర్ వెనిగర్ కలిపి తాగడం వల్ల కలిగే ఐదు ప్రయోజనాలు, ఎప్పుడు తాగితే మంచిది అనే విషయాలను ఇప్పుడు తెలుసుకోండి.. రోగనిరోధక శక్తిని పెంచుతుంది: యాపిల్ వెనిగర్ తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇది యాంటీమైక్రోబయల్ లక్షణాలను కలిగి ఉంది. ఇది ప్రమాదకరమైన బ్యాక్టీరియా నుంచి శరీరాన్ని దూరంగా ఉంచుతుంది. రక్తంలో చక్కెర నియంత్రణలో ఉంటుంది: రీసెర్చ్‌గేట్‌లో ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం.. యాపిల్ సైడర్ వెనిగర్ రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇందులో ఉండే యాంటీ గ్లైసెమిక్ ఎఫెక్ట్, యాంటీ డయాబెటిక్ లక్షణాలు దీనికి కారణం.. జీర్ణక్రియ సమస్యల నుంచి ఉపశమనం: యాపిల్ సైడర్ వెనిగర్ తీసుకోవడం వల్ల జీర్ణక్రియ సులభం అవుతుంది. ఇది అజీర్ణం, గ్యాస్ వంటి కడుపు సమస్యల నుంచి కూడా ఉపశమనం అందిస్తుంది. కొలెస్ట్రాల్ తగ్గిస్తుంది: ఆపిల్ సైడర్ వెనిగర్ చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడం ద్వారా మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడంలో సహాయపడుతుంది. బరువు తగ్గడంలో కూడా మేలు చేస్తుంది: యాపిల్ వెనిగర్ ఊబకాయాన్ని తగ్గించడంలో ప్రయోజనకరంగా పరిగణిస్తారు. హార్వర్డ్ హెల్త్ ప్రకారం, 2009లో 175 మందిపై జరిపిన ఒక అధ్యయనం ప్రకారం, 3 వారాల పాటు 1-2 టీస్పూన్ల వెనిగర్‌ను తీసుకునే వ్యక్తులు 2-4 పౌండ్ల బరువును తగ్గారని కనుగొన్నారు. ఈ సమయంలో తీసుకోవడం వల్ల వేలు జరుగుతుంది.. 1-2 టీస్పూన్ల యాపిల్ వెనిగర్‌ను నీటిలో కలిపి ఉదయం ఖాళీ కడుపుతో తాగడం చాలా ప్రయోజనకరమని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

# అడపాదడపా ఉపవాసం చేస్తున్నారా.? అనారోగ్యాన్ని కొనితెచ్చుకున్నట్టే.. ఇదిగో క్లారిటీ..

ఇంటర్మీటెంట్ ఫాస్టింగ్(అడపాదడపా ఉపవాసం) వల్ల గుండె జబ్బులు వస్తాయని, స్ట్రోక్ వస్తుందని గత నాలుగైదు రోజులుగా ఎన్నో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మనం ఆహారాన్ని తీసుకున్న వెంటనే నోట్లో నుంచే జీర్ణక్రియ అనేది ప్రారంభమవుతుంది. లాలాజలంలో టయలిన్ అనే ఎన్‌జైమ్ ఉంటుంది. మన జీర్ణాశయంలో 4 గంటల పాటు ఉండి అక్కడ జీర్ణాశయంలో ఉండే హైడ్రోక్లోరిక్ యాసిడ్.. కాలేయం నుంచి వచ్చే కాలేయ రసాలు బైల్ యాసిడ్స్, క్లోమం నుంచి వచ్చే ఎన్‌జైమ్‌లు అన్ని కూడా ఈ ఆహారంతో కలుస్తాయి. ఈ ప్రాసెస్ అంతా జరగడానికి జీర్ణాశయం నుంచి మన ఆహారం బయటకు వెళ్లడానికి 6 గంటల సమయం పడుతుంది. జీర్ణాశయం నుంచి ఆహారం కిందకు వెళ్తేనే మరలా మనకు ఆకలి వేసినట్టు అనిపిస్తుంది. కానీ అక్కడే మనం పప్పులో కాలేస్తాం. అసలైన జీర్ణ వ్యవస్థ.. అసలైన ఆహారం జీర్ణం కావడం 6 గంటల తర్వాతే ప్రారంభమవుతుంది. దీనిని ఇంటర్ డైజెస్టివ్ ఫేస్ అని అంటారు. ఈ ఆహారం జీర్ణకోశం నుంచి కిందకు వెళ్లిన తర్వాత దాదాపు 3 మీటర్ల పొడుగున ఉండే చిన్న ప్రేగుల ద్వారా వెళ్తూ ఉంటుంది. అప్పుడు మన ఆహారంలో ఉన్న పదార్థాల్ని గ్లూకోజ్ గానూ ప్రోటీన్ లాగానే విభజించి వాటిని చిన్న ప్రేగులలో ఉన్న విల్లై ద్వారా అబ్సార్బ్ చేసుకొని అవి మరలా బ్లడ్‌లో కలిసి లివర్‌కు వెళ్లి కొంత స్టోర్ అయ్యి మనకు శక్తిని ప్రసాదిస్తాయి. తరువాత మిగిలిన వ్యర్థ పదార్థాలు పెద్ద ప్రేగులోకి వెళ్లి వీలైనంత నీటిని పీల్చుకొని విసర్జన జరుగుతుంది. ఇలా జీర్ణం కావడానికి మొత్తం 24 గంటల సమయం పడుతుంది. మన శరీరానికి కావలసిన శక్తిని ప్రసాదించేది ఇంటర్ డైజెస్టివ్ ఫేస్ అనే 16 గంటల సమయమే.. మనం చాలామంది జీర్ణకోశంలో ఆహారం ఉంటేనే మనకి శక్తి వస్తుంది అని అనుకుంటాం అది తప్పు. మరి ఈ మధ్య కాలంలో ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ చేస్తే హార్ట్ స్ట్రోక్స్ వస్తాయంటూ వైరల్‌గా మారింది. దీన్ని వైద్యులు కొట్టిపారేశారు. చైనాలో ఓ 200 మందికి ఫోన్ చేసి ప్రశ్నలడిగి, అవే ప్రశ్నలు అమెరికాలో ఉండే 200 మందికి అడిగి ఇక గుండె జబ్బులు వస్తాయి అంటున్నారని.. కానీ వాస్తవానికి దీనికి ఎటువంటి శాస్త్రీయమైన ఆధారాలు జతపరచలేదని.. ఇది ఒక బేసిక్ స్టడీ మాత్రమే కానీ దీనికి ఎటువంటి ప్రామాణికత లేదంటున్నారు. బాగా గమనించినట్లయితే చాలా జంతువులు, పక్షులు అన్నీ కూడా ఒక పూటనే తింటాయని.. మనుషుల మాదిరి చాలాసార్లు తినవంటున్నారు. తక్కువసార్లు తినడం వల్ల



జీర్ణ వ్యవస్థకు కొంచెం గ్యాప్ ఇవ్వడం వల్ల పేగులలో ఆహారం బాగా జీర్ణమయ్యి ఇంకా బాగా శరీరంలోకి అబ్సార్బ్ అవుతుంది అంటున్నారు. అందుకే ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ అనేది నిజంగా ఫాస్టింగ్ కాదని మామూలుగా చేయాల్సిన పనే అంటున్నారు. అది కాకపోతే మనం ఎక్కువసార్లు తినడం అలవాటు చేసుకున్నాం. శరీర నిర్మాణంలో జీర్ణాశయం అనేది ఒక స్టోరేజ్ పాయింట్. పాత కాలంలో ఆహారం సదా దొరకదు. కాబట్టి మనకు జీర్ణాశయం అనేది పరిణామ క్రమంలో డెవలప్ అయింది. అనగా మనం ఆహారాన్ని ఒకేసారి తీసుకొని దానిని నిదానంగా కిందికి పంపిస్తూ జీర్ణం జరగడానికి అలవాటు పడిపోయాం. కానీ ఈ మారిన నవీన యుగంలో ఆహారాన్ని బయట స్టోరేజ్ చేసే పరిస్థితి వచ్చింది. కాబట్టి మనకు ఎప్పుడు పడితే అప్పుడు ఆహారం దొరుకుతుంది. అందుకని ఎక్కువసార్లు మనం తినాల్సిన అవసరం లేదంటున్నారు. మనం ఎంత తినాలి అని అనుకుంటే.. అంతా మనకు కావలసిన, మనకు నచ్చిన పదార్థం ఒక పూట తిన్నా గాని 24 గంటలకు సరిపోతుందని అంటున్నారు.

## మధుమేహ వ్యాధిగ్రస్తులు కుంకుమ పువ్వు తీసుకుంటే.. కేవలం 8 వారాలలో ఈ మార్పు చూడోచ్చు!



ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన మసాలా దినుసు ఏదంటే టక్కున గుర్తొచ్చేది కుంకుమపువ్వు. ఈ పువ్వు ఉత్పత్తికి సాగు చేసే విధానం కారణంగా, కుంకుమపువ్వు ధర అత్యధికంగా ఉంటుంది. నిజానికి.. ఇతర మసాలా దినుసుల కంటే కుంకుమపువ్వు వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలు చాలా ఎక్కువ. అవేంటో తెలుసుకుందాం.. కొన్నిసార్లు కోపం రావడం, కొన్నిసార్లు ఏడవడం.. ఇలాంటి మానసిక కల్లోలం తరచుగా రావడం అస్సలు మంచిది కాదు. ఈ పరిస్థితిలో కుంకుమపువ్వు సహాయం తీసుకోవచ్చు. కుంకుమపువ్వు మనస్సును ఆరోగ్యంగా ఉంచుతుందని, డిప్రెషన్ లక్షణాలను తగ్గిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఆందోళనను తగ్గించడంలోనూ కుంకుమ పువ్వు సహాయపడుతుంది. కుంకుమపువ్వులో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి హానికరమైన ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతాయి. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. కుంకుమపువ్వు తినడం వల్ల గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి అనేక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడానికి ఆహారంలో కుంకుమపువ్వును తప్పక తీసుకోవాలి. ముఖ్యంగా కుంకుమపువ్వు మహిళల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ప్రీ-మెన్‌స్ట్రువల్ సిండ్రోమ్ సమస్యకు కుంకుమపువ్వు మేలు చేస్తుంది. అంటే రుతుక్రమం రాకముందే కలిగే మానసిక, శారీరక అనారోగ్యాన్ని కుంకుమపువ్వు దూరం చేస్తుంది. కాలు నొప్పి, మూడ్ స్వింగ్స్ వంటి లక్షణాలను నియంత్రిస్తుంది. రోజూ కుంకుమపువ్వు కలిపిన టీ లేదా పాలు తాగడం వల్ల బరువు కూడా తగ్గవచ్చు. కుంకుమపువ్వు ఆకలిని అణిచివేసి, బరువు తగ్గడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా ఈ మసాలాలో ఉండే యాంటీఆక్సిడెంట్లు ఊబకాయాన్ని నివారిస్తాయి. జీవక్రియ రుగ్మతలను తొలగిస్తాయి. కుంకుమపువ్వు గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. కుంకుమపువ్వులోని యాంటీఆక్సిడెంట్ కంటెంట్ కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. గుండె సమస్యలను నివారించడానికి ఆహారంలో కుంకుమపువ్వు తీసుకోవచ్చు. రోజువారీ ఆహారంలో కొద్దిగా కుంకుమపువ్వు తీసుకుంటే మధుమేహ వ్యాధిగ్రస్తులకు కూడా మంచిది. కుంకుమపువ్వు కేవలం 8 వారాలలో రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను తగ్గిస్తుంది. కుంకుమపువ్వు టైప్-2 డయాబెటిస్ ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది.

## నోరూరించే పిజ్జా..! ఒక్క ముక్క మీ జీవితాన్ని ఏం చేస్తుందో తెలుసా..?




ప్రస్తుతం అత్యంత ప్రజాదరణ పొందిన జంక్ ఫుడ్స్‌లో పిజ్జా ఒకటి. పిజ్జాని చాలా మంది తరచూ తింటూ ఉంటారు. కానీ అది జంక్ ఫుడ్. టేస్ట్‌కి చాలా మంచిది. కానీ ఆరోగ్యం కోసం కాదు. పిజ్జాతో అనేక అనారోగ్య సమస్యలు వస్తాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. పిజ్జా అతిగా తినడం వల్ల కలిగే అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేస్తే మొదటికే మోసం వస్తుందని హెచ్చరిస్తున్నారు. పిజ్జాలో సోడియం స్థాయిలు ఎక్కువగా ఉంటాయి. మీరు ప్రతిరోజూ అలాంటి పిజ్జా తింటే, అది అధిక రక్తపోటుకు దారితీస్తుంది. మీరు ఒకేసారి మొత్తం పిజ్జా తింటే, మీరు మీ రోజువారీ సోడియం తీసుకోవడం అధికంగా చేస్తున్నారని అర్థం. దీనివల్ల రక్తపోటు పెరుగుతుంది. ఇది గుండె సమస్యలను కలిగిస్తుంది. పిజ్జా తినడం వల్ల వచ్చే మరో ప్రమాదకరమైన వ్యాధి గుండెపోటు. మాంసాలతో తయారు చేసిన పిజ్జా తింటే, అది ఊబకాయం, కొన్ని క్యాన్సర్, గుండె సమస్యలను కలిగిస్తుంది. ఈ ప్రాసెస్ చేసిన మాంసాలను ఎక్కువగా తినడం గుండె ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. తరచుగా పిజ్జా తినడం వల్ల వచ్చే సమస్యలలో మధుమేహం ఒకటి. పిజ్జా తినడం వల్ల బ్లడ్ షుగర్ లెవల్స్ పెరిగి క్రమంగా డయాబెటిస్‌గా మారుతుంది. పిజ్జా వంటి అధిక కొవ్వు ప్రాసెస్ చేసిన ఆహారాలు తినడం వల్ల కడుపు, పెద్దప్రేగు క్యాన్సర్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. దానికి తోడు బరువు విపరీతంగా పెరిగిపోతుంది. దీంతో ఇతర సమస్యలు కూడా పెరుగుతున్నాయి. పిజ్జాతో ముందుగా వచ్చే అతి పెద్ద సమస్య మలబద్ధకం..! పిజ్జా కోసం వాడే మైదా సరిగా జీర్ణం కాదు. ఒక స్లైస్? చీజ్? పిజ్జాలో 400 కెలరీలు ఉంటాయి. ఒక్క స్లైస్‌తో ఆపలేము కదా! ఫలితంగా.. వేగంగా బరువు పెరిగిపోతారు. రిఫైన్డ్ ఫ్లోర్‌తో తయారు చేయడంతో పిజ్జా చాలా హెవీగా ఉంటుంది. ఏ పని చేయలేకపోతాము. అయితే.. పిజ్జాని అప్పుడప్పుడు తినడంలో తప్పు లేదు.కానీ దానిని ఎక్కువగా తినడమే సమస్య! అప్పుడప్పుడు క్వాంటిటీ తగ్గించి తినండి.

## బేబీ కార్న్ తింటే ఇన్ని లాభాలా..? తప్పకుండా తెలుసుకోవాల్సిన విషయాలు ఇవే..

బేబీ కార్న్ రుచికరమైన, పోషకమైన ఆహారం. ఇది పూర్తిగా ఆకులతో చుట్టబడినందున పురుగుమందుల ప్రభావాల ఉండదు. బేబీ కార్న్‌లో భాస్వరం పుష్కలంగా లభిస్తుంది. అంతే కాకుండా కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, కాల్షియం, ఐరన్, విటమిన్లు కూడా ఇందులో లభిస్తాయి. కొలెస్ట్రాల్ లేకుండా, ఫైబర్ పుష్కలంగా ఉండటం వలన ఇది తక్కువ కేలరీల ఆహారం. ఇది గుండె రోగులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. బేబీ కార్న్‌లో లుటీన్, జియాక్సంతిన్ వంటి అవసరమైన కెరోటినాయిడ్లు ఉంటాయి. ఇవి కంటి ఆరోగ్యాన్ని సరైన రీతిలో నిర్వహించడానికి ప్రయోజనకరంగా ఉంటాయి. బేబీ కార్న్‌లోని పొటాషియం మరియు ఫైబర్ కలయిక రక్తపోటును నియంత్రించడంలో, హృదయ ఆరోగ్యాన్ని పెంపొందించడంలో సహాయపడుతుంది. బేబీ కార్న్ అనేది యాంటీఆక్సిడెంట్ పవర్‌హౌస్. ఇది రోగనిరోధక వ్యవస్థకు అవసరమైన బూస్ట్‌ని ఇవ్వడం ద్వారా అనారోగ్యం నుండి శరీరం రక్షణకు మద్దతు ఇస్తుంది. బేబీ కార్న్ మంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాల యొక్క గొప్ప మూలం. బేబీ కార్న్ డయాబెటిస్ ఉన్న వ్యక్తులకు రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచడానికి సహాయపడుతుంది. జీర్ణక్రియ సమస్యలతో బాధపడేవారికి బేబీ కార్న్ దివ్యౌషధం. బేబీ కార్న్‌లోని అధిక ఫైబర్ కంటెంట్ జీర్ణక్రియలో సహాయపడుతుంది. సాధారణ ప్రేగు కదలికలను ప్రోత్సహిస్తుంది. మీరు స్థూలకాయం సమస్యతో సతమతమవుతున్నట్లయితే బేబీ కార్న్ తప్పనిసరిగా తినాలి. బేబీ కార్న్ చర్మానికి చాలా ఉపయోగకరంగా పరిగణించబడుతుంది. నిజానికి, విటమిన్ సి బేబీ కార్న్‌లో పుష్కలంగా లభిస్తుంది. ఇది కాకుండా, బేబీ కార్న్‌లో ఉండే పోషకాలు చర్మ కణాలను పునరుజ్జీవింపజేస్తాయి. మీ చర్మం మృదువుగా కనిపిస్తుంది. కొలెస్ట్రాల్ తగ్గాలంటే బేబీ కార్న్ తినాలి. నిజానికి, బేబీ కార్న్‌లో ఉండే ఫైబర్ కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలో సహాయపడుతుంది.



## సహజంగా శరీరంలో కొలెస్ట్రాల్ కరిగించే ఆహారాలు ఇవే.. తప్పక తీసుకోండి




నేటి కాలంలో అనేక మంది చిన్న వయసులోనే కొలెస్ట్రాల్ సమస్యతో బాధపడుతున్నారు. కొలెస్ట్రాల్ ప్రాథమికంగా ఒక రకమైన లిపిడ్. శరీరానికి అవసరమైన విధులు నిర్వర్తించడానికి ఇది చాలా అవసరం. ఈ కొలెస్ట్రాల్ ఈస్ట్రోజెన్, టెస్టోస్టెరాన్ వంటి హార్మోన్లను తయారు చేయడానికి సహాయపడుతుంది. ఈ కారణాల వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ ఉండటం చాలా ముఖ్యం. అయితే దీని పరిమాణం పెరిగితే మాత్రం ప్రమాదమే. మన శరీరంలో చెడు కొలెస్ట్రాల్, మంచి కొలెస్ట్రాల్ అనే రెండు రకాల కొలెస్ట్రాల్ ఉంటాయి. చెడు కొలెస్ట్రాల్ లేదా మొత్తం పెరిగినప్పుడు అనేక సమస్యలు వస్తాయి. ఈ కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి కొన్ని ఆహారాలు తీసుకోవాలి. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం.. ఈ రోజుల్లో చాలా మంది ఓట్ మీల్ తింటున్నారు. ఇందులో కొలెస్ట్రాల్‌ను కరిగించి నియంత్రించడంలో సహాయపడే కరిగే ఫైబర్ ఉంటుంది. ఇందులో మోనోశాచురేటెడ్ కొవ్వు కూడా ఉంటుంది. అలాగే కొన్ని రకాల పండ్లు కూడా కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. వీటిల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు గుండెను ఆరోగ్యంగా ఉంచడంతోపాటు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. యాపిల్స్‌లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇదిచెడు కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. కాబట్టి రోజూ యాపిల్స్ తప్పక తినాలి. రెడ్ మీట్, ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్ వంటి ఆహారాలను పూర్తిగా మానుకోవాలి. అవి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. అలాగే, ప్రాసెస్ చేసిన ఆహారాలు, కేకులు, కుకీలు, పేస్ట్రీలు, జున్ను, నెయ్యి, వెన్న, చీజ్, జామ్ వంటి వాటికి కూడా దూరంగా ఉండాలి. మీగడ పాలు, దానితో చేసిన ఆహారం, నెయ్యి-వెన్న వీలైనంత తక్కువగా తీసుకోవాలి.అలాగే తగినంత నీళ్లు త్రాగాలి.దానితో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం తప్పనిసరి. సరైన ఆహారాల అలవాట్లు సగం జబ్బులను నయం చేస్తుంది.

# రిటైన్ చేసుకుంటున్న ప్లేయర్ల లిస్టు ఇంటర్నెట్‌లో వైరల్!

ఐపీఎల్ వేలానికి సంబంధించిన రిటెన్షన్ నిబంధనలను ఇటీవలే బీసీసీఐ ఖరారు చేసింది. మొత్తంగా ఒక్కో ఫ్రాంచైజీ గరిష్ఠంగా ఆరుగురు ప్లేయర్లను అట్టిపెట్టుకోవడానికి అనుమతి ఇచ్చింది. త్వరలోనే 2025 ఇండియన్ ప్రీమియర్ లీగ్ మెగా వేలం జరగనుంది. దీంతో రిటైన్ చేసుకునే ప్లేయర్ల లిస్టును ప్రిపేర్ చేయడంలో ఫ్రాంచైజీలు బిజీగా ఉన్నాయి. అయితే కొందరు ఆటగాళ్లను అట్టిపెట్టుకోవడం, రిలీజ్ చేసే విషయంలో ఫ్రాంచైజీలు ఆశ్చర్యకరమైన నిర్ణయాలు తీసుకున్నట్లు సమాచారం. పది ఫ్రాంచైజీలు రిటైన్ చేసుకుంటున్న ప్లేయర్ల లిస్టు ఒకటి ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారింది. లీక్ అయిన జాబితాలోని ఆటగాళ్లను చూస్తే మీరు ఆశ్చర్యపోతారు! రాబోయే సీజన్‌లో భారత,విదేశీ ఆటగాళ్ల సహా ప్రతి జట్టు ఆరుగురు ఆటగాళ్లను రిటైన్ చేసుకోవచ్చు. జట్లు వారు అట్టిపెట్టుకుంటున్న ఆటగాళ్ల సంఖ్య ఆధారంగా స్పెసిఫిక్ అమౌంట్‌ని తప్పనిసరిగా చెల్లించాలి. రిటైన్ చేసుకుంటున్న మొదటి, నాలుగో ప్లేయర్‌కి రూ.18 కోట్లు కేటాయించాలి. అలానే రెండు, ఐదో ప్లేయర్‌కి రూ.14 కోట్లు, మూడో ఆటగాడికి రూ.11 కోట్లు చెల్లించాలి. టీమ్‌లు ఇద్దరు అన్‌క్యాప్డ్ ప్లేయర్‌లను రిటైన్ చేసుకోవడానికి కూడా అనుమతి ఉంది. భారత్ తరఫున ఇప్పటి వరకు అంతర్జాతీయ క్రికెట్ ఆడని ఆటగాళ్లను అన్‌క్యాప్డ్ ప్లేయర్‌లు పేర్కొంటారు. వీరికి ఒక్కొక్కరికి రూ.4 కోట్లు చెల్లించాలి. అలానే గతంలో టీమ్ ఇండియాకి ఆడిన ఆటగాడు, దాదాపు ఐదేళ్లు అంతర్జాతీయ క్రికెట్‌కి దూరంగా ఉంటే కూడా అన్‌క్యాప్డ్ ప్లేయర్‌గా గుర్తిస్తారు. అదనంగా వేలం సమయంలో జట్లకు రైట్ టు మ్యాచ్ )ను ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. మరొక ఫ్రాంచైజీ చేసిన అత్యధిక బిడ్‌ను ఆఫర్ చేయడం ద్వారా ఆటగాడిని తిరిగి కొనుగోలు చేయవచ్చు. అయితే, ఈ సంవత్సరం ఒక కొత్త ట్విస్ట్ ఉంది. ఓ ఫ్రాంచైజీ %=వీ%ని ఉపయోగిస్తే, అత్యధిక బిడ్డర్ తమ ఆఫర్‌ను అంతకంటే పెంచవచ్చు. దీంతో పోటీ ఆసక్తికరంగా మారుతుంది. టాప్ ప్లేయర్‌లకు ఎక్కువ మొత్తం లభిస్తుంది. నివేదికల ప్రకారం, ముంబై ఇండియన్స్ నలుగురు కీలక ఆటగాళ్లు రోహిత్ శర్మ, జస్ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యాని కొనసాగించాలని నిర్ణయించుకుంది. గత సీజన్‌లో ఫెయిలైన హార్దిక్‌ని కెప్టెన్‌గా కొనసాగిస్తారా? లేదా? అనేది అస్పష్టంగానే ఉంది.పంజాబ్ కింగ్స్ కేవలం ఒక ఆటగాడు అర్ష్‌దీప్ సింగ్‌ను మాత్రమే ఉంచుకుంది. గత సీజన్‌లో అద్భుతంగా రాణించిన అన్‌క్యాప్డ్ స్టార్లు శశాంక్ సింగ్, అశుతోష్ శర్మను వదులుకుంది. లక్నో ఫ్రాంచైజీ కేఎల్ రాహుల్‌ను కెప్టెన్‌గా కొనసాగించకపోవడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. నికోలస్ పూరన్, మయాంక్ యాదవ్, ఆయుష్ బదోని లేదా మొహ్సిన్ ఖాన్‌లో ఒకరిని రిటైన్ చేసుకోవాలని నిర్ణయించుకుంది.

ఫ్రాంచైజీలు రిటైన్ చేస్తున్న ప్లేయర్ల జాబితా

- సన్‌రైజర్స్ హైదరాబాద్: పాట్ కమిన్స్, అభిషేక్ శర్మ, హెన్రిచ్ క్లాసెన్
- రాజస్థాన్ రాయల్స్: సంజు శాంసన్, రియాన్ పరాగ్, ధృవ్ జురెల్
- కోల్‌కతా నైట్ రైడర్స్: శ్రేయాస్ అయ్యర్, ఆండ్రీ రస్సెల్, సునీల్ నరైన్, హర్షిత్ రానా
- రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు: విరాట్ కోహ్లీ, ఫాఫ్ డు ప్లెసిస్, మహ్మద్ సిరాజ్
- ముంబై ఇండియన్స్: రోహిత్ శర్మ, జస్ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా- ఢిల్లీ క్యాపిటల్స్: రిషబ్ పంత్, అక్షర్ పటేల్, జేక్ ఫ్రేజర్/కుల్దీప్ - పంజాబ్ కింగ్స్: అర్ష్‌దీప్ సింగ్ - లక్నో సూపర్ జెయింట్స్: నికోలస్ పూరన్, మయాంక్ యాదవ్, ఆయుష్ బదోని/మొహ్సిన్ ఖాన్- చెన్నై సూపర్ కింగ్స్: రవీంద్ర జడేజా, రుతురాజ్ గైక్వాడ్, శివం దూబే, ఎంఎస్ ధోని- గుజరాత్ టైటాన్స్: శుభమాన్ గిల్, రషీద్ ఖాన్

# నేడు న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య ఫైనల్

## ప్రపంచకప్ గెలిచి చరిత్ర సృష్టించనున్న ఇరు జట్లు



మహిళల టీ20 ప్రపంచకప్‌లో భాగంగా ఆదివారం న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు తొలిసారి ప్రపంచకప్ గెలిచి చరిత్ర సృష్టిస్తుంది. వెస్టిండీస్‌ను ఓడించి న్యూజిలాండ్ 14 ఏళ్ల తర్వాత ఫైనల్‌లో అడుగు పెట్టగా, దక్షిణాఫ్రికా వరుసగా రెండోసారి ప్రపంచకప్ ఫైనల్ కు చేరుకుంది. సెమీ-ఫైనల్లో న్యూజిలాండ్ వెస్టిండీస్‌ను ఓడించగా, దక్షిణాఫ్రికా డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది. ఇప్పటి వరకు రెండు జట్లూ అటు పురుషులు, ఇటు మహిళలు ప్రపంచ కప్ ను గెలవలేకపోయాయి. ఇందులో గెలిచిన జట్టు తొలిసారిగా టీ20 ట్రోఫీని సొంతం చేసుకుంటుంది. భారత కాలమానం ప్రకారం ఈ మ్యాచ్ దుబాయ్ వేదికగా ఆదివారం రాత్రి 7:30 గంటలకు జరగనుంది. ఈ మహిళల %%20 ప్రపంచ కప్ %ఖూజు%లో అక్టోబర్ 3న ప్రారంభమైంది. ఇందులో మొత్తం 10 జట్లు పాల్గొన్నాయి. ఈ క్రమంలో 2009 తర్వాత తొలిసారి ఆస్ట్రేలియా లేకుండా ప్రపంచకప్ ఫైనల్ ఆడనుంది. ఆస్ట్రేలియా జట్టు ఈ ట్రోఫీని అత్యధికంగా 6 సార్లు గెలిచింది. ఇకపోతే ప్రస్తుత టోర్నమెంట్‌లో న్యూజిలాండ్ జట్టు అద్భుత ప్రదర్శన చేసింది. టి20 ప్రపంచ కప్‌లోకి ప్రవేశించడానికి ముందు, ఈ జట్టు 2024 సంవత్సరంలో ఆడిన 13 %%20 మ్యాచ్‌లలో ఒక మ్యాచ్‌లో మాత్రమే గెలిచింది. దీని తర్వాత, ప్రపంచకప్‌లో వారి ప్రదర్శన చూసి అభిమానులు కూడా ఆశ్చర్యపోయారు. ఇప్పుడు ఈ టీమ్ టైటిల్‌కు ఒక్క అడుగు దూరంలో నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించి చరిత్ర సువర్ణ పుటల్లో పేరు నమోదు చేసుకునేందుకు సోఫీ డివైన్ జట్టుకు సువర్ణావకాశం దక్కింది. ఇక దక్షిణాఫ్రికా విషయానికి వస్తే.. వారిని 'చోకర్స్' అంటారు. ఎందుకంటే ఈ జట్టు పెద్ద మ్యాచ్‌లలో ఓడిపోతుంది. ఈ ట్యాగ్ పురుషుల, మహిళల జట్టులకు సరిగ్గా సరిపోతుంది. దక్షిణాఫ్రికా పురుషుల జట్టు ఇటీవల భారత్‌తో జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో ఓడిపోయింది. అయితే, టైటిల్ గెలవడం ద్వారా ఈ అపోహను బద్దలు కొట్టే గోల్డెన్ ఛాన్స్ ఇప్పుడు మహిళల జట్టుకు దక్కింది.

# సర్ఫరాజ్ సెంచరీపై పలువురు క్రికెటర్లు ప్రశంసలు



భారత్ వర్సెస్ న్యూజిలాండ్ మధ్య శనివారం జరిగిన తొలి టెస్టులో సర్ఫరాజ్ ఖాన్ అద్భుత సెంచరీ సాధించాడు. నాలుగో రోజు బెంగళూరు స్టేడియంలో 110 బంతుల్లో తొలి అంతర్జాతీయ సెంచరీని పూర్తి చేశాడు. క్లిష్ట పరిస్థితుల్లో మిడిల్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కు దిగిన సర్ఫరాజ్.. అద్భుత ఇన్నింగ్స్‌తో ఆదుకున్నాడు. ఈ క్రమంలో సెంచరీతో రాణించిన సర్ఫరాజ్‌పై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. శతకం సాధించడంపై క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, ఆస్ట్రేలియా మాజీ స్టార్ ఆటగాడు డేవిడ్ వార్నర్ ప్రశంసల జల్లు కురిపించారు. అతడిని అభినందిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'సర్ఫరాజ్ ఖాన్.. జట్టుకి అవసరమైనప్పుడు ఇలాంటి ఒక ఇన్నింగ్స్ ఆడి నీ కెరీర్‌లో తొలి సెంచరీ సాధించడం చాలా గొప్ప విషయం' అని సచిన్ పోస్ట్ చేశాడు. మరోవైపు.. డేవిడ్ వార్నర్ కూడా "బాగా ఆడావు సర్ఫరాజ్. నువ్వు చేసిన హార్డ్ వర్క్ కనిపిస్తోంది. సెంచరీ చేయడం చాలా గొప్ప విషయం' అని వార్నర్ ఇన్‌స్టాస్టోరీలో షేర్ చేశాడు. 2024 ఫిబ్రవరిలో సర్ఫరాజ్ అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. తన కెరీర్‌లో నాలుగో టెస్టులో సెంచరీ సాధించిన ఘనతను సాధించాడు. అంతకుముందు మూడు హాఫ్ సెంచరీలు చేశాడు. దేశవాళీ క్రికెట్‌లో సంచలనం సృష్టించిన సర్ఫరాజ్ ఖాన్‌కు.. అంతర్జాతీయ అరంగేట్రం చేసే అవకాశం వచ్చింది. అతను 51 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో 69.09 అద్భుతమైన సగటుతో 4422 పరుగులు చేశాడు. అందులో 15 సెంచరీలు, 14 హాఫ్ సెంచరీలు సాధించాడు. అతన్ని భారత దేశవాళీ క్రికెట్‌లో 'డాన్ బ్రాడ్‌మన్' అని కూడా పిలుస్తారు.

# సెంచరీని మిస్ చేసుకున్న రిషబ్ పంత్

న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో 99 పరుగుల వద్ద భారత స్టార్ వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ రిషబ్ పంత్ ఔటయ్యాడు. దీంతో.. సెంచరీని మిస్ చేసుకున్నాడు. గత ఆరేళ్లలో పంత్ టెస్టుల్లో ఏడోసారి 90-99 రన్స్ మధ్య ఔటయ్యాడు. నాలుగో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన పంత్.. సర్ఫరాజ్ ఖాన్ తో కలిసి నాలుగో వికెట్ కు అద్భుత భాగస్వామ్యం నెలకొల్పి భారత్ ను కష్టాల నుంచి గట్టెక్కించాడు. పంత్, సర్ఫరాజ్‌ల భాగస్వామ్యంతో భారత్ రెండో ఇన్నింగ్స్‌లో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. శనివారం న్యూజిలాండ్ బౌలర్లను సర్ఫరాజ్, పంత్ ముప్పు తిప్పలు పెట్టారు. ఈ క్రమంలో పంత్ దూకుడుగా బ్యాటింగ్ చేసి 12వ అర్ధ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. దీంతో.. టెస్టుల్లో అత్యంత వేగంగా 2500 పరుగులు పూర్తి చేసిన భారత వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్‌గా పంత్ నిలిచాడు. అయితే.. అభిమానులందరు పంత్ సెంచరీ చేస్తాడని అనుకున్నప్పటికీ.. 99 పరుగుల వద్ద విలియం ఓ రూర్కే బౌలింగ్‌లో ఔట్ అయ్యి సెంచరీని కోల్పోయాడు. అత్యధిక సార్లు 90లో ఔటైన మూడో భారతీయ బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. టెస్టుల్లో అత్యధిక సార్లు సెంచరీ కోల్పోయిన భారత్‌కు అవాంఛిత రికార్డు సచిన్ టెండూల్కర్ పేరిట ఉంది. అతను తన కెరీర్‌లో మొత్తం 10 సార్లు 90లో ఔటయ్యాడు. ఆ తర్వాత.. రాహుల్ ద్రవిడ్ తొమ్మిది సార్లు సెంచరీ చేయడంలో విఫలమయ్యాడు. పంత్ టెస్టుల్లో 99 పరుగుల వద్ద ఔట్ అయిన 10వ భారత బ్యాట్స్‌మెన్ గా నిలిచాడు. మాజీ దిగ్గజ బ్యాట్స్‌మెన్ సౌరవ్ గంగూలీ, మహేంద్ర సింగ్ ధోనీ వంటి ఆటగాళ్ల సరసన చేరాడు. టెస్టులో భారత్ తరఫున గంగూలీ, ధోనీలు కూడా 99 పరుగులకే ఔట్ అయ్యారు. టెస్టుల్లో గంగూలీ రెండుసార్లు 99 పరుగుల వద్ద ఔటయ్యాడు. కెరీర్‌లో ఇప్పటి వరకు 36 టెస్టు మ్యాచ్‌లు ఆడిన రిషబ్ పంత్.. 44.75 సగటుతో 2551 పరుగులు చేశాడు. ఇందులో 6 సెంచరీలు, 12 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అతని ఇన్నింగ్స్‌ల్లో 276 ఫోర్లు, 64 సిక్సర్లూ ఉండటం విశేషం.



# స్పోర్ట్స్

## 200 పరుగుల టార్గెట్ నిర్దేశిస్తే విజయం సాధ్యం

### మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లే అభిప్రాయం

నాలుగో రోజు తొలి సెషన్ అత్యంత కీలకం కానుంది. అయితే, భారత్ లంచ్ బ్రేక్ నాటికే లీడ్‌లోకి వస్తుందని మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లే అభిప్రాయపడ్డాడు. ప్రత్యర్థికి కనీసం 150 నుంచి 200 పరుగులు నిర్దేశిస్తే విజయం సాధించడం పెద్ద కష్టమేం కాదని తెలిపాడు. నాలుగో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చాలా కఠినంగా ఉంటుందని వ్యాఖ్యానించాడు. "నాలుగో రోజు తొలి సెషన్ ముగిసే నాటికి భారత్ ఇప్పుడున్న లోటును అధిగమిస్తుంది. స్వల్ప ఆధిక్యం సాధించినా ఆశ్చర్యపోనక్కర్లేదు. కానీ, మొదటి పది ఓవర్లు చాలా కీలకం. పేస్‌కు అనుకూలంగా ఉంటుంది. ఇంకా నలుగురు బ్యాటర్లు ఉన్న నేపథ్యంలో లీడ్‌ను 200 వరకు తీసుకెళ్లగలిగితే మ్యాచ్ గెలిచేందుకు అవకాశాలు ఉంటాయి. చివరి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేయడం చాలా కష్టంగా ఉంటుంది. భారత జట్టులో ముగ్గురు నాణ్యమైన స్పిన్నర్లు ఉన్నారు" అని కుంబ్లే వెల్లడించాడు. "టీ20 ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాను స్వల్ప తేడాతో భారత్ చిత్తు చేసింది. ఒక దశలో టీమ్‌ఇండియాకు ఓటమి ఖాయమని అంతా భావించారు. అలాంటి సమయంలో అద్భుతంగా పోరాడింది. ఇప్పుడు కివీస్‌తో తొలి టెస్టులోనూ మరోసారి అదే ఫలితాన్ని చూడబోతున్నాం. టీమ్‌ఇండియా కమ్‌బ్యాక్‌తో మ్యాచ్ రసవత్తరంగా మారుతుందని భావిస్తున్నా" అని మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ వ్యాఖ్యానించాడు.

## 462 పరుగులకు ఆలౌటైన భారత్ 106 పరుగుల ఆధిక్యంలో భారత్


న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో టీమిండియా అద్భుతంగా రాణించింది. కాగా.. 462 పరుగులకు భారత్ ఆలౌటైంది. 3 వికెట్లు కోల్పోయి ఇన్నింగ్స్ ప్రారంభించిన సర్ఫరాజ్ ఖాన్, రిషబ్ పంత్ అద్భుతంగా ఆడారు. దీంతో.. భారత్ 106 పరుగుల ఆధిక్యంలోకి వచ్చింది. సర్ఫరాజ్ ఖాన్ (150), పంత్ (99) పరుగులతో సూపర్ ఇన్నింగ్స్ ఆడారు. వీరిద్దరూ నిలకడగా ఆడి పరుగుల పట్టికను పరుగులు పెట్టించారు. అయితే.. ఒక్క పరుగు తేడాతో పంత్ సెంచరీని మిస్ చేసుకున్నాడు. ఇదిలా ఉంటే.. వీరిద్దరూ పెవిలియన్ బాట పట్టగానే టీమిండియా బ్యాటర్లు ఇలా వచ్చి అలా పెవిలియన్ కు వెళ్లిపోయారు. మధ్యాహ్నం నుంచి టీమిండియా 7 వికెట్లు కోల్పోయింది. అయితే.. న్యూజిలాండ్ విజయానికి 107 పరుగులు అవసరం.. ఈ రన్స్ కొట్టకుండా రోహిత్ సేన ఎలా అడ్డుకట్ట వేస్తుందో చూడాలి.రెండో ఇన్నింగ్స్‌లో భారత్ బ్యాటర్లు యశస్వీ జైస్వాల్(35), రోహిత్ శర్మ (52), విరాట్ కోహ్లీ (70), సర్ఫరాజ్ ఖాన్ (10), రిషబ్ పంత్ (99), కేఎల్ రాహుల్ (12), జడేజా (5), అశ్విన్ (15), కుల్దీప్ యాదవ్ (6), సిరాజ్, బుమ్రా డకౌట్ అయ్యారు. న్యూజిలాండ్ బౌలింగ్‌లో మ్యాట్ హెన్రీ, విలియం ఓ రూర్కే చెరో 3 వికెట్లతో చెలరేగారు. ఆ తర్వాత.. అజాజ్ పటేల్ 2 వికెట్లు పడగొట్టాడు. టిమ్ సౌథీ, గ్లేన్ ఫిలిప్స్ తలో వికెట్ సంపాదించారు. ఇదిలా ఉంటే.. 107 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్.. 4 బంతులు వేసిన తర్వాత బ్యాడ్ లైట్ కారణంగా మ్యాచ్ ను అంపైర్లు నిలిపివేశారు. దీంతో.. ఆటకు అంతరాయం కలిగింది. తిరిగి నేటికి ఆట ప్రారంభం కానుంది. కాగా.. ఆటకు నేడు ఒక్క రోజు మాత్రమే సమయం ఉంది. 107 పరుగుల లక్ష్యాన్ని న్యూజిలాండ్ చేధిస్తే గెలుస్తుంది.. లేదంటే 107 పరుగుల లోపు భారత్ బౌలర్లు ఆలౌట్ చేస్తే టీమిండియా గెలుపొందుతుంది. అలా కాకుండా.. 107 పరుగుల లోపు కట్టడి చేస్తే మ్యాచ్ డ్రా అవుతుంది. చూడాలి మరి రోహిత్ సేన ఎలా ప్రదర్శిస్తారో

## ఆర్సీబీకి వచ్చేయ్ భాయ్, లవ్ యూ భాయ్

బెంగళూరు వేదికగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో భారత్ ధీటుగా సమాధానం ఇస్తోంది. 356 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన రోహిత్ సేన.. నాలుగో రోజు లంచ్ బ్రేక్ సమయానికి 344/3 స్కోరు చేసింది. సర్ఫరాజ్ ఖాన్ (125), రిషబ్ పంత్ (53) క్రీజులో ఉన్నారు. భారత్ ఇంకా 12 పరుగులు వెనుకంజలో ఉంది. లంచ్ బ్రేక్‌కు ముందు వర్షం రావడంతో చాలా సమయం ఆట నిలిచిపోగా.. ఇప్పుడే ఆరంభమైంది. చిన్నస్వామి స్టేడియంలో వర్షం తగ్గిన అనంతరం టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ మైదానంలోకి వెళ్లి పిచ్‌ను పరిశీలించాడు. తిరిగి డగౌట్‌కు వస్తుండగా.. స్టాండ్స్‌లోని ఫాన్స్ 'రోహిత్.. రోహిత్' అంటూ అరిచారు. వారికి హిట్‌మ్యాన్ హాయ్ చెప్పాడు. 'ఐపీఎల్ 2025లో ఏ టీమ్‌కు ఆడుతావ్ భాయ్' అని ఓ అభిమాని ప్రశ్నించగా.. 'నీకు ఏ టీమ్ కావాలి' అని రోహిత్ సరదాగా అడిగాడు. అందుకు ఆ ఫ్యాన్ బదులిస్తూ.. 'ఆర్సీబీకి వచ్చేయ్ భాయ్, లవ్ యూ భాయ్' అని అన్నాడు. ఇంతలో రోహిత్ అక్కడినుంచి వెళ్ళిపోయాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఐపీఎల్ 2024లో హార్దిక్ పాండ్యాను కెప్టెన్‌గా నియమించడంతో.. రోహిత్ శర్మ సహా అభిమానులకు మింగుడుపడలేదు. ఐపీఎల్ సమయంలోనే హార్దిక్, రోహిత్ మధ్య విభేదాలు ఉన్నాయని వార్తలు మొదలయ్యాయి. ఇప్పుడు రోహిత్ మెగా వేలంలోకి అడుగుపెట్టే అవకాశం ఉందనే వార్తలు వినిపిస్తున్నాయి. వేలంలో రోహిత్‌ను కొనుగోలు చేయాలని బెంగళూరును ఇటీవల మాజీ భారత బ్యాటర్ మహ్మద్ కైఫ్ కోరారు. పంజాబ్ కింగ్స్ సహా యజమాని ప్రీతి జింతా కూడా రోహిత్ కోసం భారీగా ఖర్చు చేస్తా అని చెప్పిన విషయం తెలిసిందే. అయితే తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం ముంబై రిటైన్ లిస్టులో హిట్‌మ్యాన్ ఉన్నాడని తెలుస్తోంది. మరికొన్ని రోజుల్లో దీనిపై స్పష్టత రానుంది.

## బీసీసీఐకి మరో ఆఫర్ ఇచ్చిన పీసీబీ!

వచ్చే ఏడాది పాకిస్థాన్ వేదికగా ఛాంపియన్స్ ట్రోఫీ 2025 జరగనుంది. ఐసీసీకి పీసీబీ పంపిన షెడ్యూల్ ప్రకారం.. టోర్నీ తొలి మ్యాచ్ ఫిబ్రవరి 19న, ఫైనల్ మ్యాచ్ మార్చి 9న జరగనుంది. లాహోర్, రావల్పిండి, కరాచీలను వేదికలుగా ఎంపిక చేశారు. ఛాంపియన్స్ ట్రోఫీకి సంబంధించిన అధికారిక షెడ్యూల్‌ను ఇంకా ప్రకటించాల్సి ఉంది. అయితే భద్రతా కారణాల దృష్ట్యా పాకిస్తాన్‌కు టీమిండియా వెళ్లేది లేదంటూ కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. తాము పాకిస్తాన్‌కు రామని, హైబ్రిడ్ మోడల్‌లో టోర్నీని నిర్వహించాలని ఐసీసీని బీసీసీఐ కోరింది. దాంతో భారత్ ఆడే మ్యాచ్‌లతో పాటు.. టీమిండియా సెమీస్, ఫైనల్‌కు చేరుకుంటే వేదికలు కూడా మారిపోతాయని సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొట్టాయి. ఆ వార్తలను పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఇటీవల కొట్టిపడేసింది. అలాంటి ఆలోచన తాము చేయడం లేదంటూ వెల్లడించింది. తాజాగా మరో ఆఫర్‌తో బీసీసీఐకి ముందుకు పీసీబీ వచ్చింది. ఓ స్పోర్ట్స్ ఛానెల్ కథనం ప్రకారం.. భద్రతా కారణాల వల్ల పాకిస్తాన్‌లో భారత జట్టు ఉండటానికి ఇష్టపడకపోతే, ప్రతి మ్యాచ్ ఆడిన తర్వాత తిరిగి భారత్‌కు టీమ్ వెళ్లొచ్చని బీసీసీఐకి పీసీబీ ఓ లేఖ రాసిందట. ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్ అనంతరం న్యూ ఢిల్లీ లేదా చండీగఢ్‌కు తిరిగి వెళ్లేలా ఏర్పాట్లను చేస్తామని ప్రతిపాదించిందట. భారత జట్టు న్యూ ఢిల్లీ లేదా మొహాలీలో క్యాంప్‌ను ఏర్పాటు చేసుకోవచ్చని, మ్యాచ్‌ల కోసం లాహోర్‌కు వెళ్లేందుకు చార్టర్డ్ ఫ్లైట్‌లను ఏర్పాటు చేస్తామని తెలిపిందట. ఇటీవల భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పాకిస్తాన్ పర్యటన వెళ్లగా.. ఛాంపియన్స్ ట్రోఫీ అంశం పలుమార్లు ప్రస్తావనకు వచ్చిందని పేర్కొంది.



## ప్రీ ఇండిపెండెన్స్ స్టోరీగా ఫౌజీ

ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందనున్న చిత్రానికి 'ఫౌజీ' అనే టైటిల్ పరిశీలిస్తున్నారు. ఈ సినిమాలో ప్రభాస్ సైనికుడిగా నటిస్తున్నాడు. అందుకే ఈ టైటిల్ పెడితే బాగుంటుందని చిత్రబృందం భావిస్తోందట. ప్రస్తుతానికి ఇదే ఈ సినిమా వర్కింగ్ టైటిల్. దీనికంటే మంచి టైటిల్ ఆలోచన వస్తే.. దాన్నే ఫిక్స్ చేస్తారట. లేదా 'ఫౌజీ' టైటిల్‌నే ఖరారు చేస్తారట. 1947 కంటే ముందు సాగే కథ ఇది. ప్రభాస్ బ్రిటీష్ సైన్యంలో ఓ సోల్జర్‌గా కనిపించనున్నాడు. అయితే ఇప్పటికే వరుసగా మూడు, నాలుగు సినిమాల షూటింగ్స్ తో ప్రభాస్ బిజీబిజీగా గడుపుతున్నారు. మరోవైపు ఫౌజి సినిమా షూటింగ్ కూడా ప్రారంభమవడంతో ఈ సినిమా నుంచి ఓ అప్డేట్ అందింది. ప్రభాస్ బర్త్ డే సందర్భంగా ఆ ట్రీట్ రివీల్ చేయబోతున్నారు. ప్రస్తుతం ప్రభాస్ 'రాజా సాబ్', 'ఫౌజి', 'సలార్ 2', 'కల్కి 2', 'స్పిరిట్' సినిమాల్లో నటిస్తున్నారు. మొదటగా వచ్చే ఏడాది సమ్మర్‌లో రిలీజ్ కానున్న మారుతీ చిత్రం 'ది రాజా సాబ్' షూటింగ్ లో బిజీబిజీగా గడుపుతున్నాడు. ఈ క్రమంలోనే మొదలుపెట్టిన హను రాఘవపూడి 'ఫౌజి' సినిమా షూటింగ్ కూడా ప్రారంభమైంది. అయితే ప్రస్తుతం ప్రభాస్ డేట్స్ లేకపోవడంతో డైరెక్టర్ మొదటి షెడ్యూల్‌లో ఇతర సీన్స్ చిత్రీకరిస్తున్నారు. అయితే ఈ నెల 23న బర్త్ డే అనంతరం ప్రభాస్ ఫౌజి షూటింగ్‌లోకి ఎంటర్ కానున్నడని సమాచారం. అలాగే 2, 3 వారాలు ఫౌజి సినిమాకే కేటాయించనున్నట్లు తెలుస్తోంది. రోవైపు ప్రభాస్ అభిమానులకు భారీ ట్రీట్ ఇవ్వడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆయన పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 23న కొత్త సినిమాల అప్‌డేట్‌లతోపాటు ఆయన గత చిత్రాలతో ప్రేక్షకుల్ని అలరించడానికి మేకర్స్ ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ప్రభాస్ నటించిన అరడజనకు పైగా సినిమాలు రీ రిలీజ్ చేయనున్నారు. మిస్టర్ పర్ఫెక్ట్, మిర్చి, ఛత్రపతి, ఈశ్వర్, రెబల్, సలార్ చిత్రాలు రిలీజ్ కానున్నాయి.



# మేజర్ ముకుంద్ వరదరాజన్ బయోపిక్

## అమరన్ మూవీలో శికార్తికేయన్, సాయపల్లవి జంట

శివ కార్తికేయన్, సాయిపల్లవి జంటగా నటించిన చిత్రం 'అమరన్' రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో శివ కార్తికేయన్ ఆర్మీ అధికారి మేజర్ ముకుంద్ వరదరాజన్ పాత్రలో కనిపించనున్నారు. తాజాగా చెన్నై వేదికగా దీని ఆడియో లాంచ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. పలువురు ప్రముఖులు హాజరై సందడి చేశారు. ఈ కార్యక్రమంలో సాయిపల్లవిని శివకార్తికేయన్ ప్రశంసించారు.'మేజర్ ముకుంద్ వరదరాజన్ గురించి మొదట వార్తల్లో విన్నా. రాజ్ కుమార్ ఈ కథను వివరించినప్పుడు భావోద్వేగానికి గురయ్యా.

ముకుంద్ గొప్ప లీడర్. కశ్మీర్‌లో 100రోజుల పాటు యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించాం. రాత్రిపూట కావడంతో చలి ఎక్కువగా ఉండేది. ఈ చిత్రం క్లైమాక్స్ అందరినీ కంటతడి పెట్టిస్తుంది. ముకుంద్ అందమైన జీవితాన్ని, ఆయన కుటుంబాన్ని అందరూ గౌరవించేలా దీన్ని తీర్చిదిద్దాం. ఈ సినిమా కోసం ఆయన కుటుంబాన్ని సంప్రదించినప్పుడు తమిళ హీరోతోనే తీయాలని వాళ్లు కోరారు. ముకుంద్‌కు తమిళ పరిశ్రమ అంటే ఎంతో ఇష్టమని చెప్పారు. నేను ఓ టీవీ ఛానల్‌లో వర్క్ చేస్తున్నప్పుడు సాయిపల్లవిని మొదటిసారి కలిశాను. నేను వ్యాఖ్యతగా వ్యవహరించిన ఓ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఇండస్ట్రీలో ఆమె పేరే ఒక బ్రాండ్. 'ప్రేమమ్'లో ఆమె నటన



చూసి ఆశ్చర్యపోయా. ఫోన్ చేసి ప్రశంసించా. ఆమె వెంటనే 'థ్యాంక్యూ అన్నా' అని చెప్పింది. నన్ను అన్నా అని పిలిచినందుకు అప్పుడు చాలా ఫీలయ్యాను. ఆమె గొప్ప నటి' అని అన్నారు. 'ఈ సినిమా దేశమంతా గర్వపడుతుంది. ఇటీవల కమల్‌హాసన్ ఈ చిత్రం చూసి భావోద్వేగానికి గురయ్యారు. టిష్యూలు దగ్గర పెట్టుకొని దీన్ని చూశారు' అని దర్శకుడు లోకేశ్ కనగరాజ్ అన్నారు. మణిరత్నం మాట్లాడుతూ..'ముకుంద్ లాంటి గొప్ప వ్యక్తుల గురించి అందరూ తెలుసుకోవాలి. నేను సాయి పల్లవికి పెద్ద అభిమానిని. భవిష్యత్తులో ఆమెతో కలిసి వర్క్ చేయాలని కోరుకుంటున్నా' అని చెప్పారు. శివకార్తికేయన్ ఈ సినిమాకు సరైన ఎంపికని సాయి పల్లవి అన్నారు.

# రజనీ సార్ సూచనను పట్టించుకోలే

### మనసులో మాట బయటపెట్టిన రాహుల్ సిప్లిగంజ్



'నాటునాటు'తో ఆస్కార్ స్టేజ్‌పై ప్రదర్శన ఇచ్చి.. ఎంతోమంది అభిమానాన్ని చొరగొన్న తెలుగు గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ తాజాగా ఆయన ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. అందులో పలు విశేషాలు పంచుకున్నారు. ముఖ్యంగా రజనీకాంత్‌తో దిగిన ఓ ఫొటో వైరల్‌గా మారడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జీవితంలో తాను చేసిన తప్పు అదేనని.. అందుకు ఎంతో బాధపడుతున్నానని చెప్పారు. 'రంగమార్తాండ' సినిమా షూట్ వల్ల ప్రకాశ్‌రాజ్, రమ్యకృష్ణతో నాకు అనుబంధం ఏర్పడింది. ఆ సినిమా షూట్‌లో ఉన్నప్పుడు.. నేను రజనీకాంత్‌కు వీరాభిమానిని అని ప్రకాశ్‌రాజ్‌కు తెలిసింది. దాంతో ఆయన నన్ను పిలిచి.. రేపు తాను రజనీకాంత్ సినిమా షూట్‌కు వెళ్తున్నట్లు చెప్పారు. నన్ను కూడా రమ్మన్నారు. అలా, 'అన్నాత్తే' షూట్‌కు వెళ్లా. రజనీ సర్‌కు నన్ను పరిచయం చేశారు. వెంటనే కాళ్లకు నమస్కారం చేశా. అయితే అప్పుడు ఆయన మూవీ కాస్ట్యూమ్స్ (సినిమాలో కనిపించే లుక్)తో ఉన్నారు. నా ఇష్టాన్ని గమనించి ఫొటో దిగారు. సినిమాకు సంబంధించి తన లుక్ ఇంకా రిలీజ్ చేయలేదని.. కాబట్టి, సినిమా రిలీజ్ అయ్యే వరకూ ఆ ఫొటో ఎక్కడా షేర్ చేయొద్దని చెప్పారు. దాదాపు 10 రోజులు గడిచిపోయాయి. ఆనందం తట్టుకోలేక ఒకరోజు దాన్ని సోషల్‌మీడియాలో అప్‌లోడ్ చేశా. అది కాస్తా నెట్టింట వైరల్‌గా మారింది. హీరో లుక్ బయటకు రావడంతో నిర్మాణ సంస్థ కంగారు పడింది. నాకు తెలిసి జీవితంలో నేను చేసిన పెద్ద తప్పు అదే. ఒక అభిమానిగా ఇప్పటికీ బాధపడుతుంటా. ఆ తర్వాత దానిని డిలీట్ కూడా చేసేశా' అని రాహుల్ సిప్లిగంజ్ తెలిపారు. కథానాయికల్లో దీపికా పదుకొణె అంటే తనకు ఎంతో ఇష్టమని చెప్పారు. 'ఆస్కార్' వేదిక మీద ఆమె తమని పరిచయం చేసినప్పుడు.. తాను ఎంతో ఆనందించానని అన్నారు.



# కాస్ట్ కౌచింగ్ అంతా దుష్ప్రచారమే

### తెలుగు పరిశ్రమపై అనన్య నాగళ్ల

అచ్చ తెలుగమ్మాయి హీరోయిన్ అనన్య నాగళ్ల త్వరలో పొట్టేల్ అనే రూరల్ పిరియాడిక్ డ్రామా సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. దీపావళికి ఈ మూవీ రిలీజ్ కానున్న నేపథ్యంలో తాజాగా ఈ చిత్ర యూనిట్ ట్రైలర్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా కాస్టింగ్ కౌచ్ పై షాకింగ్ ప్రశ్నలు వేయగా నటి అనన్య కూడా అదే రేంజ్‌లో జవాబు ఇచ్చి ఔరా అనిపించింది. తెలుగు అమ్మాయిలు ఇండస్ట్రీలోకి రావాలంటే భయపడతారు.. అవకాశాలు ఇవ్వాలంటే కమిట్మెంట్ అడుగుతారని టాక్ ఉంది కదా మీకు ఇలాంటి అనుభవం ఎదురైందా అని ఓ మహిళా విలేకరి అనన్య కు ప్రశ్న వేసింది. దానికి ఆమె మీరు తెలుసుకోకుండా వంద శాతం ఉంటుందని ఎలా అడుగుతున్నారని జవాబిచ్చింది. మీరు చేసే అగ్రిమెంట్ట్‌లో కూడా ఉంటుందట కదా, మా ఫ్రెండ్సే చెప్పారు అని మరో క్వశ్చన్ వేయగా ఈ వందశాతం తప్పు అని ఆనన్య సమాధానమిచ్చింది. అవకాశం రావడం కంటే ముందే కమిట్మెంట్ అనేది టాలీవుడ్‌లో లేదని, ఎక్కడైనా పాజిటివ్, నెగెటివ్ అనేది సమానంగా ఉంటాయని మీరు ఎక్స్‌పీరియన్స్ చేయకుండా అలా ఎలా అడుగుతున్నారంటూ అనన్య ఆన్సర్ ఇచ్చింది. అంతేగాక నటిగా నేను చెబుతున్నా క్యాస్టింగ్ కౌచ్ పరిస్థితులైతే ఇండస్ట్రీలో లేవని తెలిపారు. నేను ఆ ఫీల్డ్ లోనే ఉన్నా. మీరు అనుకున్నది ఇక్కడ లేదని అనన్య గట్టిగా బదులిచ్చింది. అక్కడ అనన్య సమాధానాలు విన్న చాలామంది అనన్య ధైర్యాన్ని, బయపడకుంగా చెప్పిన విధానాన్ని చాలామంది మెచ్చుకోవడమే కాక చప్పట్లతో ప్రశంసించారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది.





Printed, Published & Owned by **B. Srinivas**, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289, Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S ) Editor: B.Shyamala, **RNI NO. APTEL/2006/18964**, cell : 9100411396, mail: thecrimenews123@gmail.com